


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




సంపుటి 27, సంచిక: 117 | శుక్రవారం | 11-10-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

దసరా శుభాకాంక్షలు!!

## ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

ప్రతి నియోజకవర్గంలో
యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్



11 అక్టోబర్, 2024న

కొందుర్గ్, షాద్‌నగర్ నియోజకవర్గంలో
తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు
**గౌ॥ శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారిచే**
శంకుస్థాపన కార్యక్రమం

నేడే రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 28 స్కూళ్లకు శంకుస్థాపన






### ప్రత్యేకతలు..

- నాలుగు నుండి పన్నెండో తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన
- అత్యాధునిక వసతులతో దాదాపు 25 ఎకరాలలో ఒక్కో స్కూల్ నిర్మాణం
- కుల, మత, వర్గ అంతరాలు లేని విద్యా సౌధం
- డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్లు, 5 వేలకు పైగా పుస్తకాలతో లైబ్రరీలు
- క్రీడలను ప్రోత్సహించేలా క్రికెట్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్ & బాస్కెట్‌బాల్, టెన్నిస్ కోర్టులు

**ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం**

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, అక్టోబరు 11

# కాంగ్రెస్ గుణపాఠాలు తీసుకోవాలి

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో విజేత బిజెపి ఎత్తుగడలు, వ్యూహాలు ఫలించినట్లు, పరాజిత కాంగ్రెస్ పార్టీ ఆత్మవిమర్శతో గుణపాఠాలు తీసుకోవాలని స్పష్టమైంది. రెండు జాతీయ పార్టీలు ముఖాముఖీ తలపడిన రాష్ట్రాల్లో కాంగ్రెస్ బిజెపికి గట్టిపోటీ ఇచ్చినా పరుగుపందెం చివరి మైల్లో వెనుకబడటం, అధికారాన్ని బిజెపికి అప్పగించటం కొనసాగుతోందని హర్యానా ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. హిందీబెల్టుగా పిలవబడే రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ఘడ్, ఉత్తరాఖండ్, హర్యానాల్లో ఇదే జరిగింది. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలమైన ప్రాంతీయ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా ఉంది. ఒక్క హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రమే అది సొంతబలంతో అధికారంలో ఉంది. ఝార్ఖండ్‌లో జెఎంఎంతో అధికార భాగస్వామిగా ఉంది. ప్రస్తుత హర్యానా ఫలితాలనే తీసుకుంటే అక్కడ స్వయం కృతాపరాధంతో కాంగ్రెస్‌కు తగిలిన ఎదురుదెబ్బ, జమ్మూ–కశ్మీర్ లో కూడా తమ విజయాలు ఉత్సాహం కలిగించేవిగా ఉండకపోవటం త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్, వచ్చే సంవత్సరారంభంలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అలయెన్స్ రాజకీయాలపై ప్రతికూల ప్రభావం చూపటం గమనించదగింది. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో ఎంవిఎ కూటమిలో పెద్దపార్టీగా అవతరించిన కాంగ్రెస్, హర్యానా ఫలితాల ముందువరకు, అసెంబ్లీ ఎన్నికలకు సీట్ల సర్దుబాటులో ఆధిక్యస్థానంలో ఉంది. ఇప్పుడేమో ఉద్దవ్ థాక్రే శివసేన, శరద్ పవార్ ఎన్‌సిలు కాంగ్రెస్‌ను కుదించే ఒత్తిళ్లు చేస్తున్నాయి. ఝార్ఖండ్‌లో ఝార్ఖండ్ ముక్తిమోర్చా తమ కూటమి భాగస్వామి కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో కేటాయించిన సీట్లు కోతపెట్టే ప్రయత్నంలో ఉంది. ఇక ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తే లేదంటున్నది ఆమ్ ఆద్మీ పార్టీ.

జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు రాష్ట్రస్థాయిలో సఖ్యతలేకుండా వ్యవహరించటం బిజెపికి అయాచిత వరమవుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో పెరిగిన పునరుజ్జీవన ఆశలు, కాంగ్రెస్ ఎదుగుదలను నిరోధించాలనే మిత్ర ప్రాంతీయపార్టీల ఆలోచనలు రెండూ ఇందుకు కారణం. హర్యానాలో కాంగ్రెస్ ఓటమి ఆ ఒక్క రాష్ట్రానికే పరిమితమైంది కాదు. బిజెపి–కాంగ్రెస్ మధ్య ఓట్లలో తేడా దాదాపు 0.6శాతమే (బిజెపి 39.9, కాంగ్రెస్ 39.3శాతం) కావచ్చు. బిజెపి ఓటమి ఖాయమన్న వాతావరణం ఏర్పడిన రాష్ట్రంలో ఆ పార్టీ 8 సీట్లు పెంచుకుని 48 సీట్లతో మెజారిటీ మార్క్‌ను ఎలా దాటగలిగింది? కాంగ్రెస్ సీట్లు కూడా 6 పెరిగి 37 దగ్గర ఆగిపోయాయి. గెలుపుపై అతిశయించిన ఆత్మవిశ్వాసం, అగ్రవర్ణ జాట్‌ల ఆధిపత్యం, అంతర్గత ముఠా తగాయిదాలు కాంగ్రెస్ ఓటమికి మూలమని అందరూ అంగీకరిస్తున్నారు. అయితే చిన్న చిన్న పార్టీలతో సర్దుబాటులో వైఫల్యం కూడా ప్రధాన కారణం. ఆప్, వామపక్షాలతో సీట్ల సర్దుబాటు జరిగి ఉంటే ఆ మార్జినల్ ఓట్లు కాంగ్రెస్‌ను గట్టెక్కించేవి. బిజెపి ఓటు గతంతో పోల్చితే 3.4 శాతమే పెరగ్గా, కాంగ్రెస్ ఓటు 11.2 శాతం పెరగటం సామాన్య విషయం కాదు. చిన్న పార్టీలతో సర్దుబాట్లే అవసరం లేదన్న మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా వైఖరి కొంపముంచింది. అధిష్టానం ముఠా తగాయిదాలను సకాలంలో సరిదిద్దలేకపోవటంతో దళితనేత కుమారి షెల్జాకు అన్యాయం జరిగిందన్న భావనను బిజెపి క్యాష్ చేసుకుంది. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌ల్లో పొత్తులు వద్దన్న స్థానిక నాయకత్వాన్ని కాదనలేని కాంగ్రెస్ నాయకత్వ బలహీనతే హర్యానాలో కూడా పార్టీకి చేటుచేసింది. రాహుల్‌గాంధీ ఆప్‌తో సీట్ల సర్దుబాటుకై రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి చేసి కూడా ఒప్పించటంలో విఫలమైనారు. కాబట్టి ఈ ఎన్నికల నుండి కాంగ్రెస్ లోతైన గుణపాఠాలు తీసుకోవాలి. అన్ని రాష్ట్రాల్లోను ఇండియా కూటమి బలోపేతం లక్ష్యం కావాలి.

బిజెపి ఎత్తుగడల నుంచి నేర్చుకోవచ్చు. పదేళ్లుగా అధికారంలో ఉన్నచోట్ల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు ముఖ్యమంత్రులను మార్చారు. హిందూత్వ కార్డును బలంగా ప్రయోగిస్తూనే, ఒబిసి, దళిత ఓట్లకోసం ఆ నాయకత్వాన్ని ప్రోత్సహించారు. మధ్యప్రదేశ్, చత్తీస్ఘడ్, రాజస్థాన్, ఒడిశాల్లో ఒబిసి, ఎస్‌టి నేతలను ముఖ్యమంత్రులను చేసి అగ్రవర్ణాలను ఉపముఖ్యమంత్రులను చేశారు. హర్యానాలో అదే మంత్రం ప్రయోగించి సఫలమైనారు. బిజెపికున్న సంస్థాగత నిర్మాణం, ఆర్‌ఎస్‌ఎస్ కేడర్ల పనితీరు పట్టణాలపై పట్టు బిగిస్తోంది. హర్యానాలో హ్యాట్రిక్ విజయం పార్టీపై, ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోదీ పట్టును పునరుద్ధరించింది ఆర్‌ఎస్‌ఎస్–మోదీ మధ్య ఎ డముఖం – పెడముఖంపై లోక్‌సభ ఫలితాల తర్వాత ఎన్ని కథలు, కథనాలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ ఈ ఫలితాలు వాటన్నింటినీ పూర్వపక్షం చేశాయి.

# వైద్య విద్యపై మూఢనమ్మకాల నీడలు

డా.అరుణ్ మిత్ర

**ఒకనాడు ఆదిమ మానవుడు వర్షం, అగ్నికీలలు, దావానలం, భూకంపాలు వంటి వివిధ రకాల ప్రకృతి ధర్మాలకు కారణాలు తెలియక అదంతా అలౌకిక, దివ్యశక్తుల ప్రభావమేనని విశ్వసించేవాడు. వ్యాధులు కూడా దివ్యశక్తుల ఆగ్రహంవల్లే వస్తున్నాయని నమ్మేవాడు. తలవంచి నమస్కరించి పూజలు చేసి ఆ దివ్యశక్తిని శాంతింపజేయడమే పరిష్కారమని ఆదిమ మానవుడు తలపోశాడు. తర్వాతికాలంలో ఈ అనారోగ్యాలకు, వ్యాధులకు కారణాలు కనిపెట్టేందుకు మానవజాతి ప్రయత్నం చేసింది. వాటి పరిష్కారాలు ప్రకృతిలోనే ఉన్నాయని కాలగతిలో మానవుడు కనుగొన్నాడు. ఈ పరిశోధనా ఫలితాలే ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో విభిన్న వైద్య వ్యవస్థలు అభివృద్ధి చెందడానికి దారితీశాయి.**

ఉద్ధృత పరిశోధనల ద్వారా రోగమూలాలు, రోగ కారకాలు తెలుసుకుని రకరకాల ఔషధాలు, శస్త్రచికిత్సలను అభివృద్ధి చేయడం ద్వారా ఆధునిక వైద్య వ్యవస్థ శాస్త్రీయ దృక్పథంతో మరింత పురోగతి సాధించింది. అప్పటివరకూ వ్యాధులు రావడానికి వల్లెవేసిన మూఢనమ్మకాలు, పుక్కిట పురాణాలను శాస్త్రీయ దృక్పథం పటాపంచలు చేసింది. ఇంత అభివృద్ధి, ఆధునిక సాంకేతిక నవీన విజ్ఞాన ఆవిష్కరణలు జరుగుతున్నప్పటికీ ఆరోగ్య రక్షణ విషయంలో ఈనాటికీ మన సమాజంలో ఇంకా ఎన్నో అశాస్త్రీయ కల్పిత కారణాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఇలాంటి నిరాధార మూఢ ఆలోచనలు వ్యవస్థీకృతమై శాశ్వతంగా తిష్ఠవేసుక్కూర్చున్నాయి. ఇలాంటి అశాస్త్రీయ, కాలంచెల్లిన ఆలోచనలన్నీ కాలపరీక్షకు నిలబడలేక ఓడిపోయాయి. ఐనా కొద్దో గొప్పో సమాజంలోని అన్ని వర్గాల్లోనూ పాతుకుపోయే ఉన్నాయి. విజ్ఞానశాస్త్రంలో సాధించిన ప్రతి అభివృద్ధి ఘట్టమూ అనివార్యంగా శాస్త్రీయ ఆలోచనలకు దారితీయదు. సాంకేతిక పురోగతి ని ప్రజలు నిత్య జీవిత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారుగానీ, పురాతనకాలంనాటి అశాస్త్రీయ ఆలోచనలనే అంటిపెట్టుకుని ఉండిపోతున్నారు. శాస్త్రీయ ఆలోచనలు వ్యాప్తిచెందాలంటే ప్రజలను చైతన్యవంతులను చేయడానికి అందరూ కృతనిశ్చయంతో కలసికట్టు కృషి చేయడం ఎంతో అవసరం. శాస్త్రీయ విజ్ఞాన ప్రాతిపదికపై ఆధారపడిన ఆరోగ్యవిద్య మెదడుకు హత్తుకునేట్టుగా బాల్యం నుండీ పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. దానివల్ల పెద్దయ్యాక వారు అకారణ, మూఢవిశ్వాసాల వలలోపడే అవకాశం ఉండదు. ఆరోగ్య విషయాల్లో కూడా ఇలాంటి మూఢనమ్మకాల బారిన పడితే చివరకు కేన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులప్పుడు కూడా బాధా నివారణకోసమో, వ్యాధి నివారణకోసమో, ఉపశమనంకోసమో మూఢ బోధకులను ఆశ్రయిస్తారు. దీనివల్ల పరిస్థితులు చేతులు దాటిపోయి రోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

**చిన్నఅమ్మవారు, ఆటలమ్మ... వ్యాధులకు దేవతలపేర్లు**

అంటురోగాలు, అంటురోగాలు కానివీ అనే తేడా లేకుండా ఆరోగ్యానికి సంబంధించి సమాజంలో పాతుకుపోయిన అనేక కల్పిత కథ లు వ్యాప్తిలో ఉన్నాయి. పలు లోపాల వల్ల మనిషికి వచ్చే రోగాలకు దేవతలపేర్లు చెలామణీలో ఉన్నాయి. మూర్ఛరోగానికీ, స్మృహతప్పిపడిపోయే అపస్మారకస్థితికి కూడా దేవతలు, దయ్యాలపేర్లే చెలామణీలో ఉన్నాయి. మూర్ఛరోగానికి దయ్యం పట్టిందంటారు. మంత్రగత్తెను పిలిపించి దయ్యం వదిలించాలంటారు. ఇలాంటి వాళ్ళకి మురికిపట్టిన బూట్లు, చెప్పులు వాసన చూపిస్తే దయ్యం వదిలిపోతుందంటారు. దేశంలోని కొన్ని ప్రాంతాలలో పాలు–జిలేబీ కలిపి తినిపిస్తే సుఖవ్యాధులు నయమవుతాయనే భావనలు వ్యాప్తిలో ఉన్నా యి. చాలా రోగాలకు, వ్యాధులకు ఒక కాలపరిమితి ఉంది. వాటిని తట్టుకుని నిలబడితే ఒక నిర్దిష్టకాలంలో ఆ రోగం, వ్యాధి తగ్గిపోతుం ది. అప్పటివరకూ వైద్యపరంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వైరస్ వల్ల గవజబిళ్ళలు వస్తాయి. కొన్ని వారాలకు వాటంతటవే తగ్గిపోతాయి. కానీ కొన్ని ప్రాంతాలలో గవజబిళ్ళలు వస్తే, కుండలు చేసే కుమ్మరి దగ్గరకు రోగిని తీసుకువెళతారు. సదరు కుమ్మరి మంత్రాలు జపించి మట్టిని రోగి బుగ్గలకు రాస్తే రోగం నయమవుతుందన్న నమ్మకాలు వ్యాప్తిలో ఉన్నాయి.



లాలాజల గ్రంథులకు సోకే వైరస్‌వల్ల గవజబిళ్ళలు సహా అనేక రకాల రోగాలొస్తాయి. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే కొన్ని వారాలకే తగ్గిపోతాయి. శరీరమంతా వచ్చే పొక్కులను ఆటలమ్మ, పొంగు, చిన్నఅమ్మవారు, పెద్దఅమ్మవారు అని పిలుస్తారు. లోకాలను ఏలే మహాతల్లికి ఆగ్రహం వస్తే చిన్నఅమ్మవారు ఒంటికి పోస్తుంది అంటారు. ఉత్తరభారతదేశంలో ఈ నమ్మకం ఎక్కువ. దేవతకు మొక్కులుమొక్కి ప్రసన్న చేసుకుంటే అమ్మవారు రోగం తగ్గుతుందని ఇప్పటికీ నమ్ముతారు. ఇక ముక్కుకు కుడి–ఎడమభాగాల్లో ఏదో ఒకవైపు వచ్చే పక్షవాతం (బెల్స్ పాల్సీ) వల్ల మొహంలో ఒకభాగం వంకరపోతుంది. ఎర్రటి ఎండలో మెడ మీద కుంభాకార కటకాన్ని పెట్టి చర్మాన్ని కాల్చి ఈ రోగానికి చికిత్సచేసే నమ్మకాలు కొన్నిచోట్ల ఉన్నాయి.

**ప్రభుత్వం మద్దతిస్తే మూఢనమ్మకాలకు వెర్రితలలు**

ప్రభుత్వాలు మద్దతు ఇస్తే ఇలాంటి మూఢనమ్మకాలు పేట్రేగుతాయి. ప్రభుత్వాలు స్వప్రయోజనాలకోసం ఊతమిస్తే అశాస్త్రీయ పద్ధతులు వెర్రితలలు వేస్తాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 లో ఒకసారి మాట్లాడుతూ, పురాతన భారతదేశంలోనే ఎంతో సాంకేతికపరిజ్ఞానంతో అభివృద్ధికరమైన శస్త్రచికిత్సలు జరిగాయని, ఏనుగు తలను తెగనరికి మనిషి మొండానికి తగిలించి బ్రతికించారని చెప్పుకొచ్చారు. శాస్త్రీయ పునాదులు లేని, రుజువులు, సాక్ష్యాలు లేని ఇలాంటి అంధవిశ్వాసాలను ప్రచారం చేయడానికి ప్రధాన మంత్రి నడుంకట్టారు. వందిమాగధులను వెంటేసుకుని బాజాభజంత్రీలతో ఇలాంటి ఉన్మాద ప్రచారాలు చేస్తున్నారు. గోమూత్రాన్ని, ఆవు పేడను ఆరోగ్య రక్షణకు ఉపయోగించవచ్చునని ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ప్రచారాలకు శాస్త్రీయ పునాదులుగానీ, విజ్ఞానశాస్త్రం మద్దతుగానీ లేదు. ఆసుపత్రులలో జ్యోతిష్కులను నియమించాలని కూడా ఆలోచిస్తున్నారు. గుజరాత్‌లో కొందరు మంత్రులు తాంత్రికుల సదస్సుకు వెళ్ళి వారికి సత్కారాలు చేసివచ్చినట్లు వార్తలు కూడా వచ్చా యి. ఇక 'గర్భ విజ్ఞాన సంస్కార్' అనే కార్యక్రమాన్ని ఆరోగ్య భారతి ద్వారా అమలుకు ఆలోచిస్తున్నారట! 'గర్భ విజ్ఞాన్ సంస్కార్' అంటే భార్యాభర్తలు శారీరకంగా ఒక్కటయ్యే సమయంలో కొన్ని శ్లోకాలను జపిస్తే వారు కోరుకున్న పద్ధతుల్లో కోరుకున్నవిధంగా ఉత్తమ సంతతి కి జన్మనిస్తారట! భార్యాభర్తలకు ఇలాంటి జ్ఞానాన్ని పంచిపెట్టేందుకు వర్క్‌షాపులు నిర్వహించాలని ప్రభుత్వ ప్రబుద్ధులు ఆలోచిస్తున్నారు.

**సమాజాన్ని వెనక్కు నెట్టే జిత్తులమారి కుటిల చర్యలు**

స్త్రీ గర్భంలోంచి కాకుండా స్టెమ్ సెల్ అడ్వాన్స్‌డ్ క్లోనింగ్ టెక్నిక్ ద్వారా వందమంది కౌరవ సంతానం పురాతనకాలంలోనే కుండల్లోంచి పుట్టుకువచ్చిందని ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ మాజీ వైస్ – ఛాన్సలర్ డా.నాగేశ్వరరావు కొంతకాలం క్రితం ప్రవచించా రు. ఇలాంటి వాదనలకు ఆధారాలు, రుజువులూ లేవు. ఇలాంటి ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో పుక్కిట పురాణాలను, మూఢనమ్మకాలను, ఛాందసత్వాన్ని, అభివృద్ధి నిరోధక ఆలోచనలను పాతకుపోయేట్టు చేయడంతప్ప మరో ప్రయత్నమేమీ కాదు. ఈ మధ్య ఐఐటి డైరెక్టర్ మంది లక్ష్మీ ధర్ బెహెరా కూడా ఒక సందర్భంలో మాట్లాడుతూ, ఆత్మ శరీరాన్ని వదిలివెళ్ళిపోయినప్పుడు మాత్రమే గుండె కొట్టుకోవ డం ఆగిపోతుందని చెప్పారు. అంటే గుండె ఆగిపోవడానికి వైద్యరంగం చెప్పే వైజ్ఞానిక కారణాలన్నీ వట్టి బూటకపు మాటలైపోతా యా? ఇటీవల లోక్‌సభ ఎన్నికలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇలాంటి విషయాన్నే ప్రచారం చేశారు. "దేవుడు తనను నేరుగా ఈ భూలోకానికి పంపించాడు" అని ఆయన ప్రచారం చేశారు. అంటే దాని అర్థం ఆయన తన తల్లిగర్భంలోంచి జన్మించలేదనే? ఇలాంటి ప్రచారాలతో సమాజాన్ని మధ్యయుగాల్లోకి నెట్టేయాలనుకునే బిజెపి – ఆర్ఎస్ఎస్ జిత్తులమారి కుటిలచర్యలు తప్పఇంకేమీ కాదు. ఆడ నెమలి శారీరక సంగమం ద్వారా కాకుండా మగ నెమలి కార్చే కన్నీళ్ళను తాగి సంతానానికి జన్మనిస్తుందని రాజస్థాన్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మహేశ్ చంద్ శర్మలాంటివాళ్ళు ప్రచారం చేస్తున్నారు. హేతువాదులు, శాస్త్రీయదృక్పథంగల ఆలోచనాపరులు ఈ ప్రచారాలను నిలదీయాలి. ఎంతో సమర్థవంతంగా వీటిని ప్రతిఘటించాలి. మధ్యయుగాల ఆలోచనలతో ఆధునిక సమాజాన్ని ఆవిష్కరించలేం. నిర్హేతుకమైన, జ్ఞానహీన ఆలోచనలతో ప్రజల ఆరోగ్యాన్ని ముఖ్యంగా స్త్రీలు, పిల్లల ఆరోగ్యాన్ని బలిపెట్టకూడదు. స్త్రీలకు మానసిక వైద్యం చేయకుండా పిచ్చి ఎక్కిందనీ, దయ్యం పట్టిందనీ ముద్రవేసి సమాజం ఎలా వెంటపడి తరుముతోందో మనం చూస్తూనే ఉన్నాం. అందువల్ల సంపూర్ణ ఆరోగ్యవంతమైన భారత సమాజాన్ని సృష్టించాలంటే శాస్త్రీయ ఆలోచనా దృక్పథంలో కలసికట్టుగా కృషి చేయాలి.

దేశంలో ప్రజల ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంది. మూఢనమ్మకాలవల్ల ప్రజలు ఇంకా అజ్ఞానాంధకారంలోకి వెళ్ళి దోపిడీకి గురవుతారు. మూఢత్వం, ఛాందసవాదమే ఒకప్పుడు ప్రపంచాన్ని ఏలింది. కానీ అనేక దేశాలు దాన్నుండి బైటపడి అభివృద్ధి చెందాయి. కానీ మనదేశంలో ఈనాటికీ కూడా పాలకులే తమ అధికారం ద్వారా ప్రజలను అంధవిశ్వాసాల్లో, మూఢనమ్మకాల్లో మగ్గిపోయేట్టు చేయాలనుకోవడం సిగ్గుచేటు.

# పారిశ్రామిక దిగ్గజం...రతన్ టాటా

భారతదేశపు మెరిసే నక్షత్రం వెలిసిపోయింది. తరాలకు స్ఫూర్తినిచ్చిన మేధావి రతన్ టాటా, ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడు. ఉప్పు నుండి ఉక్కు వరకు, టీ నుండి ట్రక్స్ వరకు ఇలా ప్రతి దానిలో టాటా పేరు వినబడుతుంది. 23 లక్షల కోట్ల రూపాయల విలువతో, సుమారుగా 8 లక్షల మంది ఉద్యోగులతో మన దేశంలోనే అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యంగా టాటా కంపెనీ మొదటి స్థానంలో నిలిచింది. ఇంత పెద్ద కంపెనీని విజయవంతంగా నడిపించిన వ్యక్తి రతన్ టాటా.

రతన్ టాటా డిసెంబర్ 28, 1937 సంవత్సరంలో దేశంలోనే అత్యంత ధనిక కుటుంబంలో జన్మించారు. ఈయనకి 10 ఏళ్ల వయసు ఉన్నప్పుడు తల్లిదండ్రులిద్దరు విడిపోవడంతో వాళ్ళ నానమ్మ దగ్గర పెరిగారు. తరువాత అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పూర్తి చేసారు. వెంటనే ఐబిఎం కంపెనీలో ఉద్యోగం వచ్చింది.. కానీ జె ఆర్ డి టాటా, రతన్ టాటా ని ఇండియాకి వచ్చి టాటా స్టీల్ లో చేరమని సలహా ఇవ్వడంతో అమెరికా నుండి ఇండియాకి వచ్చి జంషెడ్‌పూర్ టాటా స్టీల్ ప్లాంట్ లో అప్రెంటిస్‌గా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. తరువాత 1991లో జె ఆర్ డి టాటా, రతన్ టాటా ని టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమించారు. ఈయన హయాంలో టాటా గ్రూప్ పరుగులు తీసింది. పదివేల కోట్ల రూపాయలుగా ఉండవలసిన వ్యాపారాన్ని 23 లక్షల కోట్లకు చేర్చాడు రతన్ టాటా.

**రతన్ టాటా, ప్రయాణంలో ఎన్నో అవరోధాలు**

రతన్ టాటా, ప్రయాణంలో ఎన్నో అవరోధాలను అవమానాలను ఎదుర్కొన్నాడు. దానికి ఒక ఉదాహరణగా చూస్తే. 1998 లో రతన్ టాటా .. టాటా ఇండికా కార్లను ప్రవేశపెట్టారు. ఆ కార్లు మొదట సంవత్సరం ఫెయిల్ అయ్యాయి. దాంతో అందరూ టాటా ఇండికాను అమ్మెయ్యాలని సలహా ఇచ్చారు. దానికి టాటా కూడా ఒప్పుకుని .. ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మడం కోసం అమెరికాలోని ఫోర్డ్ కంపెనీకి టాటా మరియు ఆయన టీం వెళ్లారు. అయితే ఆ మీటింగ్ లో ఫోర్డ్ కంపెనీ చైర్మన్, రతన్ టాటాతో మీకు కార్లు ఎలా తయారు చెయ్యాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేసారు అని టాటాను మరియు అయన టీంని అవమానపరిచారు. దాంతో టాటా ఆ ఒప్పందం మాట్లాడకుండానే తిరిగి ముంబైకి వచ్చేసారు.,



**ఎక్కడ అవమానం పొందాడో అక్కడే గౌరవం పొందాడు..**

కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాల నుండి లాభాల బాట పట్టింది. అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన లగ్జరీ కార్లు జాగ్వర్ లాండ్ రోవర్ కంపెనీలు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయంలో రతన్ టాటా ఫోర్డ్ కంపెనీకి, జాగ్వర్ లాండ్ రోవర్ రెండు కంపెనీలను తాను కొంటానని ఆఫర్ చేసారు. ఈసారి ఫోర్డ్ కంపెనీకి చెందిన టీం అమెరికా నుండి ముంబైకి చేరుకొని టాటాను కలుసుకుంది. అలా నష్టాల్లో ఉన్న జాగ్వర్ లాండ్ రోవర్ లను 9300 కోట్ల రూపాయలకు స్వాధీనం చేసి ఆ రెండింటిని మళ్ళీ లాభాల బాట పట్టించాడు. ఈ విధంగా ఎవరైతే తనను అవమానించి తక్కువగా చూసారో వాళ్లనే తన దగ్గరికి వచ్చేలా చేసుకున్నారు రతన్ టాటా.

**లాభాలను సమాజసేవ కోసం ఖర్చుచేసేవారు**

మరి ఇంత పెద్ద కంపెనీని నడుపుతున్నప్పటికీ కూడా రతన్ టాటా భారత దేశంలో గాని ప్రపంచ ధనవంతుల జాబితాలో గాని ఏనాడూ కనిపించలేదు. ఎందుకు అంటే టాటా కంపెనీకి వచ్చే లాభాలలో 66%శాతం టాటా ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న స్వచ్ఛంధ సేవ సంస్థలకే వెళ్ళిపోతుంది. ఒకవేళ ఈ ఆస్తి అంతా సేవ సంస్థలకి కాకుండా రతన్ టాటా కి చెందినట్టయితే ప్రపంచ ధనవంతుల జాబితాలో మొదటి ముగ్గురిలో రతన్ టాటా తప్పకుండా ఉండేవారు, టాటా గ్రూప్ ఎప్పుడు కూడా తన కుటుంబం కోసమో, వ్యక్తిగత ఆస్తులను కూడపెట్టడం కోసమో వ్యాపారం చెయ్యలేదు. కంపెనీకి వచ్చిన లాభాలలో 66% సమాజసేవ కోసం ఖర్చుచేసే ఏకైక కంపెనీ ప్రపంచంలోనే టాటా గ్రూప్ ఒక్కటే.

**ఉద్యోగ అవకాశాలు సృష్టించిన ఉద్యోగ రత్నం**

రతన్ టాటాకు యువత మీద, వాళ్ళ శక్తి మీద మంచి నమ్మకం ఉంది. అందుకే స్నపడియల్, పేటీయం కార్దెకో, బ్లూస్టోన్, ఓలా, షియోమి, ఇలా 39 కి పైగా స్టార్టప్ లలో పెట్టుబడులు పెట్టి ప్రోత్సహించారు.అలాగే టాటా ట్రస్ట్, దేశంలోని మారుమూల ప్రాంతాలలోని పేద ప్రజలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్యాన్ని అందించే దిశగా కృషి చేస్తుంది. ఇప్పటికి మన దేశంతో పాటుగా విదేశాలలో చదువుకుంటున్న ఎన్నో వేల మంది భారతీయ విద్యార్థులకు టాటా ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయి. అలాగే తాజ్ హోటల్ లో ఉగ్రవాదుల దాడిలో గాయపడిన చనిపోయిన కుటుంబాలకు రతన్ టాటా ప్రత్యేకంగా సేవలందించారు.

**బిజినెస్ టైకూన్‌గాపేరు తెచ్చుకున్న రతన్ టాటాను..** 2000లోనే రతన్ టాటాను పద్మ భూషణ్ వరించింది. 2008లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్‌తో అప్పటి కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ, ఒహియో స్టేట్ యూనివర్శిటీ, ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ ఐఐటి ఖరగ్‌పూర్‌తో సహా పలు ప్రతిష్టాత్మక సంస్థల నుంచి గౌరవ డాక్టరేట్‌లను కూడా రతన్ టాటా అందుకున్నారు. అక్టోబర్ 09న రాత్రి ముంబైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ ఛైర్మన్ రతన్ టాటా గారు తుదిశ్వాస విడిచారు. 86ఏళ్ల వయసున్న రతన్ టాటా.. వయో భారానికి సంబంధించిన అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరగా ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు వదిలారు. రతన్ టాటా ఆస్తులకు వారసులు ఎవరో తెలియదు కాని ఆయన ఆశయాలకు వారసులుగా ఉండడానికి సిద్ధం అవుదాం ..

జాజుల దినేష్, 9666238266

# భద్రత కరువైన అభాగ్య భారత బాలికలు

బాలిక అంటే భారం. ఆడ పిల్లంటే అత్తారింటి ఆడదే. భారతంలో బాలికలు నిర్భయలు, ఉన్నావ్‌లు, హత్రాస్‌లు, దిశల గత భయానక అనుభవాలతో అనుక్షణం శీలాన్ని అరచేతిలో పెట్టుకొని భయపడుతూ బతుకుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 18ఏళ్ళలోపు వయసున్న బాలికలు 1.1 బిలియన్లు ఉన్నారు. విశ్వవ్యాప్తంగా బాలికల పలు సమస్యలు, భద్రత, సాధికారత, లింగ వివక్ష, విద్య వంటి అంశాలను చర్చించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కెనడా మహిళ 'రోనా ఆంబ్రోస్' చొరవతో ఐక్యరాజ్యసమితి 2012 నుండి ప్రతియేటా 11 అక్టోబర్‌న అంతర్జాతీయ బాలికల దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్ చైల్డ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

బాలికలను విద్యకు దూరం చేయడం, అమ్మాయిల్ని వంటింటికి పరిమితం చేయడం, బాల్యవివాహాలు, పోషకాహారలోపం, హక్కుల్ని కాలరాయ డం, కుటుంబంలో నిర్ణయాధికారం లేకుండా ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పక్కన బెట్టడం, వివక్ష నుండి రక్షించడం, లైగింక హింసలు, మానభంగా లు, బాలికల్ని కార్మికులుగా మార్చడం, వైద్య సదుపాయాల లేమి, లింగ వివక్ష లాంటి పలు సమస్యలు అనాదిగా వస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా 62 మిలియన్ల బాలికలు నిరక్షరాస్యతతో సతమతమవుతూ వంటింటికి, తమ వృత్తులకే పరిమితం అవుతున్నారు. పేద కుటుంబాలలో 80 శాతం బాలికలు ప్రాథమిక విద్యకు కూడా దూరం అవుతున్నారు. ప్రపంచ బాల్యవివాహాలలో 33 శాతం ఇండియాలో జరుతున్నాయని అంచనా. భారత మహిళల్లో 75 శాతం ఏదో ఒక గృహ హింసకు గురి అవుతున్నారు. గ్రామీణ బాలికలు వ్యవసా య కూలీలు, బీడీ కార్మికురాళ్లు, బాల్య వివాహా లు, వంట పనులు, ఇటుక బట్టీలు, అసంఘటిత రంగాల్లో తమ బాల్యాన్ని కోల్పోతున్నారు.

**బాలికల అభ్యున్నతి మార్గాలు:** అంతర్జాతీయ బాలికల దినం2024 సందర్భంగా బాలికల అభిప్రాయాలతో సుస్థిరాభివృద్ధి అనబడే నినాదం తీసుకున్నారు. కౌమారదశలో ఉన్న అమ్మాయిలను లింగ వివక్ష లేకుండా సాధారణ జనజీవన స్రవంతిలోకి ఆకర్షించడానికి ప్రభుత్వాలు పలు చట్టాలను చేసి అమలు చేస్తున్నారు. బాలికలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్య సదుపాయాలు, గౌరవప్రద జీవితం, ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం, లైంగిక వేధింపుల కట్టడి, అత్యాచారం చేసిన వారికి కఠిన దండన, హక్కుల కల్పన, ఆస్థి హక్కు, నాయకత్వ అవకాశాల కల్పన, గృహహింస లేకుండా చూడడం, నైపుణ్యాభివృద్ధి, మహిళా భద్రత, బాల్యవివాహాల రద్దు, అన్ని రంగాల్లో సమాన అవకాశాల కల్పన లాంటి సకారాత్మక చర్యలు తీసుకుంటున్నారు. అమ్మాయిలకు అబ్బాయిలతో సమానంగా విద్య, వైద్య, ఉద్యోగ ఉపాధి, లింగ సమానత్వం, వృత్తి నైపుణ్య వికాసం, పోషకాహారం, బాల్యవివాహా లు, బాల కార్మిక వ్యవస్థ నిషేదించడం, సదుపాయాల కల్పన, విద్యాలయాల్లో టాయిలెట్ల ఏర్పాటు, ఆస్థి హక్కు కల్పన, ఆచారాల పేరుతో అమ్మాయిల అణచివేత, ప్రసూతి ఆసుపత్రుల అందుబాటు, లింగ ఆధారిత అత్యాచారాల కట్టడి, పరిసరాల పరిశుభ్రత చర్యలను తీసుకోవాలి. అదే జరిగితే అమ్మాయిలు భూమి, ఆకాశం, సముద్ర జలాల్లో తమ సత్తా చాటుకునే అవకాశాలన్నింటిని తీసుకొని, అబ్బాయిలతో సమానంగా, కొన్నిసార్లు ఉత్తమంగా తమ విధులను నిర్వహిస్తున్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో యువతుల్ని ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి:** మహిళ అంటే అమ్మ, ఆలి, అక్క, చెల్లి, కూతురు, బాధ్యతగల పౌరురాలు, నాయకురాలు, మార్గదర్శి, ఔత్సాహికురాలు, ఉద్యోగిని, ఆర్థిక ఆధారం వంటి పాత్ర నిర్వహిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. మహిళా సాధికారతతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుంది. 2021 వరకు ప్రపంచంలో 435 మిలియన్ల మహిళలు దినసరి కనీస ఆదాయం పొందలేని దుస్థితిలో ఉంటారని అంచనా.

**లింగ నిష్పత్తి సమస్య:**

భారతదేశంలో 2020 అంచనాల ప్రకారం 108 పురుషులకు 100 మహిళలు ఉన్నారు (1000:924). ఇండియా జనాభాలో 51.96 శాతం పురుషులు, 48.04 శాతం మహిళ లు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా పురుషులు 50.4 శాతం, స్త్రీలు 49.6 శాతం ఉన్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గడానికి కారణాలుగా గర్భంలో అమ్మాయి ఉందని తెలిసి భ్రూణహత్యలకు పాల్పడడం, ఆరోగ్య సదుపాయాల లేమి, బాల్యవివాహాలతో కౌమారదశలోనే గర్భం దాల్చడం, ప్రసూతి ఆసుపత్రులు సమీపంలో లేకపోవడం, అవిద్యతో అవగాహనాలేమి లాంటివి చెప్పవచ్చు. భ్రూణహత్యల్లో 90 శాతం గర్భస్థ శిశువు ఆడపిల్ల కారణమని తేలింది. దీనిని గమనించిన ప్రభుత్వాలు లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించింది.

**లింగ సమానత్వ సాధనకు ప్రభుత్వ ప్రయత్నాలు:** భ్రూణహత్యల నిరోధానికి 'కిషోరి శక్తి యోజన', ప్రసూతి వైద్య సదుపాయాల కల్పనకు 'సమృద్ధి యోజన', వైద్య సదుపాయాల కల్పనకు 'ఆయుస్మతి యోజన' పథకాలను అమలు చేస్తున్నారు. 2015లో బేటీ బచావో, బేటీ పడావో పథకంతో కేంద్ర ప్రభుత్వ బాలికల అభ్యున్నతికి కృషి చేస్తున్నది. ఆడ పిల్లల్ని రక్షించుకోవడం, ఉన్నత విద్య అందించడం, భ్రూణహత్యలను నిరోధించడం, మహిళలపై అత్యాచారాలను కట్టడి చేయడం లాంటి చర్యలతో లింగ వివక్ష సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. చదువులో సరస్వతి, సంపదలో లక్ష్మి, ధైర్యంలో దుర్గమాతలు మనకు ఆదర్శ మహిళలని నమ్మిన సంస్కృతి గల హిందుస్థాన్‌లో యువతుల పట్ల వివక్ష జాతికే సిగ్గు చేటు. మహిళలో అమ్మను, చెల్లిని చూద్దాం. అమ్మాయిలను మహాశక్తి రూపాలుగా పూజిద్దాం.

**(11 అక్టోబర్ 'అంతర్జాతీయ బాలికల దినం' సందర్భంగా)**

బిఎంఎస్ రెడ్డి, 9949700037

# మళ్ళీ మనకు నోబెల్ వెలుగులు ఎప్పుడు?

ఎన్నో శతాబ్దాల క్రిందటే ప్రపంచ విజ్ఞానానికి గణితం, ఖగోళ శాస్త్రం, ఆయుర్వేదం, రసాయన శాస్త్రాల్లో మన శాస్త్రవేత్తలు చేసిన కృషి నేటి ఆధునిక సైన్స్ కు పునాదిగా నిలిచింది. ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, మహావీర, వరాహమీర, భాస్కర, పతంజలి, చరక, సుస్రుత, భరద్వాజ తదితరుల వంటి విఖ్యాత శాస్త్రవేత్తల మేధస్సు ప్రపంచపు పరిజ్ఞానాన్ని ప్రభావితం చేసింది.

ప్రస్తుతం 2024 సంవత్సరపు నోబెల్ బహుమతుల ప్రకటనల సందర్భంగా మనమంతా ఒక్కసారి మన ప్రతిభా పరిజ్ఞానపు ప్రయాణంలో నోబెల్ వెలుగుల గురించి మాట్లాడుకుందాం. మనకు స్వాతంత్ర్యం రాకముందే బ్రిటీష్ వారి క్రింద బానిసత్వపు పాలన కాలంలోనే ఆసియా ఖండంలోనే సాహిత్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్, భౌతికశాస్త్రంలో సి.వి రామన్ వంటి మహానుభావులు తొలి నోబెల్ సాధించి భారతీయుల సత్తా ప్రపంచానికి తెలియజెప్పారు. నేడు జనాభా లోనే అగ్రస్థానంలో వుంటూ,ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ను సైతం ప్రభావితం చేస్తూ, శతాబ్దాల నాగరికతను కలిగివున్న భారతదేశం నుంచి కేవలం మన పౌరసత్వంతో ఫిజిక్స్‌లో, సాహిత్యంలో 78వసంతాల స్వాతంత్ర్య భారత్ నుంచి మనం నోబెల్ బహుమతి గెలవలేకపోయామంటే మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన బిలియన్ డాలర్ల క్వశ్చన్. ప్రతిభకు అత్యుత్తమ కొలమానం నోబెల్ బహుమతి కానప్పటికీ, నోబెల్ కమిటీలపై ఎన్నో వివాదాస్పద వ్యాఖ్యలు వున్నప్పటికీ నోబెల్ బహుమతుల విలువను ప్రపంచం 'విశ్వ విజేత స్థాయి' గానే చూస్తుందనడం కాదనలేని సత్యం.

మన జనగణమన గీతంతో పాటు బంగ్లాదేశ్ దేశపు జాతీయ గీతాన్ని ఠాగూర్ రచించారు. శాంతినికేతన్ స్థాపనతో నేటి ఆధునిక భారతీయ విద్యావిధానంలో కూడా వారి ఆలోచనలు మనకు మార్గదర్శనం చేస్తున్నాయి. ఆల్బర్ట్ ఐన్ స్టీన్, మహాత్మా గాంధీజీ వంటి విఖ్యాత ప్రముఖులతో సైతం ఎన్నో ఆధ్యాత్మిక, తాత్విక, పర్యావరణ, శాస్త్రీయ విశ్లేషణలను పంచుకున్నారు. వివేకానంద వారి రచనల నుంచి ఠాగూర్ ప్రేరణ పొందారు.

'నా మతం సైన్స్. నేను దాన్నే ఆరాధిస్తాను. నిత్య సాధకులైన వారే నా వారసులు' అంటూ కేవలం ₹200 పరికరాల సాయంతో రామన్ ఎఫెక్ట్ ను కనుగొని 1930లో మనకు ఫిజిక్స్ విభాగంలో నోబెల్ అందించారు. నోబెల్ బహుమతి తీసుకునే సందర్భంగా మన దేశపు జెండా లేనందుకు కన్నీటి పర్యంతమవుతూ, నిజాయితీతో కూడిన భావోద్వేగాల తన దేశభక్తిని ప్రదర్శించి నిజమైన భారతరత్నంగా భవిష్యత్తు తరాలకు ఆదర్శమయ్యారు. సి.వి రామన్ బంధువు అయిన సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ విఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. భారతీయఅమెరికన్‌గా నక్షత్రాల పరిణామంపై పరిశోధనలు చేసి చంద్రశేఖర్ లిమిట్ తో ఖ్యాతి గడించారు. వీరి కృషికి గుర్తింపుగా 1983లో విలియం ఎ.ఫౌలర్‌తో కలిసి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. వీరిలాగే మదర్ థెరిస్సా, హరగోవింద్ ఖొరానా, అమర్త్యసేన్, వెంకట్రామన్ రామకృష్ణన్ వంటి వారు మన దేశ మూలాలు కలిగిన నోబెల్ విజేతలు.

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన పరిశోధనలు, ఫలితాలు ప్రపంచ స్థాయిలో లేకపోవడమే నోబెల్‌లో నేటి మన ప్రదర్శనకు ప్రధాన కారణం. అంతరిక్ష పరిశోధనల్లో మంగళయాన్, చంద్రయాన్ వంటి అద్భుత ప్రయోగాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మాట వాస్తవం. కానీ ఇంకా మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలి. విశ్వవిద్యాలయాల్లోని ఉన్నత విద్యలో, పరిశోధనల్లో రాజకీయ జోక్యం వుండకూడదు. బడ్జెట్ పెంచాలి. యువతరాన్ని పరిశోధనలవైపు ప్రోత్సహించాలి. ఫెలో షిప్స్ అమౌంట్ పెంచాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలకు సరైన గుర్తింపు ఇవ్వాలి. శాస్త్రవేత్తల వలసలను ఆపాలి. ఉన్నత విద్యావంతులు రాజకీయాల్లోకి వచ్చి శాస్త్ర సాంకేతిక రంగా ల్లో అభివృద్ధికి నూతన చట్టాలతో కృషి చేయాలి. పాఠశాల స్థాయి విద్యనుంచే గొప్ప గొప్ప శాస్త్రవేత్తల జీవితాల గురించి, సమాజం నుంచి వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, గెలుపోటములకు సంబంధం లేని వారి ప్రయత్నాల పరంపర గురించి విద్యార్థులకు స్ఫూర్తివంతమైన విధానాలతో తెలియజెప్పాలి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అబ్దుల్ కలాం జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్ళాలి. శ్రీనివాస రామానుజన్ వంటి అసాధారణ భారతరత్నాలు ఉదయించాలి. మన శాస్త్ర వేత్తలను నేటి తరాలకు గొప్ప హీరోలుగా పరిచ యం చేస్తూ గౌరవిద్దాం. నవతరం వినూత్న ఆవిష్కరణలతో విదేశీ గడ్డలపై మన జాతీయ పతాకాన్ని ఎగిరేలా మన ప్రయాణం, ప్రయత్నం కొనసాగిద్దాం.

ఫిజిక్స్ అరుణ్ కుమార్, 9394749536

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★







సంపుటి 27, సంచిక: 117 | శుక్రవారం | 11-10-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00



PRAJAPAKSHAM ★

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

6th ANNIVERSARY 22nd October

సంపుటి 27, సంచిక: 117 | శుక్రవారం | 11-10-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

ధరణి, రెవెన్యూ చట్టం పేర్లు మారిస్తే సరిపోదు

'ఒకేదేశం–ఒకే ఎన్నిక' వద్దని కేరళ అసెంబ్లీ తీర్మానం

లోపలి పేజీల్లో









# సద్దుల సంబురం

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఉయ్యాల పాటలతో ఆడిపాడిన పల్లెలు, పట్టణ వాసులు

కాంతులీనిన ట్యాంక్‌బండ్

కిక్కిరిసిన హనుమకొండలోని పద్మాక్షి ఆలయం

## నేడు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు శంకుస్థాపన

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించేందుకు వివిధ జిల్లాల్లోని 28 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో భాగంగా ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం భూమి లభ్యత ఉన్న ఈ 28 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రెండవ దశలో ఇతర ప్రాంతాల్లో భూమిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని సిఎస్ తెలిపారు. బడుగు, బలహీనవర్గాల తరువాయి 6లో




## చెరువులను కాపాడుకుందాం

అందరి భాగస్వామ్యంతో పునరుజ్జీవనానికి చర్యలు తీసుకుంటాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్

చెరువు ప్రకృతికి తల్లిలాంటిందని, పర్యావరణానికి ఆదరువు అని, సాగునీరు, తాగు నీరందించే ఈ చెరువులు పట్టణీకరణతో ప్రభావాన్ని కోల్పోతున్న ప్రస్తుత తరుణంలో అందరి భాగస్వామ్యంతో వాటిని పరిరక్షించుకుంటామని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ తెలిపారు. రోజురోజుకూ హైదరాబాద్ విస్తరిస్తున్న నేపథ్యంలో నాడు చెరువులు, తోటలతో కళకళలాడిన ఈ నగరంలో చాలా చెరువులు కనుమరుగు కాగా మరికొన్ని మురికి కూపాలుగా మారాయని వీటిని పునరుజ్జీవానికి హైడ్రా చర్యలు చేపట్టిందన్నారు. లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఆనంద్ మల్లిగవాడ్‌తో గురువారం తరువాయి 6లో

## హర్యానా ఫలితాలపై త్వరలో నిజనిర్ధారణ కమిటీ

ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో రాహుల్, ముఖ్యనేతల సమీక్ష



**న్యూఢిల్లీ :** అన్ని టెలివిజన్ న్యూస్ ఛానళ్లు ప్రసారం చేసిన హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో ప్రభుత్వం తమదేనని కాంగ్రెస్ శ్రేణులు తొలుత సంబురాలు జరుపుకుంటున్న తరుణంలో హఠాత్తుగా ఫలితాలు తారుమారై 37 స్థానాలకు మాత్రమే పరిమితం కావడాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నమ్మలేకపోతోంది. ఎన్నికల సంఘం (ఈసి) పనితీరుపై, ఓట్లు లెక్కించి గెలుపు ఓటములను నిర్ధారించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవిఎం) పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన ఫలితాలను, ఎన్నికల సంఘం ప్రకటించిన ఫలితాలను బేరీజువేసుకుంటూ ఈ తేడాల వెనక బిజెపి సారథ్యంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పాత్ర ఏమైనా ఉన్నదా అని విశ్లేషించుకునేందుకు సిద్ధపడింది. ఈ తాజా అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఫలితాలు దక్కడంపై ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన గురువారం దేశ రాజధాని ఢిల్లీలో పార్టీ ఒక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీ మాజీ చీఫ్ రాహుల్‌గాంధీ, ఎఐసిసి జనరల్ సెక్రటరీ కెసి.వేణుగోపాల్, ఎఐసిసి సీనియర్ అబ్జర్వర్లు అశోక్ గెహ్లాట్, అజయ్ మాకెన్ తదితర పార్టీ ముఖ్యులతో ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో సమీక్ష సమావేశం జరిగింది. ఎఐసిసి తరపున హర్యానా రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపక్ బబారియా ఆన్‌లైన్‌లో ఈ సమీక్ష సమావేశంలో భాగస్వామి అయ్యారు. అనంతరం హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఎఐసిసి పరిశీలకుడు అజయ్ మాకెన్ విలేకరులతో మాట్లాడారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎవరూ ఊహించని రీతిలో వచ్చాయన్న విషయం అందరికీ తెలుసని, ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్ వెల్లడించిన దానికి పూర్తి విరుద్ధంగా ఎన్నికల సంఘం వెలువరించిన ఫలితాలు ఊహించనిరీతిలో రావడం ఆశ్చర్యపరచేడమే కాకుండా అనుమానాలకు తావిచ్చిందని మాకెన్ అన్నారు. ఈ వ్యత్యాసం కూడా చాలా ఎక్కువగాఉందన్నారు. దీనికి కారణాలపై కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో లోతుగా చర్చించిందన్నారు. దీనిపై ముందుకు వెళ్లేందుకు తగిన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి తరువాయి 6లో

## రతన్‌టాటాకు అంతిమ వీడ్కోలు

భారత పారిశ్రామిక దిగ్గజానికి కేంద్రమంత్రులు, మహారాష్ట్ర సిఎం షిండే సహ ప్రముఖులు నివాళి

సంతాపదినం పాటించిన మహారాష్ట్ర ప్రభుత్వం



**ముంబయి :** భారతదేశ ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణశీలి పద్మ విభూషణ్ రతన్ టాటా (86) అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో గురువారంనాడు సాయంత్రం ముంబయిలో జరిగాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా రతన్ టాటా బుధవారం రాత్రి పొద్దుపోయాక ముంబయి సిటీలోని బ్రీచ్ కాండీ హాస్పిటల్‌లో కన్నుమూశారు. టాటాగ్రూపును ప్రపంచవ్యాప్త ప్రముఖ సంస్థగా విస్తరించిన ఘనత రతన్ టాటాకే దక్కుతుంది. ఆయన మరణంతో దేశ పారిశ్రామికరంగంలో ఒక శకం ముగిసినట్లయింది. వర్లీలోని విద్యుత్ శ్మశాన వాటికలో అంత్యక్రియల సందర్భంలో ముంబయి పోలీసులు గాలిలోకి తుపాకులు పేల్చి రతన్ టాటాకు గౌరవ వందనం చేసి అంతిమ వీడ్కోలు పలికారు. విజయవంతమైన దేశ వ్యాపార దిగ్గజాలలో ఒకరుగా ఆయన ప్రపంచవ్యాప్తంగా పేరుప్రతిష్టలు సంపాదించారు. 1937లో సంప్రదాయ పార్శీ కుటుంబంలో జన్మించారు రతన్ టాటా. పదేళ్ళ వయసులోనే తల్లిదండ్రులు నావల్, సూనీ టాటాలు విడాకులు తీసుకోవడంతో నాయనమ్మే ఆయనను పెంచి పెద్దచేసింది. జీవితంలో నాలుగు సందర్భాలలో వివాహం చేసుకునేందుకు రతన్ టాటా మొగ్గు చూపించినప్పటికీ వివాహం చేసుకోలేదు. అమెరికాలో ఉన్నప్పుడు కూడా ఒకసారి ఇలాంటి వివాహ సందర్భాన్ని ఆయన తప్పించుకున్నారు. ఆయన ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్ళలేదు. కుక్కల ప్రేమికుడు. వీధికుక్కలకోసం ఆయన ముంబయి డౌన్‌టౌన్‌లో ఒక షెల్టర్ ఏర్పాటు చేశారు. ఫాస్ట్ కార్స్‌నూ, స్క్యూబా డైవింగ్‌ను ఇష్టపడతారు. కాలిఫోర్నియాలో స్థిరపడాలని భావించిన రతన్‌టాటా తన నాయనమ్మ అనారోగ్యం కారణంగా 1962లో భారత్‌కు తిరిగి వచ్చారు. 1971లో టాటాగ్రూపు మేనేజ్‌మెంట్ విభాగంలో చేరారు.

ఆయన మృతికి గౌరవ సూచకంగా మహారాష్ట్ర ప్రభుత్వం గురువారం సంతాపదినం పాటించింది. ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ పతాకాన్ని అవనతం చేశారు.ఆయన మరణవార్త విన్న వెంటనే ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మహారాష్ట్ర విద్యాశాఖామంత్రి దీపక్ కేసర్‌కార్ తదితరులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ఆయన మంత్రివర్గ సహచరులు పీయూశ్ గోయల్, కాంగ్రెస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండేసహా పలువురు ప్రముఖులు వర్లీలో అంతిమ వీడ్కోలు కార్యక్రమానికి హాజరై రతన్‌టాటాకు నివాళులు అర్పించారు. రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా సహా ఆయన కుటుంబసభ్యులందరూ అంత్యక్రియలకు హాజరయ్యారు. టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ లాంటి ఉన్నతస్థాయి అధికార ప్రముఖులు పాల్గొన్నారు. పార్శీ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించినట్లు పార్శీ పూజారి ఒకరు చెప్పారు. దక్షిణ ముంబయిలోని కొలాబాలోని రతన్‌టాటా భవంతిలో మరో మూడు రోజులపాటు అంతిమ సంస్కారాల క్రతువులు తరువాయి 6లో



## ఎపికి వెళ్లాల్సిందే

పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అభ్యర్థనలను తోసిపుచ్చిన కేంద్రం

ఈనెల 16 లోపు ఎపి ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలులో భాగంగా తమను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని పలువురు ఐఎఎస్, ఐపిఎస్‌ల అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ మేరకు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను తెలంగాణ రాష్ట్రం నుంచి రిలీవ్ చేస్తూ డిఒపిటి (కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ) ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 16లోపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని కేంద్రం వారిని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలులో భాగంగా ఐఎఎస్, తరువాయి 6లో

## సాహిత్యంలో హాన్ కాంగ్‌కు నోబెల్



**స్టాక్‌హోం :** సాహిత్యంలో దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్‌కు నోబెల్ పురస్కారం దక్కింది. ఆమె చేసిన విశేష కృషికి రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 2024 సంవత్సరానికి గాను నోబెల్‌ను ప్రకటించింది. గతేడాది నార్వేకు చెందిన రచయిత జాన్ ఫోసెకు నోబెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. మానవ జీవితపు దుర్బలత్వాన్ని, చారిత్రక విషాదాన్ని తరువాయి 6లో



## భారత్ – ఆసియాన్ స్నేహం ఎంతో ముఖ్యం

'యాక్ట్ ఈస్ట్ పాలసీ'ని పదేళ్ళ క్రితమే ప్రకటించాం

21వ భారత్ – ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

**వియంటియేన్ :** ప్రపంచంలోని కొన్ని భాగాలలో ఘర్షణలు,ఉద్రిక్తతలు ఎదురవుతున్న సమయంలో భారత్ – ఆసియాన్ స్నేహం ఎంతో ముఖ్యమైనదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన లావోస్‌కు వెళ్ళారు. వియాంటియేన్‌లో జరుగుతున్న 21వ భారత్ –ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో గురువారం నాడు మోదీ ప్రసంగించారు. తాము ఇప్పటికే యాక్ట్ ఈస్ట్ పాలసీని పదేళ్ళ కిందటే ప్రకటించామని, తరువాయి 6లో

## తహసీల్దార్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బదిలీలు చేసిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. బదిలీలకు సంబంధించిన ఐచ్ఛికాలను ఇచ్చుకునే అవకాశాన్ని కల్పిస్తూ సిసిఎల్‌ఎ ఆదేశాలను జారీ చేసింది. తహసీల్దార్లను సొంత జిల్లాలకు తిరిగి పంపించాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టిజిటిఎ) పలు మార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఇదే విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్‌ఎ నవీన్ మిట్టల్‌ను కలిసి టిజిటిఎ ప్రతినిధులు ఎన్నికల బదిలీలపై వినతిపత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. దీంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ బదిలీలకు అవకాశాన్ని కల్పించడం పట్ల టిజిటిఎ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, తరువాయి 6లో



## జమ్మూకశ్మీర్ సిఎం అభ్యర్థిగా ఒమర్

ఎన్‌సి శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక

**శ్రీనగర్ :** నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభాపక్ష నేతగా ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీనగర్‌లో గురువారం శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తమ నేత ఒమర్ అబ్దుల్లా అని అందరూ ముక్తకంఠంతో పేర్కొన్నట్లు పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ కోసం ఎన్నికలకు ముందు కూటమిగా ఏర్పడిన భాగస్వామ్య పక్షాలతో శుక్రవారం సమావేశమవుతామన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 42 స్థానాలను గెల్చుకుంది. మిత్రపక్షాలైన కాంగ్రెస్ ఆరుస్థానాలను, సిపిఐ(ఎం) ఒక సీటును గెల్చుకుంది. ఇదిలా తరువాయి 6లో

# ధరణి, రెవెన్యూ చట్టం పేర్లు మారిస్తే సరిపోదు



పారదర్శకత ఉండాలి
విఆర్ఓ వ్యవస్థను పునరుద్ధరించాలి.. లేదంటే కొత్త సమస్యలు వస్తాయి.
ప్రభుత్వ భూములు కొల్లగొట్టేందుకే కెసిర్ సర్కార్ విఆర్ఒ వ్యవస్థను రద్దు చేసింది. '-
ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల
జెఎసి చైర్మన్ గోల్కొండ సతీష్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ :** క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే, ప్రభుత్వ పరిపాలన సాఫీగా సాగాలంటే గ్రామీణ రెవెన్యూ అధికారి (విఆర్ఒ)తో పాటు గ్రామాల ప్రజల సంఖ్య ఆధారంగా విఆర్ఎలను కూడా నియమించాలి. లేదంటే కొత్త సమస్యలు వస్తాయి అని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల జెఎసి (టివిఆర్ఓస్–జెఎసి) చైర్మన్ గోల్కొండ సతీష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత చట్టాలను, వెబ్‌సైట్ పేర్లను మార్చినంత మాత్రాన ఫలితం ఉండదని, చట్టమైన, వెబ్‌సైట్ అయినా పూర్తిగా పారదర్శకంగా ఉండాలని 'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో గోల్కొండ సతీష్ సూచించారు. ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రశ్న: విఆర్ఒ వ్యవస్థ ఉండడం వల్ల ఉపయోగం ఏమిటి?**

**సతీష్ :** భారతదేశంలో బ్రిటీష్ కాలంలో రెవెన్యూ వ్యవస్థ మొదలు కాగా, అదే వ్యవస్థ ఆధారంగా నాటి హైదరాబాద్ సంస్థాన నిజాం రాజు ఇక్కడ కూడా ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో గ్రామస్థాయిలో భూమి శిస్తు వసూలు కోసం పటేల్, పట్వారి విధానం అందుబాటులో ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆయా ప్రభుత్వాలు పటేల్, పట్వారి వ్యవస్థ కొనసాగింది. పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు భూ రికార్డులతో పాటు పౌరసేవలను అందించేందుకు టిడిపి హయాంలో 2000 సంవత్సరంలో పంచాయితీ సెక్రటరీ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ వ్యవస్థ భూ రికార్డుల నిర్వహణలో విఫలమైంది. గ్రామాల్లోని భూరికార్డులు రాజకీయనాయకుల చేతిలోకి వెళ్లడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత రాజశేఖరెడ్డి హయాంలో 2007లో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి మరీ విఆర్ఒ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మొత్తం 54 విధులతో జాబ్ కార్డును రూపొందించి, విఆర్ఓలను నియమించారు. ఈ 54 విధుల్లో భూమి ఒక అంశం మాత్రమే. మిగితావన్నీ ప్రతి మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయేంత వరకు పొందాల్సిన సేవలకు సంబంధించినవి. ఆ సేవలను అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో విఆర్ఓ వ్యవస్థ విజయవంతంగా పనిచేసింది.

**ప్రశ్న : గత బిఆర్ఎస్ ప్రభుత్వం విఆర్ఒ వ్యవస్థను ఎందుకు రద్దు చేసింది?**

**సతీష్ :** భూములకు రక్షణగా నిలిచిన విఆర్ఒ వ్యవస్థ ఉంటే తమ అక్రమాలకు అడ్డుపడుతుందనే ఉద్దేశంతోనే విఆర్ఒ వ్యవస్థను గత కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. అస్తవ్యస్తమైన భూరికార్డులను 100 రోజుల్లో పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రభుత్వానికి అందించిన చరిత్ర విఆర్ఒలది. ఆ సమయంలో విఆర్ఒ సేవలను అసెంబ్లీ వేదికగా అప్పటి సిఎం కెసిఆర్ కొనియాడుతూ నెల జీతం బోనస్‌గా ప్రకటించారు. భూరికార్డులు చేతికి రాగానే అదే సిఎం కెసిఆర్ ఏడాదిలోపే విఆర్ఓలంటే అవినీతిపరులంటూ ముద్రవేశారు. కెసిఆర్ ప్రభుత్వ భూములను కొల్లగొట్టే కుట్రతోనే విఆర్ఓ వ్యవస్థ రద్దు చేశారు. భూరికార్డుల ప్రక్షాళన పేరుతో బిఆర్ఎస్ పెద్దలు విలువైన ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. విఆర్ఒలపై తన పార్టీ పత్రికతో పాటు సోషల్ మీడియాలో నిరాధారమైన అభాండాలు వేసి విషప్రచారం చేయించారు. తప్పుడు ప్రచారంతో 2022లో అసెంబ్లీలో చట్టం ద్వారా విఆర్ఒ వ్యవస్థను రద్దుచేసి 5,485 విఆర్ఒల కుటుంబాలను రోడ్డుపాలు చేశారు. ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా భయభ్రాంతులకు గురిచేసి లాటరీ పద్ధతిలో నిర్బంధంగా ఇతర శాఖలలోకి నెట్టేశారు.

**ప్రశ్న : 'ధరణి'ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు.. దాని వల్ల నష్టమేమిటి?**

**సతీష్ :** 'ధరణి' పేరుతో ఓ ప్రైవేట్ వెబ్‌సైట్‌ను బిఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించారు. విఆర్ఒ వ్యవస్థను రద్దు చేయడానికి ముందే భూములలో మార్పులు చేర్పులు చూసేందుకు వ్యూహాత్మకంగా ధరణిని తీసుకువచ్చారు. దీని ద్వారా తమకు ప్రభుత్వ భూములు, తమకు కావాల్సిన భూములను పేర్లు మార్చుకుని వాటిని హస్తగతం చేసుకున్నారు. రాష్ట్ర సంపద అయిన భూముల వివరాలను ధరణిని నిర్వహించే ఒక ప్రైవేటు సంస్థ చేతుల్లో పెట్టారు. చివరకు ఎవరి భూములు ఎవరి పేరుతో ఉన్నాయో కూడా అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. చివరకు ధరణి కారణంగా ఒక మహిళా తహసీల్దార్‌పై పెట్రోల్ పోసి తగులపెట్టిన దారుణమైన సంఘటన చోటుచేసుకోవడం ధరణి సమస్యలకు అద్దంపడుతుంది.

**ప్రశ్న: భూ రికార్డుల నిర్వహణను ఇప్పుడు ఎన్ఐసికి అప్పగించారు కదా?**

**సతీష్ :** భూముల రికార్డుల నిర్వహణ వెబ్‌సైట్ బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసి)కు అప్పగించడం గొప్ప నిర్ణయం. దీనిని విఆర్ఒ జెఎసి పూర్తిగా స్వాగతిస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ కావడంతో భూ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండనుంది. ఇప్పటివరకు జరిగిన అక్రమాలకు ఇకమీదట తావు ఉండకపోవచ్చు. కానీ అప్పడప్పుడు పొరపాట్లు జరగడం సహజం. అయితే వీటిని వెంటనే సరిచేసే వ్యవస్థ కూడా ఉండాలి.

**ప్రశ్న : గ్రామాల్లో కొత్తగా రెవెన్యూ అ ధికారుల (జిఆర్ఒ) ను నియమించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిపాదనపై విఆర్ఒల వైఖరి ఏమిటి?**

**సతీష్ :** పేరు ఏదైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికీ ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని నిర్ణయించడం స్వాగతిస్తున్నాం. అయితే ఇప్పటికే క్షేత్రస్థాయిలో గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలతో పాటు గ్రామ భూ రికార్డులపై పూర్తి పట్టు, సుదీర్ఘ అనుభవం కలిగిన విఆర్ఒలనే తిరిగి గ్రామ రెవెన్యూ అధికారులుగా నియమిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరి ప్రజలకు మేలు జరగడంతోపాటు అదనపు భారం లేకుండా 5,485 మంది విఆర్ఒలకు కూడా న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత చట్టాలను, వెబ్‌సైట్ పేర్లను మార్చినంత మాత్రాన ఫలితం ఉండదు. చట్టమైన, వెబ్‌సైట్ అయినా పూర్తిగా పారదర్శకంగా ఉండాలి. ఎటువంటి తప్పులు దొర్లినా క్షేత్రస్థాయి అధికారి స్థాయి నుంచి పైవరకు సరిదిద్దే వెసులుబాటు కల్పించాలి. పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి 'ఈ ఆఫీస్' విధానాన్ని విఆర్ఒ వ్యవస్థలో కూడా అమలుచేయాలి. తద్వారా ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారం కావడంతో పాటు ఏ స్థాయిలో ఎవరు తప్పుచేశారో గుర్తించి, వారిని బాధ్యులను చేసే అవకాశం ఉంటుంది. దీంతో పారదర్శకత విధానం వస్తుందని భావిస్తున్నాం. విఆర్ఓ వ్యవస్థ రద్దుకు సంబంధించిన కేసులో ఇప్పటికే హైకోర్టు స్టే విధించింది. ఈ ప్రభుత్వం మమ్మల్ని కాదని, కొత్తగా నియామకాలు చేపడితే మేము మరోసారి హైకోర్టును ఆశ్రయించేందుకు వెనకడబోం. ఇది ప్రభుత్వాన్ని హెచ్చరించడానికి కాదు. మాకు న్యాయం కావాలని, ఆ న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వం చేయాలని కోరుతున్నాం.



## 15న నేవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన

హాజరుకానున్న అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా దామరగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో భారత రక్షణ వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని కొండా సురేఖ నివాసంలో రాడార్ స్టేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ బీర్ సింగ్‌తో పాటు నేవీ అధికారులు కలిశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు కానున్న నేవీ రాడార్ స్టేషన్‌కు ఈనెల 15న శంకుస్థాన జరుగనుందని, కార్యక్రమానికి కొండా సురేఖతో పాటు పరిగి ఎంఎల్ఎ రామ్మోహన్‌రెడ్డిలకు నేవీ అధికారులు ఆహ్వానం పలికారు. కొండా సురేఖ వారితో మాట్లాడుతూ.. నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పరిగి నియోజకవర్గ ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతోపాటు, దేశంలోనే రెండో రాడార్ స్టేషన్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు లభించనుందని మంత్రి తెలిపారు. నేవీ అధికారులు కొండా సురేఖను కలుసుకుని రాడార్ కేంద్రం విశిష్టతను వివరించారు.

## గల్ఫ్ సంక్షేమ సలహా కమిటీలో ఇద్దరు రిక్రూటర్స్ ప్రతినిధులకు అవకాశం ఇవ్వాలి : డి.ఎస్.రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి జీఓ జారీచేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓవర్సీస్ మ్యాన్‌పవర్ రిక్రూట్మెంట్ ఏజెంట్స్ అసోసియేషన్ (ఓమ్రా) అధ్యక్షులు డిఎస్.రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా లైసెన్స్ పొంది, విదేశీ ఉద్యోగాల భర్తీ వ్యాపారం చేస్తున్న రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెన్సీల సేవలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు. తెలంగాణ యువతకు గల్ఫ్ తదితర దేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిరుద్యోగ నిర్మూలనలో తమవంతు బాధ్యత నిర్వహిస్తున్నామని డిఎస్.రెడ్డి తెలిపారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.5లక్షలు చెల్లించడం, గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలలలో అడ్మిషన్లు, ప్రతి మంగళవారం, శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహించడం దేశ చరిత్రలోనే ఒక మైలురాయి అని డిఎస్.రెడ్డి కొనియాడారు.

# దసరా తర్వాత కులగణన

ఎన్నికల మేనిఫెస్టోలో, బిసి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది
బిసి సంఘాల నేతలతో సిఎం రేవంత్‌రెడ్డి
కులగణన విజయవంతం కోసం సమన్వయంతో ముందుకెళ్తాం
: జాజుల శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కులగణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నదని, స్టేట్ బిసి కమిషన్ సైతం ఆ సన్నాహాల్లోనే ఉన్నదని, దసరా పండగ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రక్రియ మొదలవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో, బిసి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లను పెంచుతామని చెప్పారు. కులగణన ప్రక్రియను 60 రోజుల వ్యవధిలో పూర్తిచేసి డిసెంబరు 9నాటికి రిజర్వేషన్లను ఖరారు చేస్తామన్నారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల (గ్రామీణ) ఎన్నికలు జరుగుతాయన్నారు. టిపిసిసి అధ్యక్షులు బి. మహేష్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ సహా పలువురు బిసి ఎంఎల్‌ఎలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి కులగణన విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కూడా ఉన్నారు. కులగణనతోపాటు స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నందున బిసి సంఘాలన్నీ సహకరించాలని సిఎం కోరారు. కులగణన ఎలా జరగాలో స్టేట్ బిసి కమిషన్ చైర్మన్, సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులతో రివ్యూ జరిగిందని, రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఆధ్వర్యంలో జరుగుతుందనే స్పష్టత వచ్చిందని వారికి సిఎం వివరించారు. అవసరమైనంత సిబ్బందిని ప్లానింగ్ బోర్డు సమకూర్చడంతో పాటు ఏయే శాఖలతో సమన్వయించుకోవాలో కూడా ఆ విభాగమే చూసుకుంటుందని తెలిపారు. బిసి కమిషన్‌కు, ప్లానింగ్ బోర్డుకు సమన్వయకర్తగా సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించనున్నట్లు కూడా బిసి సంఘాల ప్రతినిధులకు సిఎం వివరించారు. ఇంటింటి సర్వేలో కులాల వివరాలను సేకరించడంతో పాటు బిసిల రాజకీయ, ఆర్థిక, సామాజిక వెనకబాటుతనంపైనా తగిన ప్రశ్నావళి, ప్రొఫార్మా, డాటాబేస్ రూపకల్పన తదితరాలపైనా మెకానిజం రూపొందినట్లు వివరించారు. కులగణనపై రాష్ట్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి బిసి సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్ఎ వాకిటి శ్రీహరి, బిసి మేధావుల ఫోరం కన్వీనర్ చిరంజీవిలు, బిసి కులసంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మ, ప్రొఫెసర్ బాగయ్య, వెంకటేష్ ఉన్నారు.

## ఉపాధ్యాయ నియామకాన్ని రాజకీయం చేస్తున్న సిఎం రేవంత్

మాజీ ఎంపి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయుల నియామకాల కార్యక్రమాన్ని సిఎం రేవంత్‌రెడ్డి రాజకీయ వేదికగా వాడుకున్నారని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కెసిఆర్ హయంలో రికార్డు స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చారని, కానీ తాము సక్రమంగా చెప్పుకోలేకపోయామని, మార్కెటింగ్‌లో రేవంత్‌ను మించినోళ్లు లేరన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ హయంలో రాష్ట్రంలో లక్షా 62 వేల ఉద్యోగాలను ఇచ్చామని, ఈ విషయం మంత్రులు భట్టి, పొన్నంకు తెలియక పోతే వారు మంత్రులుగా ఉండటానికి అనర్హులని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో సిఎం రేవంత్ రెడ్డి నిర్ధారించారా అని ప్రశ్నించారు. డిఎస్‌సి ఉపాధ్యాయ నియామకాలు సెప్టెంబర్ 6,2023న ఇచ్చిన నోటిఫికేషన్‌కు కొనసాగింపేనని, కేవలం ఆరు వేల ఉద్యోగాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌లో అదనంగా కలిపారని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం డిసెంబర్ 31,2024లోగా రెండు లక్షల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. రిక్రూట్‌మెంట్ సైకిల్‌లో భాగంగా మొదట ఉద్యోగ ఖాళీలను గుర్తించాలని, కానీ ఆపని జరగలేదని, ఈ విషయంలో కోదండరాం ఏంచేస్తున్నారని, సచివాలయానికి వెళ్లి, ఖాళీలను గుర్తించి, సిఎం రేవంత్‌కు జాబితా ఇవ్వొచ్చు కదా? అని వినోద్ కుమార్ ప్రశ్నించారు. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా తన బాధ్యతలను తెలంగాణ అభివృద్ధి కోసం నిర్వహించానని, కెసిఆర్ తమకు ఉద్యోగాలు ఇచ్చినా తాము హంగామాగా ప్రచారం చేసుకోలేదని, తన గురించి సిఎం రేవంత్ హేళనగా మాటాడారని మండిపడారు. రతన్ టాటా మరణించడం దురదృష్టకరమని, దేశ పారిశ్రామిక అభివృద్ధిలో టాటాల పాత్ర చారిత్రాత్మకమైనదని గుర్తు చే శారు.



## 27న జెన్‌టియులో ప్రపంచ స్థాయి హెచ్‌ఆర్ సదస్సు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఈ నెల 27న జవహర్‌లాల్ నెహ్రు టెక్నలాజికల్ యూనివర్సిటీ (హైదరాబాద్) ఆడిటోరియంలో జరగనున్న ప్రపంచ స్థాయి హెచ్‌ఆర్ సదస్సు పోస్టర్‌ను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రోహిత్‌రాజ్, సహ వ్యవస్థాపకులు మనిందర్ రెడ్డి, లక్ష్మీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ చేసిన ఉద్యోగులను తిరిగి వెనక్కు తీసుకురండి

మంత్రి శ్రీధర్ బాబుకు 317 జిఒ ఉద్యోగుల వినతి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాలకు బదిలీ చేసిన ఉద్యోగులను తిరిగి వెనక్కు తీసుకురావాలని '317 జిఓ డిస్ లోకేటెడ్ ఉద్యోగుల సంఘం' ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్యక్షుడు పడకంటి అజయ్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసింది.

# డ్రగ్స్ సరఫరాపై కఠినంగా వ్యవహరించండి

అదనపు సిబ్బందిని కేటాయిస్తాం
యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులను ఆదేశించిన
డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. డిజిపి కార్యాలయంలో గురువారంనాడు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి బ్యూరో ఇంచార్జ్ సందీప్ శాండిల్యతో పాటు పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలను నియంత్రిస్తూ కేసులు పెడుతున్నప్పటికీ సరఫరా విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీచేశారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పకడ్బందీగా వ్యవహరించి డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. తెలంగాణ స్టేట్ ప్రత్యేక పోలీసు విభాగం నుంచి సిబ్బందిని అదనంగా బ్యూరోకి కేటాయిస్తామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలను సరఫరాలను పూర్తిగా నిషేధించాలని ఈ లక్ష్యం కోసం వ్యూహాత్మకంగా వ్యవహరించాలని అన్నారు. నిందితులను పట్టుకున్నప్పుడు వారి నెట్వర్క్ ను పూర్తిగా సేకరించాలని అన్నారు. విదేశీయులు ఎవరైనా అనుమానాస్పదంగా డ్రగ్ వ్యవహారాల్లో తల దూర్చితే వారిని వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థల వద్ద అనుమానాస్పద ప్రాంతాల్లో బ్యూరో సిబ్బందిని నియమించాలని, తద్వారా కఠినంగా వ్యవహరించాలని అన్నారు. శాంతిభద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... నిందితులను పట్టుకోవడమే కాక వారికి శిక్ష పడేలా సాక్షాధారాలను న్యాయస్థానాలకు సమర్పించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాను పూర్తిగా నియంత్రించాలని అన్నారు. బ్యూరో ఇన్‌చార్జి సందీప్ శాండిల్య మాట్లాడుతూ.... సిబ్బందికి శిక్షణ ఇచ్చి, నిందితులను శిక్షించేందుకు అవసరమైన సమాచారాన్ని పుస్తకాల రూపంలో ముద్రించామని తెలిపారు. శిక్షపడేలాగా కఠినంగా వ్యవహరిస్తున్నామని, అదనపు సిబ్బందిని కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మున్ముందు మరింత నిక్కచ్చిగా చర్యలు తీసుకుంటామన్నారు.




## గాంధీ స్మారక ట్రస్ట్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు

**హైదరాబాద్ :** హైదరాబాద్, కోఠిలోని మహాత్మా గాంధీ స్మారక నిధికి చెందిన భూమి ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో ఆరు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్, సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ ఇతరులకు ఆదేశించింది. సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని కోటి గాంధీ స్మారక నిధికి చెందిన భూమి అన్యాక్రాంతం అయ్యిందని పేర్కొంటూ అదే గ్రామస్తుడు తుపాకుల బాల రంగం ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారించింది.సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని సర్వే నెం. 241/ఎ/బి2/1లో 3, సర్వే నెం 241/ఎ/బి2/2లో 2.34.. మొత్తం 5.34 ఎకరాలను 2022 ఆగస్టు 6న చట్ట వ్యతిరేకంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి. శ్రీనివాసు కొండాయి అనే వ్యక్తికి భూమితో సంబంధం లేని అరిగే శ్రీహరి (రిటైర్డు తహసీల్దార్), హైదరాబాద్‌లో ఉండే అరిగె విజయ్ కుమార్ రిజిస్టర్ చేయడం పాత, కొత్త ఆర్ఓఆర్ యాక్ట్‌కు వ్యతిరేకం. గాంధీ సిద్ధాంతాలు, భగవద్గీత బోధనల వ్యాప్తి కోసం ఒక దాత ట్రస్టుకు ఇచ్చిన భూములను ప్రైవేట్ వ్యక్తులు కాజేయడాన్ని అడ్డుకోవాలి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ (తహశీల్దార్) చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి... అని పిల్‌లో పిటిషనర్లు పేర్కొన్నారు. విచారణ 6 వారాలకు వాయిదా పడింది.

ప్రపంచ స్థాయి వేదికపై..

# తెలంగాణ టూరిజం ప్రమోషన్

అమెరికా 2024 ట్రేడ్ షోలో
తెలంగాణ టూరిజం స్టాల్ ఏర్పాటు
పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి
జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లాస్ వెగాస్‌లోని మాండలే బేలో నిర్వహించిన 'ఐమ్యాక్స్ అమెరికా 2024' ట్రేడ్ షోలో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి వేదికపై ఏర్పాటు చేసిన తెలంగాణ టూరిజం స్టాల్‌ను మంత్రి జూపల్లి ప్రారంభించారు. తెలంగాణ.. శతాబ్దాల ఘనమైన చరిత్ర, వారసత్వం, సుసంపన్న సంసకృతి, ప్రకృతి రమణీయత, పర్యాటక ప్రాంతాల గురించి స్థానిక మీడియా, ట్రావెల్ సొల్యూషన్స్ ప్రతినిధులు, తెలుగు అసోసియేషన్ సభ్యులతో చర్చించారు. విశ్వనగరమైన హైదరాబాదు భారతదేశం సదస్సుల రాజధానిగా అంతర్జాతీయ సదస్సులకు వేదికగా, ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేంద్ర బిందువుగా మారిందని, పర్యాటక, వినోదం, వ్యాపార, ఐటీ, హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని చెప్పారు. ప్రగతిశీల విధానాలతో తమ ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు పర్యాటక రంగంలో భాగస్వాముల సహకారంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విదేశీ స్టాళ్లను మంత్రి జూపల్లి సందర్శించారు. కొత్త అనుభూతులు, అన్వేషించని ప్రదేశాలను చూడాలని కోరుకునే నేటితరం పర్యాటకులకు స్వాగతం పలికేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని, ఘనమైన వారసత్వ సంపదతో అలరారుతున్న తెలంగాణ రాష్ట్రంలో పర్యటించాలని ఆయా దేశాల ప్రతినిధులకు మంత్రి జూపల్లి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.ఎస్. ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- జిల్లాకు 3 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు
- రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ బైపాస్ ఆవరణలో గీత కార్మికులకు ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన కాటమయ్య రక్ష కిట్లు (సేఫ్టీ కిట్లు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గీత కార్మికులు చెట్టుపై నుంచి పడకుండా ఈ సేఫ్టీ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. గురువారం వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో పదివేల కిట్లను గీత కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గీత కార్మికులందరూ కిట్లను సద్వినియోగం చేసుకునేలా సంఘం నాయకులు, అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వెయ్యి మంది గీత కార్మికులకు పైగా సేఫ్టీ కిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. ఐఐటి హైదరాబాద్ వారు ఈ కిట్టు నాణ్యతను ధ్రువీకరించారని, రాష్ట్రంలోని 1,85,000 మంది గీత కార్మికులందరికీ అందిస్తామన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. శుక్రవారం హుస్నాబాద్, ధర్మపురి, మానకొండూర్, మంథనిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలకు రూ.180 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వసతి గృహాలను, గురుకులాలను అధికారులు సందర్శించి విద్యార్థులకు సౌకర్యాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. మానేరు రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ ఐలేందర్, గౌడ సంఘం నాయకులున్నారు.

**జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, పెద్దపల్లి**
ఆసక్తి వ్యక్తీకరణ నెం. DMO(P)/1/2024, తేది: 10.10.2024
పెద్దపల్లి జిల్లాలోని ధాన్యం సేకరణ కేంద్రాలకు గ్రెయిన్ క్యాలిపర్స్ (నెం. 334), పొట్టు తొలగించే యంత్రాలు (నెం.334) మరియు ధాన్యం ఆరబెట్టే డ్రయర్లు (నెం.4) సరఫరా కొరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆసక్తిగల బిడ్డర్స్ నుండి బిడ్లను ఆహ్వానించడమైనది. **టెండర్ షెడ్యూళ్ల అమ్మకం ప్రారంభం:** 12.10.2024న ఉ.10.30గం.ల నుండి. **షెడ్యూల్ దాఖలుకు ఆఖరి తేది:** 15.10.2024న మ.1.00గం.ల లోపు. మరిన్ని వివరాలను పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చు. సెల్ నెం. 7330733468.
సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి,
పెద్దపల్లి.
DIPR R.O. No. : 5232-PP/CL/ADVT/1/2024-25 Date: 10-10-2024

**ST.JOHN'S P.G. COLLEGE**
Chengicherla (V), Medipally(M), Medchal - Malkajgiri (Dist)
(Approved by AICTE, Affiliated to O.U) Ph : 9949490652, 9849139745
**SPOT ADMISSIONS**
- No of Vacancies / Unreported Candidates :
**MBA : 03 & MCA : 01**
- Eligible Candidates attend with originals on or before : 16-10-2024
- Candidates to Pay Tution Fee, Special Fee, Processing Fee
- Admissions are Subject to Ratification by TGICET / TGCHE

www.stjohnspgcollege.in Contact : 9849139745, 9603216358

# వృద్ధుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

## పార్టీ శ్రేణులకు చైనా అధ్యక్షుడు జిన్‌పిన్ ఆదేశం



**బీజింగ్:** దేశంలో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వారి సంక్షేమంపై దృష్టిపెట్టాలని అధికార చైనీస్ కమ్యూనిస్టు పార్టీ (సిసిపి) శ్రేణులను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదేశించారు. 2023 చివరి నాటికి చైనాలో 60 లేదా అంతకంటే ఎక్కువ వయసుగల వారి సంఖ్య 300 మిలియన్లకు చేరింది. 2035 నాటికి 400 మిలియన్లకుపైగా వృద్ధులు ఉంటారని అంచనా. చైనా వృద్ధుల దినోత్సవం శుక్రవారం జరగనున్న నేపథ్యంలో జిన్‌పింగ్ సందేశాన్ని అధికార వార్తా సంస్థ జిన్హువా గురువారం విడుదల చేసింది. దేశంలోని వృద్ధులకు జిన్‌పింగ్ ఈ సందేశంలో శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు సంబంధించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని స్థాయిల్లోని పార్టీ కమిటీలతోపాటు స్థానిక ప్రభుత్వాలను కోరారు. దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఒక బిడ్డ' విధాన్ని చైనా కఠినంగా అవలంభించిన కారణంగా, జననాల రేటు గణనీయంగా తగ్గింది. మరోవైపు వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఈ మార్పు గణనీయ ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. కుటుంబానికి ఒకే బిడ్డ ఉండాలన్న నిబంధనను 2016లో రద్దు చేసినప్పటికీ, దశాబ్దాలపాటు అమలైన ఈ విధానమే ప్రస్తుత పరిస్థితికి కారణమని చెప్తున్నారు. ఆర్థిక వ్యవస్థ, జనాభా మధ్య సమతుల్యానికి ఇప్పుడు చైనా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. అదే సమయంలో వృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నది.




# ఏషియాన్‌తో పటిష్టమైన వాణిజ్య సంబంధాలు

## చైనా ప్రధాని కియాంగ్



**వియంటియాన్(వావోస్):** ఏషియాన్ సభ్య దేశాలతో పటిష్టమైన వాణిజ్య సంబంధాలను కోరుకుంటున్నామని చైనా ప్రధాని లీ కియాంగ్ తెలిపారు. చైనాతో సహా మొత్తం పది దేశాలకు ఈ కూటమిలో సభ్యత్వం ఉంది. ఏషియాన్ వార్షిక సదస్సులో పాల్గొన్న కియాంగ్ మాట్లాడుతూ ఆగ్నేయాసియాతో లోతైన మార్కెట్ ఏకీకరణకు పిలుపునిచ్చారు. ఈ కూటమిలో సభ్యదేశాలైన ఫిలిప్పీన్స్, వియత్నాంతో చైనా సంబంధాలు సమస్యాత్మకంగా మారుతున్న తరుణంలో కియాంగ్ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. సముద్ర జలాలపై హక్కులకు సంబంధించి చైనాతో ఫిలిప్పీన్స్, వియత్నాం విభేదిస్తున్నాయి. అయితే, ఈ అంశాన్నికియాంగ్ తన ప్రసంగంలో ప్రస్తావించలేదు. ఏషియాతో వాణిజ్య సంబంధాలు, పరస్పర అవగాహన, సహకారం, అభివృద్ధి తదితర విషయాలను ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు.

## ఇజ్రాయెల్ హిజ్బొల్లాతో యుద్ధం నేపథ్యంలో

# బీరూట్ నుంచి పౌరులను తరలిస్తున్న టర్కీ



**బీరూట్:** ఇజ్రాయెల్ వరుస దాడుల నేపథ్యంలో, లెబనాన్ రాజధాని బీరూట్ నుంచి తమ పౌరులను టర్కీ స్వదేశానికి తరలిస్తున్నది. బుధవారం రాత్రి రెండువేల మందికిపైగా టర్కీ పౌరులతోపాటు కొంత మంది విదేశీయులను కూడా తీసుకొని టర్కీ సైనిక నౌక బీరూట్ నుంచి బయలుదేరింది. మిగతా వారిని కూడా తరలిస్తామని టర్కీ అధికఆరులు ప్రకటించారు. హిజ్బొల్లాను లక్ష్యంగా చేసుకొని, లెబనాన్‌లోని పలు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరుపుతున్న కారణంగా టర్కీ ఈ నిర్ణయం తీసుకుంది. టర్కిష్ నగరమైన మార్దిన్‌కు చెందిన అరబ్ జాతీయురాలు జెహ్రా సిబ్బిన్ తన లెబనీస్ భర్తతో కలిసి బీరూట్‌లో నివాసం ఉంటున్నది. లెబనాన్‌కు చెందిన భర్తను విడిచిపెట్టి స్వదేశానికి వెళ్లాలా? లేక అక్కడే ఉండాలా అని కొంతసేపు ఆమె సందిగ్ధంలో పడింది. చివరికి పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని తాను టర్కీకి వెళుతున్నట్టు స్థానిక మీడియాను ఉటంకిస్తూ పిటిఐ తెలిపింది. తాను ఉంటున్న ఇంటికి సమీపంలోనూ ఇజ్రాయెల్ వైమానిక దళం బాంబులు వేసినట్టు ఆమె పేర్కొంది. సిబ్బిన్ మాదిరిగానే చాలా మంది లెబనాన్‌ను వదిలే విషయంలో గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎన్నో కుటుంబాల్లో, భార్యభర్తల్లో ఒకరు లెబనీస్‌కాగా, మరొకరు టర్కిష్ కావడమే ఇందుకు కారణం. ఇలావుంటే, బీరూట్‌లో నివాసం ఉంటున్న తమ దేశ పౌరులకు సాయాన్ని అందించడానికి సమారు 300 టనున్నల మానవతా సామాగ్రిని టర్కీ రవాణా చేసింది. టర్కీ పౌరులతో పాటు, బల్గేరియా, రుమేనియా, కజకిస్తాన్ తదితర దేశాలకు చెందిన వారు కూడా బీరూట్ నుంచి తమతమ దేశాలకు తిరిగి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు ప్రకటించారు. అయితే, భద్రతా కారణాల వల్ల వారి వివరాలను వెల్లడించలేదు.



ఫ్లోరిడా (అమెరికా)ను ఒకదాని తర్వాత మరొ కటిగా తుపానులు వెంటాడుతున్నాయి. ప్రత్యేకించి ఫ్లోరిడా రాష్ట్రంపై తుపాన్ల ప్రభావం ఎక్కువగా ఉంది.హెలెన్ తుపాను సృష్టిం చిన విలయం, నష్టం నుంచి కోలుకోకముందే, ఇప్పుడు మిల్టన్ తుపాను విరుచుకుపడింది. గంటకు సుమారు 160 కిలోమీట ర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. తంపా పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సరసొటాకు సమీపంలోని సిస్టాకీలో 41 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అధికారులు ఇప్పటికే రెడ్ అలర్ట్ ప్రకటించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు మిలియన్ల ఇళ్లు, కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మిల్టన్ ప్రభావం మరో రెండు మూడు రోజులు ఉంటుందని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యుఎన్ కొత్త మానవతావాద చీఫ్‌గా

# బ్రిటిష్ మాజీ దౌత్యవేత్త టామ్ ఫ్లెచర్



**ఐక్యరాజ్యసమితి (న్యూయార్క్):** ఐక్యరాజ్య సమితి (యుఎన్) కొత్త మానవతావాద చీఫ్‌గా బ్రిటిష్ మాజీ దౌత్యవేత్త టామ్ ఫ్లెచర్ నియమితులయ్యారు. యుఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఈ నియామక లాంఛనాలను పూర్తిచేశారు. ఫ్లెచర్ ప్రస్తుతం ఆక్స్‌ఫర్డ్‌లోని హెర్ట్‌ఫోర్డ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ కాన్ఫరెన్స్ కాలేజెస్‌కు వైస్ చైర్మన్‌గా ఉన్నారు. యుఎన్ హ్యూమరేటీరియన్ చీఫ్‌గా ఆయన మార్టిన్ గ్రిఫిత్ (బ్రిటన్) స్థానంలో పనిచేస్తారు. ఆరోగ్య కారణాలతో గ్రిఫిడ్ ఈ ఏడాది జూన్ మాసంలో తన పదవికి రాజీనామా చేశారు. యుఎన్ డిప్యూటీ అధికార ప్రతినిధి ఫరాన్ హక్ మీడియాకు ఈ వివరాలను అందించారు. ఫ్లెచర్ బాధ్యతలు స్వీకరించేవరకూ ప్రస్తుతం తాత్కాలిక చీఫ్‌గా వ్యవహరిస్తున్న జాయిస్ ముయా ఆ బాధ్యతలను కొనసాగిస్తారని తెలిపారు. యుఎన్‌లో బ్రిటిష్ రాయబారి లిండా థామస్ గ్రీన్‌ఫీల్ కూడా ఫ్లెచర్ నియామకంపై స్పందించారు. ఆయనతో కలిసి పని చేయడానికి యుఎన్ ఎదురుచూస్తున్నదని వ్యాఖ్యానించారు.

## త్వరలో నిజనిర్ధారణ కమిటీ

(4వ పేజీ తరువాయి)

ఊహించని ఎన్నికల ఫలితాలు రావడంపై ఒక నిజనిర్ధారణ కమిటిని నియమించనున్నట్లు అజయ్‌మాకెన్ తెలిపారు. ఈ ఆశ్చర్యకర ఫలితాలు రావడం వెనక అనేక కారణాలు ఉన్నాయనుకుంటున్నామని ఆయన విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘం పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేసిందని, దానిపై ప్రస్తుత సమీక్ష సమావేశంలోనే కాకుండా భవిష్యత్తులోనూ చర్చించాల్సి ఉన్నదని మాకెన్ చెప్పారు. ఈ సమీక్ష సమావేశంతో ఒక నిర్ధారణకు వచ్చారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ అన్ని విషయాలనూ కేవలం గంట, గంటన్నర సమయంలోపే చర్చించి నిర్ధారణకు రాలేము కదా అని బదులిచ్చారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో బిజెపి 10 సంవత్సరాల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి 48స్థానాలను దక్కించుకుని మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాన్ని పొందడం రాజకీయ విశ్లేషకులను, కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కూడా అవాక్కయ్యేలా చేసింది.

## నేడు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు శంకుస్థాపన

(4వ పేజీ తరువాయి)

విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మొదటి దశలో చేపట్టనున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి అజిత్‌రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావులు కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధిత జిల్లాల మంత్రుల, ఇంఛార్జ్ మంత్రుల ఆమోదం పొందిన అనంతరం, ఈ కార్యక్రమాన్ని ఉత్సవ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. వివిధ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులందరినీ ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించాలని స్పష్టం చేసారు. ఈ స్కూళ్ల నిర్మాణాలను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్నారని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో శంకుస్థాపన జరిగే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు.

**శంకుస్థాపన జరిగే 28 నియోజక వర్గాలు**

కొడంగల్, జడ్చర్ల, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, పర్కాల, నారాయణ్‌ఖేడ్, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, మానకొండూర్, నర్సంపేట.

## ఎంతో ముఖ్యం

(4వ పేజీ తరువాయి)

పదేళ్ళలో భారత్ – ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల కూటమి) దేశాల మధ్య చారిత్రక సంబంధాలకు నూతన శక్తి, దిశ, ఊతం ఇచ్చిందన్నారు. ఫిలిప్పీన్స్, చైనాల మధ్య దక్షిణ చైనా సముగ్రం విషయంలో సముద్ర తీర అంశాలపై సంక్షోభం నెలకొని, జాతుల బృందాలు మిలిటరీతో యుద్ధాలు చేస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ప్రపంచంలోని అనేక భాగాలలో ఘర్షణలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో భారత్ – ఆసియాన్ స్నేహం, సమన్వయం, చర్చలు, సహకారం ఎంతో ముఖ్యమైనవని మోదీ అన్నారు. దక్షిణ భూగోళంలో ఆసియాన్ దేశాలు ఇరుగుపొరుగు భాగస్వాములు అని, వేగంగా వృద్ధి చేందుతున్న ప్రాంతమని అన్నారు. మనమంతా శాంతిని ప్రేమించే దేశాలమని, పరస్పర జాతి సమగ్రతను, సార్వభౌమత్వాన్ని గౌరవించేవారమని, ఈ ప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తును కాంక్షించే వారమని చెప్పారు. ఆసియాన్ కేంద్రంగా భారతదేశంలో ఇండో – పసిఫిక్ ఓసియన్స్ ఇనిషియేటివ్‌ను 2019లోనే ప్రారంభించామన్నారు. ప్రాంతీయ స్థిరత్వం, భద్రత కోసం గత ఏడాది సముద్ర తీర విన్యాసాలు ప్రారంభించామని తెలిపారు. ఏడు ఆసియాన్ దేశాలకు భారతదేశం నుంచి నేరుగా విమానాలు ఉన్నాయని, త్వరలో బ్రూనైకి కూడా ఈ సేవలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. సింగపూర్‌తో ఫిన్‌టెక్ అనుసంధానతను ప్రారంభించామని, ఇది విజయవంతమైతే ఇతర ఆసియాన్ దేశాలకు కూడా విస్తరిస్తామన్నారు. ప్రజల కేంద్రీకృత వైఖరే భారత్ – ఆసియాన్ భాగస్వామ్యం అభివృద్ధి చెందేందుకు పునాది అని తెఇపారు. నలంద యూనివర్సిటీ నుంచి 300 ఆసియాన్ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందుతున్నారని వివరించారు. లావోస్, కాంబోడియా, వియత్నాం, మయన్మార్, ఇండోనేషియాతో వారసత్వ భాగస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. భారత్ – ఆసియాన్‌లు శాస్త్ర సంకేతిక నిధిని, డిజిటల్ నిధి, హరిత నిధిలను ఏర్పాటు చేసాయని, వివిధ రంగాలలో సహకారం కోసం భారత్ వీటికి 300 మిలియన్ డాలర్‌లకు పైగా అందజేసిందన్నారు. పలితంగా భూగర్భ జలం నుంచి అంతరక్ష రంగం వరకు సహకారాన్ని విస్తరించామని, గత పదేళ్ళలో భాగస్వామ్యం మరింత సమగ్రమైందన్నారు.

# సద్దుల సంబురం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు, యువతులు అంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో నగరంలోని ట్యాంక్‌బండ్ పరిసరాలు కాంతులీనాయి. వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క బతుకమ్మను భావితరాలకు అందిద్దామని సూచించారు. రాష్ట్రమంతటా వేలాది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అని ఆనందంగా ఆడిపాడారు. వేలాది మంది మహిళలు, పిల్లలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం జనసంద్రంగా మారింది. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు అత్యంత కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిశాయి. మరోవైపు జిల్లాల్లో సద్దుల బతుకమ్మ వేడుకల కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ఏ ప్రాంతంలో చూసినా బతుకమ్మ పాటలతో సందడి వాతావరణం కనిపించింది.

**ట్యాంక్‌బండ్‌పై ఘనంగా సద్దుల బతుకమ్మ**

ట్యాంక్‌బండ్ పై సద్దుల బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాది మంది మహిళలు బతుకమ్మలతో తరలి వచ్చారు. సచివాలయం వద్ద గల అమరవీరుల స్మారక కేంద్రం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన వేదికకు తరలివచ్చారు. ఈసందర్భంగా కళాకారులు వివిధ కళారూపాలతో ఆకట్టుకున్నారు. సద్దుల బతుకమ్మ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీరితోపాటు హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ప్రజా గాయని విమలక్క, ఎంఎల్‌సికోదండరాం, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద మంత్రి సీతక్క తో పాటు మేయర్ విజయలక్ష్మి డిప్యూటీ మేయర్ శ్రీలత ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ తదితరులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ పై దాదాపు 40 నిమిషాల పాటు ప్రదర్శించిన క్రాకర్స్, లేజర్ షోలు సందర్శకులను పెద్ద ఎత్తున ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు పర్యటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జలమండలిలో సద్దుల బతుకమ్మ వేడుకలు**

జలమండలిలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జలమండలి ఈడి మయాంక్ మిట్టల్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి. పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ సంబురాలను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్, బేగంపేట్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతికి నివాళులు అర్పించి స్త్రీలను గౌరవించే పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ పండుగ ఒక గర్వకారణం అని, సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్న ఈ పండుగ అంతర్జాతీయస్థాయిలో గొప్ప ఖ్యాతినార్జించిందని ఆయన అన్నారు.




## ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

(4వ పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్సింగ్ చౌహాన్ రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్‌ఎ నవీన్ మిట్టల్‌కు ధన్యవాదాలు తెలిపారు. అర్హత, ఆసక్తి,అవకాశాలు ఉన్న ప్రతి తహశీల్దార్ బదిలీలకు అవకాశం కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల బదిలీల విషయంలో ఇప్పటికే కొంత జాప్యం జరిగిందని,ఎటువంటి షరతులు లేకుండా ఎన్నికల సమయంలో బదిలీ అయిన ప్రతి తహశీల్దార్‌ను వారి వారి సొంత జిల్లాలకు వెళ్లేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# రతన్‌టాటాకు అంతిమ వీడ్కోలు

(4వ పేజీ తరువాయి)

జరుగుతాయి. రతన్ టాటా పద్మ విభూషణ్ (2008) పురస్కార గ్రహీత. దక్షిణముంబయిలోని ఎన్‌సిపిఎ (నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్) భవంతిలో రతన్ టాటా భౌతిక కాయానికి నివాళులు అర్పించేందుకు అనేక మంది ప్రముఖులు క్యూ కట్టారు. రతన్ టాటా భౌతిక కాయాన్ని కొలాబాలోని ఆయన నివాసం నుండి ఎన్‌సిపిఎకు తరలించి పుష్పాలంకారాల మధ్య ఉంచారు. పోలీసులు బ్యాండ్ వాయిస్తూ ఊరేగింపుగా రతన్ టాటా భౌతిక కాయాన్ని ఆయన నివాసం నుండి ఎన్‌సిపిఎకు తరలించారు. ఆయన భౌతిక కాయంపై జాతీయ జెండాను కప్పారు.

**30 కంపెనీలు, 100 దేశాలు ప్రపంచపటంలో టాటా గ్రూపు**

ప్రపంచ ప్రముఖ పారిశ్రామికదిగ్గజాలలో ఒకరు, పారిశ్రామికరంగంలో అత్యంత ప్రభావశీలమైన వ్యాపారవేత్త రతన్ టాటా. టాటా గ్రూపును ఆయన ప్రపంచపటంమీదకు తెచ్చారు. కేవలం భారత్‌కే కాకుండా అనేక దేశాలకు విస్తరించి టాటా గ్రూప్‌కు ఒక ప్రముఖ సంస్థగా పేరుప్రతిష్ఠలు తెచ్చారు. 1991లో జెఆర్‌డి టాటా నుండి టాటా గ్రూపు ఛైర్మన్ పగ్గాలు చేపట్టారు. గురువు, ఉపదేశకుడు జెఆర్‌డి టాటా స్థాపించిన ఎయిర్ ఇండియాను 2021లో తిరిగి టాటాగ్రూపు నియంత్రణలోకి తీసుకురావడం ఆయన సాధించిన గొప్ప విజయాలలో ఒకటి. ఆయన సారథ్యంలో టాటా గ్రూపు 70 రెట్లు అభివృద్ధి సాధించింది. కాఫీ పొడెం నుండి కార్ల వరకూ, ఉప్పు తయారీ నుండి సాఫ్ట్‌వేర్ ఎగుమతుల వరకూ ఉక్కు నుండి విద్యుత్ ఉత్పత్తి వరకూ ప్రయాణికులకోసం విమానాలు నడిపించడం దగ్గరనుండి భారతదేశ సూపర్ ఫాస్ట్ యాప్‌ను ప్రవేశపెట్టడం వరకూ రతన్‌టాటా ప్రముఖపాత్ర నిర్వహించారు. ఇటీవలకాలంలో చిప్ మేకింగ్‌లో కూడా టాటా గ్రూపు కాలు మోపింది. ఐ ఫోన్ అసెంబ్లింగ్ ప్లాంటును ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. రతన్ టాటా 30 కంపెనీలకు సారథ్యం వహించారు. 100 దేశాలకు టాటా గ్రూపును విస్తరించి వ్యాపార, వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించి జీవించినంతకాలం కొర్పొరేట్ ఉద్దండుడుగా, చిత్తశుద్ధి, క్రమశిక్షణలో ''లౌకిక జీవన సాధువు''గా ఖ్యాతి గడించి ఒక గౌరవనీయస్థానాన్ని అందుకున్నారు. ఐనప్పటికీ ఇంతవరకూ ఏనాడూ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. ప్రపంచవ్యాప్తంగా టాటా గ్రూపును విస్తరించి రెండు దశాబ్దాల పాటు ఆ గ్రూపునకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. స్టీల్ మేకర్ కోరస్, లగ్జరీ కార్ మేకర్ జాగ్వార్ ల్యాండ్ రోవర్, ప్రపంచంలో రెండవ అతిపెద్ద 'టీ' కంపెనీ టెట్లే వంటి ప్రముఖ బ్రిటీష్ ఆస్తుల సేకరణ సహా ప్రపంచ ప్రముఖుల దృష్టిని ఆకర్షించేవిధంగా గొప్పగొప్ప లావాదేవీలు నిర్వహించారు. ఇంతచేసినాగానీ ఆయన డాబూ దర్పంతో వ్యవహరించలేదని, తనను తాను గొప్పగా చూపించుకునేందుకు ప్రచార ఆర్భాటాలు చేసుకోలేదని అనేకమంది పేర్కొన్నారు.

వారసుడు ఎవరు? తీవ్ర ఉత్కంఠ

ఒక గొప్ప మహా పారిశ్రామిక సామ్రాజాన్ని నడిపించేందుకు ఇప్పుడు రతన్ టాటా లేరు. ఆయన స్థానంలో అంతటిస్థాయిలో ఈ పారిశ్రామిక, వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్వహించగల శక్తిసామర్థ్యాలున్న వారసుడు ఎవరు? అనే విషయంపై ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ నెలకుంది. ఆయన మరణంతో పదవీ బాధ్యతల సామర్థ్యంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఐతే నోయెల్ ఆయన వారసుడు అవుతారని వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన వారసుడు ఎవరనే విషయంపైనే చర్చ జరుగుతున్నది. ఈ గ్రూపులో 66 శాతం వాటా టాటా కంపెనీదే. 2024 మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరంనాటికి 165 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని టాటాగ్రూపు సంపాదించింది. ఇందులో అధికభాగం టిసిఎస్ నుండే వస్తుంది.

## కాపాడుకుందాం

(4వ పేజీ తరువాయి)

హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ హైడ్రా కార్యాలయం నుంచి వీడియా కాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా హైడ్రా కార్యాలయం నుంచి బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బెంగళూరులో మొత్తం 35 చెరువులను పునరుద్ధరించిన విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆనంద్ మల్లిగవాడ్ కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ అందరి బాధ్యతా అని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కాలనీ, బస్తీ వాసులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసి చెరువులను పునరుద్ధరించనున్నామని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో చెరువులకు పునరుజ్జీవనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి స్వచ్ఛమైన నీరు చెరువుకు చేరేలా ఏర్పాట్లు చేయడంతో పాటు . బెంగళూరు తరహాలో మురుగు నీటి కాలువల నుంచే శుద్ధి చేసే ప్రక్రియలో భాగంగా మురుగు నీరు చెరువులోకి చేరే ముందు మూడు నాలుగు దశల్లో నీరు ఉంచి ఫిల్టర్ చేసి హైడ్రా దృష్టి సారిస్తుందని చెప్పారు. అదేవిధంగా మురుగు నీటి కాలువలకు రెండు వైపులా మొక్కలు నాటడం, చెరువుకు చేరేలోపే కొంతమేర శుద్ధి జరిగేలా బెంగళూరులో ఏర్పాటు చేసిన విధానంపై అధ్యయనం చేయనున్నామని, ఇందుకు బెంగళూరు వెళ్లి అక్కడ చెరువులను పునరుద్ధరించిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆలోచనలో హైడ్రా ఉందని వెల్లడించారు. అదేవిధంగా ఆనంద్ మల్లిగవాడ్‌ను హైదరాబాదుకు పిలిపించి.. ఇక్కడ చెరువుల పునరుద్ధరణపై సహాయసహకారాలను అందజేయమని కోరనున్నామని హైడ్రా కమిషనర్ తెలిపారు. కూల్చివేతల వ్యర్థాలను తొలగించి ముందుగా సున్నం చెరువు, అప్పా చెరువు, ప్రగతినగర్ వద్ద ఉన్న ఎర్రకుంట, కూకట్‌పల్లి చెరువులకు పునరుజ్జీవనం కల్పించనున్నామని తెలిపారు. చెరువులో శుద్ధ జలాలుంటే పరిసరాలు చల్లగా.. ఏపుగా పెరిగిన మొక్కలతో చక్కటి పర్యావరణం స్థానికులకు అందుతుంది. అందుకే స్థానికులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కల్పించి.. వారే నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకునేలా హైడ్రా కసరత్తు చేయనుందని చెప్పారు.

## సాహిత్యంలో హాన్ కాంగ్‌కు నోబెల్

(4వ పేజీ తరువాయి)

ఆమె తన గద్య కవిత్వంతో కళ్లకు కట్టినట్లుగా రాయల్ స్వీడిష్ అకాడమీ తెలిపింది. బుధవారం కెమిస్ట్రీ రంగంలో చేసిన కృషికి ఈ ఏడాది ముగ్గురికి ఈ గౌరవం దక్కింది. డేవిడ్ బేకర్‌కు కంప్యూటేషనల్ ప్రొటీన్ డిజైన్, ప్రొటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్‌లో డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం జంపర్‌లకు సంయుక్తంగా నోబెల్‌ను ప్రకటించారు. జాన్ జే హోప్‌ఫీల్డ్, జియోఫ్రీ హింటన్‌లో భౌతికశాస్త్రంలో చేసిన కృషికి నోబెల్ దక్కింది. వైద్య రంగంలో చేసిన కృషికి విక్టర్ అంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు సంయుక్తంగా నోబెల్‌ను ప్రకటించారు. మైక్రో ఆర్ఎన్ఎను కనుగొన్నందుకు ఇద్దరికీ నోబెల్ ఇచ్చారు. తాజాగా సాహిత్యరంగానికి నోబెల్‌ను ప్రకటించారు. ఇక శుక్రవారం నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించనున్నారు. ఆర్థిక రంగంలో నోబెల్‌ను ఈ నెల 14న ప్రకటించనున్నారు. నోబెల్ పురస్కారం అందుకున్న వారికి మిలియన్ డాలర్ల నగదు పారితోషకం అందించనున్నారు. 1896లో మరణించిన అవార్డు వ్యవస్థాపకుడు, స్వీడిష్ ఆవిష్కర్త ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా ప్రకారం 1904లో నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తూ వస్తున్నారు. మొదట భౌతిక శాస్త్రంలో, రసాయన శాస్త్రంలో, సాహిత్యంలో, వైద్యశాస్త్రంలో కృషి చేసిన శాస్త్రవేత్తలకు, ప్రపంచ శాంతికి కృషిచేసిన వారికి ఏటా నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తున్నారు. అయితే, 1963 నుంచి బ్యాంక్ ఆఫ్ స్వీడన్ నుంచి ఆల్ఫ్రెడ్ నోబెల్ గౌరవార్థం ఆర్థికశాస్త్రంలో కృషి చేసిన వారికి సైతం నోబెల్‌కు ఎంపిక చేయడం జరుగుతున్నది. పురస్కారాలను డిసెంబర్ 10న అవార్డు గ్రహీతలకు ప్రదానం చేయనున్నారు.

## ఎపికి వెళ్లాల్సిందే

(4వ పేజీ తరువాయి)

ఐపిఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కేంద్రం సర్దుబాటు చేసింది. దీంతో ఐఎఎస్ అధికారులు వాకాటి కరుణ, రోనాల్డ్‌రోస్, ఆమ్రపాలి, వాణీప్రసాద్, మల్లెల ప్రశాంతితో పాటు ఐపిఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిషేక్ మొహంతి, అభిలాష బిస్త్ తమను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. వారి అభ్యర్థులను కేంద్ర ప్రభుత్వం తిరస్కరిస్తూ, వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాలని ఆదేశించింది. అయితే వీరిలో కొందరు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై వారు గతంలో క్యాట్‌ను కూడా ఆశ్రయించగా ఆ అధికారుల అభ్యర్థనను క్యాట్ అంగీకరిస్తూ తీర్పునిచ్చింది. కానీ క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ కేంద్రం ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ఐఎఎస్,ఐపిఎస్‌ల అభ్యర్థనలను మరోసారి పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సూచించింది. ఈ నేపథ్యంలో ఐఎఎస్, ఐపిఎస్‌ల అభ్యంతరాల పరిశీలన బాధ్యతలను రిటైర్డ్ ఐఎఎస్ అధికారి దీపకును కేంద్రం నియమించింది. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ అధికారుల అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కాగా ఎపిలో పని చేస్తున్న తెలంగాణ కేడర్ ఐఎఎస్ అధికారులు ఎస్.ఎస్ రావత్, అనంత్ రాము, లోతేటి శివశంకర్, సృజనలను కూడా రిలీవ్ చేస్తూ డిఒపిటి ఆదేశాలు జారీ చేసింది.

ఇదీ వివాదం : ఉమ్మడి ఎపి విభజన సమయంలో అధికారులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కేంద్రం సర్దుబాటు చేసింది. అయితే వారిలో కొందరు మాత్రం అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వివిధ కారణాలను చూపిస్తూ తమను తెలంగాణ కేడర్‌కు మార్చాలని కేంద్రాన్ని కోరారు. ఇదే విషయంపై వారు గతంలో క్యాట్‌ను కూడా ఆశ్రయించారు. ఆ అధికారుల అభ్యర్థనను అంగీకరించిన క్యాట్ వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ కేంద్రం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గత మార్చిలో దీనిపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు అభ్యర్థనలను మరోసారి పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశం ప్రకారం అభ్యంతరాల పరిశీలన కోసం విశ్రాంత ఐఎఎస్ అధికారి దీపక్‌ను నియమించింది. ఆయన ఇచ్చిన నివేదిక మేరకు అధికారుల అభ్యర్థనలను తోసిపుచ్చుతూ తాజాగా నిర్ణయం తీసుకుంది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాలని ఐఎఎస్, ఐపిఎస్‌లకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# జిహెచ్ఎంసి పథకాలు భేష్

## ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అధికారుల బృందం కితాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**జిహెచ్ఎంసి అందిస్తున్న పౌర సేవలతో పా టు అమలు చేస్తున్న పథకాలు బేష్.. అంటూ ఆంధ్రప్రదేవ్ మున్సిపల్ అధికారులబృందం కితాబు ఇచ్చింది. గురువారం జిహెచ్ఎంసి అమలు చేస్తున్న పథకాల అధ్యయనం చేయడానికి హైదరాబాద్‌కు విచ్చేసిన గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, ఈఈ సుందర రామి రెడ్డి, ఏలూరుకమిషనర్ ఏ.భాను ప్రతాప్, ఏఈఎలక్ట్రికల్ శేషగిరిరావు, రెవె న్యూ ఇన్స్పెక్టర్ నంబూరి రవి, నెల్లూరు మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎస్ ఈ గిరిధర్,గ్రేటర్ విశాఖ పట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ కా లూరి వెంకటనాగరవి,మనోజ్ కుమార్‌లతోకూడిన ప్రతినిధుల బృందం జిహెచ్ఎంసిని సందర్శించారు. మున్సిపల్ అధికారులు జిహెచ్ఎసి వి ధానాలు,అభివృద్ధిపథకాలను సమీక్షించారు. ముఖ్యంగా ట్యా క్స్,ఫైనా న్సు, సిఆర్ఎంపి (కస్టమర్ రిలేషన్ మేనేజ్మెంట్ పోర్టల్), సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి కీలక విభాగాల్లో జిహెచ్ఎంసి తీసుకుంటున్న చర్యలను అధికారులు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అధికారుల బృందానికి వివరించారు.ఇందులోభాగంగా జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్ (ట్యాక్స్), గీత రాధిక (ఫైనాన్సు), సిఆర్ఎంపి విభాగంలో సిఇ భాస్కర్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్లో యస్ఈ కోటేశ్వర రావు, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి, తదితరులు తమ విధానాలు, ప్రజల సమస్యలను పరిష్కరించే విధానాలను ఆంధ్ర అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.జిహెచ్ఎంసి విధానాలను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అధికారులు జిహెచ్ఎంసి అమలు చేస్తున్న పథకాలను ప్రశంసించారు.

# దసరా,దీపావళికి 1400 రైళ్లు

### * అక్టోబరు 1 నుంచి నవంబర్ 30 వరకు వేర్వేరు తేదీల్లో నడుపుతామని ద.మ రైల్వే వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు 1,400 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవడం ద్వారా రైలు ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా పండుగ సీజన్లలో ప్రభుత్వ సెలవులు, ముఖ్యమైన సందర్భాలలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపింది. దసరా, దీపావళి పండుగల సీజన్ దృష్ట్యా అక్టోబర్, నవంబర్ మాసాలలో రెండు తె లుగు రాష్ట్రాల మధ్య ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని ఉత్తర భారత రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్ పశ్చిమ బెంగాల్ వంటి తూర్పు రాష్ట్రాలకు కూడా ప్రయాణించడానికి అధిక డిమాండ్ ఉన్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ప్రస్తుతం ఈ రైళ్లు అక్టోబరు 1 నుంచి నవంబర్ 30 వరకు వేర్వేరు తేదీల్లో నడుపుతున్నట్లు వెల్లడించింది. ప్రజలు పెరుగుతున్న డిమాండ్ తీర్చడానికి రాబోయే రోజుల్లో మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించాలని దక్షిణ మధ్య రైల్వే యోచిస్తోంది. ముఖ్యంగా ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బుకింగ్ కౌంటర్లను కూడా ఏర్పాటు చేస్తోంది. ఈ రైలు సేవలు దక్షిణ మధ్య రైల్వే లోని ప్రధాన స్టేషన్ల నుండి తిరుపతి, నిజాముద్దీన్, విశాఖపట్నం, సంత్రాగచ్చి, గోరఖ్‌పూర్, అగర్తల, రక్సాల్, నాగర్‌సోల్, దానాపూర్, శ్రీకాకుళం, నాగ్‌పూర్, మాల్డా టౌన్, పాట్నా, షాలిమార్, షిర్డీ, సోలాపూర్, పూణే, ముంబై, జైపూర్ మొదలైన ప్రముఖ మార్గాలలో నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక రైళ్లలో అన్ని వర్గాల ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి రిజర్డ్వ కోచ్‌లు, అన్ రిజర్డ్వ కోచ్‌ల మిశ్రమ కూర్పుతో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే రిజర్వ్ చేయని కోచ్‌ల ద్వారా ప్రయాణించాలనుకునే ప్రయాణికుల కోసం జనరల్ కౌంటర్ల వద్ద క్యూలో నిలబడకుండా తమ టిక్కెట్లను మొబైల్ యాప్‌లో యూటిఎస్ ద్వారా కొనుగోలుచేసుకొనే అవకాశం ఏర్పాటుచేసినట్లు తెలిపింది. రాబోయే రోజుల్లో రోలింగ్ స్టాక్, ట్రాక్ సామర్థ్యం తదితర వనరుల లభ్యత మేరకు మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టేందుకు జోన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైల్వే ప్రయాణికులకు అనుకూలమైన సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ప్రయత్న ంలో భాగంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న రైలు మార్గాలను క్రమం తప్పకుం డా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ నిరంతరం పర్యవేక్షణ ద్వారా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లను సమర్థవంతంగా నడుపుతున్నట్లు తెలిపారు.

# ‘ఒకే దేశం—ఒకే ఎన్నికలు’ ప్రణాళికను రద్దు చేయండి

### కేరళ అసెంబ్లీ తీర్మానం

**తిరువనంతపురం :** దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ‘ఒకే దేశం, ఒకే ఎన్నికలు’ ప్రణాళికను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ కోరింది. ఈ ప్రతిపాదన అప్రజాస్వామ్యమని ఆరోపించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. కేరళ అసెంబ్లీ ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేరళ సిఎం పినరయి విజయన్ తరపున ఆ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎంబి రాజేష్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ‘ఒకే దేశం, ఒకే ఎన్నికలు’ ప్రతిపాదన దేశంలోని సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ‘ఈ ప్రతిపాదన అప్రజాస్వామికం. దేశంలోని సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వైవిధ్యాలను దెబ్బతీసే ప్రయత్నం. ఖర్చులను తగ్గించడానికి, సులభతరమైన పాలనను నిర్ధారించడానికి సులభమైన మార్గాలున్నాయి. రాజ్యాంగంలోని ప్రధానమైన సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేయడం, ప్రజల హక్కులను సవాలు చేయడం, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక స్వపరిపాలన హక్కులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదన ఉంది’ అని అన్నారు. కాగా, ‘ఒకే దేశం, ఒకే ఎన్నికలు’ ప్రతిపాదన అధికార కేంద్రీకరణకు దారితీస్తుందని మంత్రి ఎంబి రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో కేంద్రీకృత, ఏకీకృత పరిపాలనా వ్యవస్థను అమలు చేయడానికి బిజెపి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఎజెండాలో ఇది ఒక భాగమని ఆయన ఆరోపించారు. మరోవైపు కేరళ అసెంబ్లీలో బిజెపికి ఒక్క శాసనసభ్యులైనా లేరు. అలాగే ‘ఒకే దేశం, ఒకే ఎన్నికలు’ ప్రతిపాదనకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన మొదటి రాష్ట్ర అసెంబ్లీగా కేరళ నిలిచింది.

# కార్లు, బంగ్లాల కోసం రాజకీయాలు చేయం: సిఎం ఆతిశీ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో ఆప్, బిజెపి మధ్య మరోసారి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లో ఢిల్లీ సిఎం అధికారిక నివాసం నుంచి ఆతిశీని బలవంతంగా ఖాళీ చేయించారంటూ ఆప్ చేస్తోన్న ఆరోపణలతో అక్కడి రాజకీయం మరోసారి వేడెక్కింది. తాజాగా సిఎం ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించలేమన్న నిరాశతోనే బిజెపి ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో బిజెపికి రెండంకెల సీట్లు కూడా రావన్నారు. ఆప్‌ను చీల్చేందుకు గతంలో చేపట్టిన ‘ఆపరేషన్ కమలం’ విఫలమైందన్న ఆతిశీ.. ఆప్ నేతలను జైళ్లకు పంపినా కాషాయ పార్టీకి ఫలితం దక్కలేదన్నారు. తమ పార్టీ బంగ్లాలు, కార్ల కోసం రాజకీయాలు చేయదని చెప్పారు. అవసరమైతే.. ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు వీధుల్లోంచి పనిచేసేందుకు సైతం సిద్ధంగానే ఉన్నారన్నారు.

**ఆప్ డ్రామాలు ఆడుతోంది : బిజెపి**

ఆతిశీ తన వస్తువులతో నిండిన డబ్బాలు ఉన్నచోట ఫైల్స్‌పై సంతకాలు చేస్తున్న ఫొటోలను ఆప్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంపై బిజెపి తప్పుపట్టింది. ఆప్ డ్రామాలు ఆడుతోందని.. ప్రజల్లో సానుభూతి కార్డు ప్లే చేస్తోందని మండిపడుతోంది. ఆప్ నేతలు చెబుతున్నట్లుగా ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని బంగ్లా ఢిల్లీ సిఎం అధికారిక నివాసం కాదని బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ అన్నారు. ఆతిశీకి మథుర రోడ్డులో ఇప్పటికే బంగ్లా ఉందని.. ఆప్ నేతలు చెబుతున్నవి కేవలం ఆరోపణలేనన్నారు. సిఎం ఢిల్లీ సచివాలయంలో తన పూర్తి స్థాయి కార్యాలయం నుంచే పని చేయాల్సి ఉన్నా.. ఇలా ఖాళీ పెట్టెలు ఉన్నచోట ఫైళ్లపై సంతకాలు చేస్తున్నట్లుగా ఉన్న ఫొటోలను షేర్ చేయడం ద్వారా ఆప్ నేతలు సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి నేతలు పేర్కొన్నారు.

# ఆదాయ సమీకరణాలకు ఉన్న అవకాశాలపై సిఎం ఆరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్రవార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ పెంపు మార్గాలపై దృష్టిని సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సమీకరణపై వివిధ శాఖలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. గురువారం సిఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణలో ఆ దాయ సమీకరణాలకు ఉన్న అవకాశాలను సిఎం ఆరా తీశా రు. కెసిఆర్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అ ప్పులు మోపిందని, అప్పటి అప్పులకు వడ్డీలు కట్టేందుకే రాష్ట్ర ఖజానాలో మెజారిటీ వాటా ఆదాయం పోతున్నదని అనేకసందర్భాల్లో ముఖ్యమంత్రి సహామంత్రులు చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఆదాయ మా ర్గాలు తగ్గుతుంటే అప్పుల భారం పెరుగుతుంటడంతో ఆదా య వనరులను సమకూర్చుకునేందుకు ఈ సమీక్షలో సిఎం చర్చించారు. ఎక్కడా ఆర్థిక పరమైన ఇబ్బందులు ఏర్పడకుం డా ఆదాయ మార్గాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కేంద్రం వద్ద నిధులు రాబట్టుకునే విషయంలో ఎక్కడైనా అంతరం ఏర్పడిందా అనే అంశాన్ని అధికారులను ఆరా తీసినట్లు తెలుస్తున్నది.

### తెలంగాణ గొంతుక వినిపించనున్న

# అభిషేక్ మను సింఘ్వీ

### డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీని తెల ంగాణ నుంచి రాజ్యసభకు పంపడం చారిత్రాత్మకమైన అవసరమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం హైదరదబాద్‌లో మాజీ రాజ్యసభ సభ్యులు గిరీష్ సంఘీ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఔన్నత్యాన్ని కాపాడటంలో విజయం సాధించి దేశంలోనే నిష్ణాతులైన గొప్ప న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతలు గడించిన అభిషేక్ మను సింఘ్వీ తెలంగాణ ప్రజల గొంతుక గా పెద్దల సభలో తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం తన గళాన్ని వినిపించనున్నార న్నారు.కొట్లాడి కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రానికి విభజన చట్టం ద్వారా రావాల్సిన హక్కులు దశాబ్ద కాలంగా ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని వీటిని చట్టసభల్లో , న్యాయస్థానాల్లో వాదించి రాష్ట్రం గెలవడానికి ఉపయోగపడే వ్యక్తి అభిషేక్ మను సింఘ్వీ తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు. ప్రజల పక్షాన ప్రజాస్వామ్యం నిలబెట్టడం కోసం, చట్టాలను నిలబెట్టడం కోసం సుప్రీంకోర్టు ఇతర న్యాయస్థానాల్లో ఆయన చేసిన వాదనలు సాధించిన విజయాల అనుభవాలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడతాయన్నారు.

# చోరీకి గురైన స్మార్ట్‌ఫోన్ పట్టుకున్న ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి బృందాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ రైల్వే జిఆర్‌పి , ఆర్‌పిఎఫ్ అధికారుల సత్వర వేగవంత మైన చొరవతో రష్యన్ పర్యాటకురాలి నుండి దొంగిలించబడిన ఫోన్‌ని గుర్తించి ప్రముఖ సోషల్ మీడియా యాప్‌లోని లొకేషన్ ట్రాకింగ్ ఫీచర్ ఆధారంగా పట్టుకున్నారు. ఆగస్టులో దొంగిలిం చబడిన ఈ ఫోన్‌ను అధికారులు అక్టోబర్‌లో కనుగొన్నారు. 17 ఆగస్టు 2024న రష్యన్ పర్యాట కురాలు నినా నికోనోరోవా అనే మహిళ గయా కామాఖ్య ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తోంది. రైలు బీహార్‌లోని ఫల్గు నది మీదుగా వెళుతుండగా బయట ఉన్న అందమైన దృశ్యాలను నినా వీడియోలను రికార్డ్ చేస్తోంది. అదే సమయంలో కొందరు ఆమె చేతిని కర్రతో కొట్టి ఆమె మొబైల్ ఫోన్‌ను లాక్కొని వెళ్లారు. షాక్‌కు గురైన నీనా గయా, షేక్‌పురా కామాఖ్య రైల్వే స్టేషన్‌లలో దొం గతనం జరిగినట్లు రైల్వే పోలీసులకు (జిఆర్‌పి) ద్వారా ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసింది. దీంతో జిఆర్‌పి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో కలిసి సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టారు. పింటూ కుమార్, సజన్ కుమార్ అనే ఇద్దరు అనుమానిత వ్యక్తులను పోలీ సులు అరెస్టు చేయగా వారి నుండి దొంగిలించిన మూడు మొబైల్ ఫోన్‌లను లభించాయి. కాగా అందులో నీనా ఫోన్ కనిపించక పోవడంతో వారిని ప్రశ్నించగా బీహార్ నివాసి సాహిల్ పాశ్వాన్ నీనా ఫోన్‌ను దొంగిలించినట్లు వెల్లడించారు. ఆమె నుండి దొంగిలించబడిన ఫోన్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో యాక్టివ్‌గా ఉందని ఐక్లౌడ్ ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు నాగ్‌పూ ర్‌కు చేరుకుని యాప్ లొకేషన్ డేటా సహాయంతో చివరికి నిందితుడి ఆచూకిని కనుగొని ప్రధాన నిందితుడైన సాహిల్ పాశ్వాన్‌ని గుర్తించి చోరీకి గురైన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా నినా ఫోన్ లభించడంలో ఐక్లౌడ్ నోటిఫికేషన్, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ బృందాల సహకారం, ఆధునిక సాంకేతికత ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించాయని అధికారులు తెలిపారు.

# బొగ్గు అమ్మకం లాభాలు అంతంతే

### సింగరేణి సిఎండి బలరాం వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి కాలరీస్ సుస్థిర భవిష్యత్ కోసం సంస్థ ఆర్థిక స్థితి గతులపై ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉండాలని సింగరేణి సిఎండి బలరాం అన్నారు. ఇటీవల సింగరేణి లాభాల వాటా పంపిణిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు నిర్వహించిన సమీక్షా సమావేశం నేపథ్యంలో గురువారం సింగరేణి వ్యాప్తంగా ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర అన్న అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎండి ఎన్.బలరామ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కంపెనీ ఆర్థిక పరిస్థితులను, పనితీరును వివరించారు. సింగరేణి ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగు పరుచుకోకపోతే కంపెనీ మనుగడ చాలా కష్టమని, పని సంస్కృతిలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి కార్మికులతో పాటు కార్మిక సంఘాలు కూడా సహకరించాలని కోరారు.కంపెనీకి సంబంధించిన ఆర్థిక స్థితిగతులను ఆయన ఉద్యోగులతో పంచుకున్నారు. ఇప్పటి వరకు సింగరేణి సంస్థ సాధిస్తున్న లాభాలు కేవలం బొగ్గు ఉత్పత్తి వల్లనే అని చాలా మంది భావిస్తున్నారని, కానీ వాస్తవానికి బొగ్గు వల్ల వస్తున్న లాభాల కన్నా ఇతరత్రా ఫైనాన్షియల్ ఇంజనీరింగ్ వల్ల సమకూరుతున్న నిధులతోనే లాభాలు పెరిగాయన్నారు. కంపెనీ భవిష్యత్ కోసం చేసిన డిపాజిట్ల వల్ల వచ్చే వడ్డీ ఆదాయం రూ.900 కోట్లకు పైగా ఉంటోందని, అలాగే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా ఏడాదికి సుమారు 500 కోట్ల రూపాయల లాభం సమకూరుతుందని, ఇవన్నీ కలిసి సింగరేణి సంస్థ లాభాల్లో ఉన్నట్లు కనపడుతుందన్నారు. భూగర్భంలో టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ. 10 వేల ఖర్చు అవుతుండగా, బొగ్గు అమ్మకం ధర కేవలం 5 వేల లోపే ఉందని, టన్నుకు సుమారు 5 వేల నుండి 6 వేలనష్టం వాటిల్లుతోందన్నారు.ఓపెన్‌కాస్ట్ గనుల్లో కూడా భారీ యంత్రాల వినియోగం 24 గంటల్లో కేవలం 12గంటలు ఉంటుందని, మొత్తం మీద చూస్తే బొగ్గు అమ్మకం ద్వారా లభించే లాభాలు దాదాపు 1శాతం కన్నా తక్కువగా ఉంటున్నాయని సిఎండి ఆవేదన వ్యక్తం చేశారు. కనుక రానున్న పోటీ మార్కెట్ లో నిలబడాలంటే సింగరేణి కార్మికులు యంత్రాలను పూర్తి సమయం వినియోగించాల్సిన అవసరం ఉందని, లేదంటే సింగరేణి సంస్థ మనుగడ ప్రమాదంలో పడుతుందని సిఎండి బలరాం హెచ్చరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్మికులకు అన్ని విషయాలు వివరించమని ఆదేశించిన నేపథ్యంలోనే తాము ఈ వాస్తవాలు వెల్లడిస్తున్నామన్నారు. కార్మికులు కష్టపడటానికి సిద్ధంగా ఉంటారని, వారిని నడిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, చాలామంది అధికారులు టీమ్ వర్క్ గా పనిచేయటం లేదన్నారు. త్వరలో కంపెనీలో ఉన్న అందరూ అధికారులతో కూడా సమావేశం నిర్వహించి వాస్తవాలు వివరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ విభాగాలు అధికారులు కూడా విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్టు గమనించానని అటువంటి వారిని ఉపేక్షించ బోమనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య కార్మిక సంఘం తరఫున ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థను లాభాల బాటలో తీసుకెళ్లడం కోసం తమ యూనియన్ అంకితభావంతో పనిచేస్తుందన్నారు. సింగరేణి సంస్థ నష్టాలు ఉన్నప్పుడు లాభాల్లోకి తీసుకురావడానికి కార్మికులంతా కలిసి యాజమాన్యంతో సహకరించారని, ఇప్పుడు కూడా అటువంటి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ సుభానీ అధ్యక్షత వహించారు. జిఎం (మార్కెటింగ్) రవి ప్రసాద్ పాల్గొన్నారు.

# హర్యానా కొత్త ఎంఎంల్‌ఎల్లో 96 శాతం మంది కోటీశ్వరులు

### 13 శాతం మందిపై క్రిమినల్ కేసులు : ఎడిఆర్

**న్యూఢిల్లీ :** హర్యానా అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఎంఎల్‌ఎల్లో 96 శాతం మంది శాసనసభ్యులు (86 మంది) కోటీశ్వరులు. అదే విధంగా13 శాతం మంది (12)పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ మేరకు అసోసియేట్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వెల్లడించింది. మొత్తం 90 స్థానాల్లో గెలుపొందిన శాసనసభ్యులు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించింది. గతంలో పోలిస్తే కోటీశ్వరుల సంఖ్య కాస్త పెరిగింది. 2019లో గెలుపొందిన వారిలో 93 శాతం మంది కోటీశ్వరులు కాగా ఈసారి ఆ సంఖ్య మరో మూడు శాతం పెరిగింది. 90 మంది ఎంఎల్‌ఎల్లో 44 శాతం మంది రూ. 10 కోట్లకుపైగా ఆస్తులను కలిగి ఉన్నారు. కేవలం 2.2 శాతం మంది మాత్రమే రూ. 20 లక్షల లోపు ఆస్తులుగల వారు ఉన్నారని ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది. ఈ ఎన్నికల విజయం సాధించిన అభ్యర్థుల ఆస్తుల విలువ సగటున ఒక్కొక్కరికి రూ. 24.97 కోట్లుగా ఉన్నాయి. 2019లో రూ. 18.29 కోట్లు ఉండగా, ఇప్పుడు కొంత పెరిగాయి. పార్టీల వారీగా పరిశీలిస్తే.... 96శాతం మంది బిజెపి, 95 శాతం కాంగ్రెస్, 100 శాతం గెలిచిన ఐఎన్‌ఎల్‌డి, స్వతంత్ర సభ్యులు తమ ఆస్తులు రూ. 1 కోటి రూపాయలుగా ఉన్నట్లు ప్రకటించారు. అత్యధిక ఆస్తులను స్వతంత్ర ఎంఎల్‌ఏ సావిత్రి జిందాల్ రూ. 270 కోట్లను కలిగి ఉన్నారు. బిజెపి సభ్యుడు శక్తి రాని శర్మకు రూ. 145 కోట్లు, శృతి చౌదరికి రూ. 134 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 30 మంది శాసనసభ్యులు తిరిగి ఎన్నికయ్యారు. వారి సగటు ఆస్తుల విలువ 59 శాతం పెరిగింది. 2019లో రూ. 9.08 కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ. 14.46 కోట్లు ఉన్నాయి. ఇదిలా ఉండగా, గెలుపొందిన అభ్యర్థుల్లో 12 మంది తమపై నేరపూరిత కేసులు ఉన్నట్లు ప్రకటించారు. అందులో ఆరుగురిపై తీవ్రమైన కేసులు ఉండగా, ఒకరు హత్యాయత్నం కేసులో నిందితుడుగా ఉన్నారు. పార్టీల వారిగా పరిశీలిస్తే... 19 శాతం మంది కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు, 6 శాతం మంది బిజెపి సభ్యులు, 67 శాతం మంది స్వతంత్ర సభ్యులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించుకున్నారు. కాగా, గెలుపొందిన 28 మంది సభ్యులకు రూ. కోటి అంతకన్నా ఎక్కువగా అప్పులు ఉన్నట్లు ఎడిఆర్ గణాంకాల ద్వారా వెల్లడైంది. ఈ జాబితాలో కాంగ్రెస్‌కు చెందిన రాజ్‌బీర్ ఫర్టియా రూ. 44 కోట్లతో మొదటిస్థానంలో ఉన్నారు. ఆదాయన్ని సంపాదించే వారిలో కూడా ఫర్టియానే తొలిస్థానంలో ఉన్నారు. ఇక విద్యార్హతలను చూస్తే... 68 శాతం సభ్యులు గ్రాడ్యుయేట్లు లేదా ఉన్నత డిగ్రీలు పొందిన వారున్నారు. అదే విధంగా 29 శాతం మంది 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వారు ఉన్నట్లు ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది. కొత్త అసెంబ్లీలో 14 శాతం మంది మహిళా సభ్యులు ఉన్నారు. 2019తో పోల్చితే పది శాతం మంది పెరిగారు. 66 శాతం మంది ఎంఎల్‌ఏల వయస్సు 51—80 ఏళ్ల మధ్యగల వారున్నారు.

# ఎస్‌పి, కాంగ్రెస్ పొత్తు కొనసాగుతుంది: అఖిలేష్



**ఎటవా:** ఈ ఏడాది చివర్లో ఉత్తరప్రదేశ్‌లోని 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనునున్నాయి. ఈ నేపథ్యంలో ఆరు స్థానాలకు ఎస్‌పి అభ్యర్థులను ప్రకటించించింది. అయితే కాంగ్రెస్‌తో తమ పార్టీ పొత్తు కొనసాగుతుందని ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. తన తండ్రి, సమాజ్‌వాదీపార్టీ (ఎస్‌పి) వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించేందుకు ఉత్తరప్రదేశ్‌లోని ఇటావాకు వెళ్లిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపఎన్నికల కోసం పార్టీ టిక్కెట్ల పంపిణీ గురించి అడిగినప్రశ్నకు అఖిలేష్ స్పందిస్తూ ఇండియాకూటమి ఉంటుందని తాను చెప్పదలుచుకున్నానని,ఎస్‌పి, కాంగ్రెస్ పొత్తు చెక్కుచెదరకుండా ఉంటుందన్నారు. రాజకీయాల గురించి చర్చించడానికి ఇది సమయం కాదని అన్నారు. హర్యానా ఎన్నికల ఫలితాలపై స్పందించగా, తాము మళ్లీ సమావేశమైనప్పుడు దీనిపై చర్చిస్తామన్నారు.

# న్యాయం జరిగే వరకూ...‘తగ్గేదే లే’ !

**కోల్‌కతా:** ఆర్‌జి కర్ మెడికల్ కాలేజి, హాస్పిటల్‌లో ట్రైనీ మహిళా డాక్టర్ దారుణ హత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ కోల్‌కతాలోని ఆర్‌జి కర్ హాస్పిటల్ వద్ద జూనియర్ డాక్టర్లు (జూడాలు) చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష గురువారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర వ్యాపితంగా దుర్గా పూజ పండుగ ఉత్సవాలు నిర్వహించాల్సిన తరుణంలో జూనియర్ డాక్టర్ల నిరసనలు, ఆమరణ నిరాహారదీక్షలు మమతా బెనర్జీ ప్రభుత్వానికి ఊపిరిసల్పకుండా చేస్తున్నాయి. వివిధ మెడికల్ కాలేజీలకు చెందిన 9మంది జూనియర్ డాక్టర్లు ఇక్కడ చేపట్టిన దీక్ష గురువారం మధ్యాహ్నం 230గంటలకు 113 గంటల ఆమరణదీక్షలోకి ప్రవేశించింది. కోల్‌కతా నగరంలోని నడిబొడ్డున ధర్మతాలలోని డొరినా క్రాసింగ్ వద్ద శనివారం సాయంత్రం తమ విధులను పూర్తిగా నిలిపివేసి జూనియర్‌డాక్టర్లు ఆర్‌జి కర్ హాస్పిటల్‌లో హత్యాచారానికి గురైన అభయకు న్యాయం జరగాలని ఆమరణనిరాహార దీక్షను ప్రారంభించారు. దీంతో ఆరోగ్యసేవలు నిర్వీర్యం అయ్యాయి.

పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం నిరసనకారుల ప్రతినిధులను ఆహ్వానించి వారి డిమాండ్లపై చర్చలు జరిపినప్పటికీ ఈ ప్రతిష్టంభనను తొలగించడంలో వైఫల్యం చెందింది. చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నిరసన కొనసాగిస్తున్న డాక్టర్లు మాట్లాడుతూ తమ నుంచి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ‘మౌఖిక హామీలకు’ మాత్రమే పరిమితమైంది తప్ప పరిష్కారం దిశగా సరైన చర్యలు చేపట్టడంలేదని మనోజ్‌పంత్ ఎదుట ఆరోపించారు. నిరసన తెలియజేస్తున్న డాక్టర్లు మాట్లాడుతూ నగరంలోని దుర్గ పూజ మంటపాల బయట కరపత్రాలు పంచుతున్న తమ సహచరులు (కొలీగ్స్), ఇతర యువకులు, మహిళలను పోలీసులు పట్టుకుంటున్నారని విమర్శించారు. ప్రదర్శనల సందర్భంగా అరెస్ట్ అయినవారికి తాము పూర్తిగా న్యాయపరమైన సహకారాన్ని అందజేయనున్నట్లు వారు చెప్పారు. అరెస్ట్ చేసిన వారిని అలిపోర్‌లోని కోర్టులో మధ్యాహ్న సమయంలో హాజరుపర్చారని చెప్పారు. అయితే పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ కొంతమంది డాక్టర్లు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. శాంతియుతంగా చేస్తున్న ప్రదర్శనలను భగ్నం చేసేందుకే పోలీసులు తమపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని వారు ఆరోపించారు. కోల్‌కతా నగర వ్యాప్తంగా దుర్గ పూజా మంటపాలలో సప్తమిని పురస్కరించుకుని సందడి వాతావరణంనెలకొంది. నిరసన చేపట్టిన డొరీనా క్రాసింగ్ వద్దకు ప్రజలు గణనీయసంఖ్యలో చేరుకుని గుమిగూడారు. వారందరూ వైద్యుల నిరసనకు సంఘీభావం తెలియజేశారు. హత్యాచారానికి గురైన అభయ తండ్రి గతంలో దీక్షకు కూర్చున్న సమయంలో మాట్లాడుతూ ‘నిరసన కొనసాగిస్తున్న వారు తమ ఆరోగ్యం పట్ల ఏమాత్రం ఆందోళన చెందడం లేదు. ఒక ముఖ్యమైన కారణం కోసం మేం వారికి మద్దతు ఇస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కనుక జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలి అనుకుంటే అదొక పెద్ద విషయం ఏమాత్రం కాదని, ఒక 10నిమిషాల సమయం సరిగ్గా కేటాయిస్తే చాలు వెంటనే డిమాండ్లు అన్నీ పరిష్కారమవుతాయి’ అని విలేకరులతో మాట్లాడిన సందర్భంగా వెల్లడించారు. గురువారం నాడు నిరసన తెలియజేస్తున్న జూనియర్ డాక్టర్లతో పాటు సీనియర్ డాక్టర్లు కూడా వారితో జతకట్టారు.

### మానవ అక్రమ రవాణా కేసులో

# ఐదుగురిపై ఎన్ఐఎ ఛార్జిషీట్

### భారతీయులను లావోస్ దేశానికి పంపిస్తున్న ముఠా నెట్‌వర్క్ గుట్టురట్టు

### యురోపియన్, అమెరికన్ పౌరులు లక్ష్యంగా సైబర్ నేరాలకు ఒప్పుకునేలా బలవంతం

### ముఠా ప్రధాన సూత్రధారి కమ్రాన్ హైదర్ అని స్పెషల్ కోర్టుకు అభియోగపత్రం దాఖలు




**న్యూఢిల్లీ:** యురోపియన్, అమెరికన్ పౌరులను లక్ష్యంగా చేసుకుని చైనీస్ స్కామర్లు నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ స్వీట్ షాపులలో పనిచేయడానికి భారతీయులను లావోస్‌కు పంపుతున్న ఐదుగురుతో కూడిన మానవ అక్రమ రవాణ ముఠా సభ్యులపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఎ ఛార్జిషీట్ దాఖలు చేసింది. గురువారం ఈ విషయాన్ని సంబంధిత అధికారులు వెల్లడించారు. నియా బుధవారం నాడు స్పెషల్ కోర్టులో ఈ ముఠా ప్రధాన సూత్రధారి కమ్రాన్ హైదర్ అలియాస్ జైదీతో పాటు ముఠా సభ్యులు మంజూర్ అలం అలియాస్ గుడ్డు, సాహిల్, అషబుష్ అలియాస్ అఖిల్, పవన్ యాదవ్ అలియాస్ అఫ్జల్ అలియాస్ అఫ్రోజ్‌లపై ఈ అభియోగపత్రాన్ని (ఛార్జిషీట్) దాఖలు చేసింది. ‘మానవ అక్రమ రవాణాలో ముందువరుసలో ఉన్నటువంటి అలీ ఇంటర్నేషనల్ సర్వీసెస్ అనే కన్సల్టెన్సీ సంస్థ ఈ ఐదుగురు భారతీయ యువకుల ద్వారా లావోస్ పీపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్ అనే దేశంలో విస్తరించిన మయన్మార్, థాయ్‌లాండ్ కలిసిన ప్రదేశంలోని గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతానికి హాని కలిగించేందుకు మానవ అక్రమ రవాణ చేయిస్తున్నారని నియా పరిశోధనలో వెల్లడైంది. ‘యురోపియన్, అమెరికన్ పౌరులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడేలా వారిని బలవంతంగా ఈ పనికి ఒప్పిస్తున్నారు’ అని నియా అధికార ప్రతినిధి ఒకరు ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. నియా విచారణలో ఈ పూర్తి తతంగానికి ప్రధాన సూత్రధారి కమ్రాన్ హైదర్ అలియాస్ జైదీనే అని తేలింది. చైనీస్ స్కామర్ల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన బాధితుల నుంచి వీరు బలవంతంగా క్రిప్టో కరెన్సీ వాలెట్ల ద్వారా డబ్బు తాగుతున్నారని నియా తెలియజేసింది. పవన్ యాదవ్ ఇతర మధ్య ఏజెంట్లను దాటవేస్తూ అక్రమ రవాణ వ్యక్తులకు ఉద్యోగాలు బదులు వారిని నేరుగా తాను చెప్పినట్లు వినేలా తన ఆధీనంలోకి తీసుకున్నాడు. నకిలీ ఫేస్ బుక్ ప్రొఫైల్స్‌ను రూపొందించడంలో, అమెరికా,యూరప్‌లలోని వ్యక్తులతో ఛాటింగ్ చేయడంలో నిమగ్నమై ఉన్నటువంటి చైనీస్ కంపెనీలలో వారిని నియమించుకున్నాడు. సైబర్ క్రైమ్‌లో భాగంగా క్రిప్టో కరెన్సీ యాప్‌లలో పెట్టుబడులు పెట్టమని వారిని పవన్‌యాదవ్ బలవంతంగా ఒప్పించాడని నియా తెలియజేసింది.తమ విచారణ, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన నిందితులకు సంబంధించిన చక్కటి నెట్‌వర్క్ గుట్టురట్టుచేసిందని వెల్లడించింది.



## అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** బేడ బుడగ జంగం కమ్యునిటీకి అండగా నిలిచి, మీ హక్కుల సాధనకు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని దివిటి పల్లి గ్రామంలో బేడ జంగం ఆధ్వర్యంలో నెలకొల్పిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని చూస్తే ఒక చేతిలో పుస్తకం ఉండగా ఇంకో చెయ్యి మన లక్ష్యాన్ని చూపిస్తుంది అయన అన్నారు. స్వాతంత్ర్య వచ్చినప్పటికి గిరిజనులు అన్నింటో కూడా చాలా మన లక్ష్యాన్ని చూపిస్తుంది అయన అన్నారు. స్వాతంత్ర్య వచ్చినప్పటికి గిరిజనులు అన్నింట్లో కూడా చాలా వెనకబడి ఉండేవారిని కానీ, వారు చదువును నమ్మి ఈనాడు ఉన్నతమైన పదవులు పొందుతున్నారని ఆయన గుర్తు చేశారు. చదువు ప్రాముఖ్య ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, మీ పిల్లల యొక్క భవిష్యత్తు కోసం కనీసం డిగ్రీ వరకు చదివించేటట్టు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనందఖ గౌడ్, రాష్ట్ర బేడ బుడగ జంగం అధ్యక్షులు కోడుకంటి నర్సింహులు, జిల్లా అధ్యక్షులు సరిగిరి శ్రీను, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మ ణ్ యాదవ్, మురళి, ఆంజనేయులు, మన్నెం తదితరులు పాల్గొన్నారు.



## చండీ హోమంలో మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలోభాగంగా చండిహోమ కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్, మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పలవెంకటేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో దారమోనిగణేష్, పూరిరమేష్, కిశోర్, పర్వతాలుగౌడ్, సురేష్ గౌడ్, రామకృష్ణ, విష్ణు, రవి, శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అలంకరణలో వాసవీమాత

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లాకేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 54వదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం వాసవికన్యకాపరమేశ్వరిమాత దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. విశేషపూజ కార్యక్రమంలో పలువురు దంపతీయుతంగా పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈపూజ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆలయానికి విచ్చేసిన జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి ప్రసాద్ దంపతులను ఆలయ అర్చకులు హరిబాబు ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు ఉత్సవ కమిటివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొనగా ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన చండియాగంలో సుమారు 40మంది జంటలు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతితో పూజ కార్యక్రమాలను ముగించగా ఆలయ అర్చకులు పూజలో పాల్గొన్న దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాస్టర్ బంగారుబాబు, కోలాల బృందం , బతుకమ్మలు కోలాటాలను ప్రదర్శించారు. అనంతరం మాయదృశ్యరూపాన్ని ప్రదర్శించారు.



### వెల్దండ...

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం 8వరోజు దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మిరియాల రాజయ్య పద్మ , ఉప్పు ఆంజనేయులు జ్యోతి, అలంపల్లి కృష్ణ అనిత దంపతులు పూజలుగావించి కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణగావించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, మిషన్‌భగీరథ రాష్ట్రమాజీవైస్‌చైర్మన్, ఉప్పలట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చురామకృష్ణ, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కల్మచర్ల రమేష్, జిల్లా కోశాధికారి శివజగదీశ్వర్, ఆర్యవైశ్యసంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మిర్యాల రాజయ్య, జూలూరు ఈశ్వరయ్య, మిర్యాలదినేష్, ఉప్పలసంతోష్‌కుమార్, శేఖర్, రాఘవేందర్, శ్రీకాంత్, ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## మట్టిరోడ్డుకు తాత్కాలిక పనులు

**ప్రజాపక్షం/వెల్దండ :** ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అక్కడక్కడ దెబ్బతిందని గతవారం రోజులక్రితం మండలపరిధిలోని కంటోనిపల్లికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి వచ్చారు. దీంతో గ్రామంలో కొన్ని సమస్యలను మాజీసర్పంచ్ రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ సురేందర్‌లు తీసుకోవడంతో వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులుచేపట్టాలని వారికి సూచించారు. దీంతో గురువారం మండలకేంద్రం నుంచి కంటోనిపల్లి దాదాపుగా మూడున్నర కిలోమీటర్ల పొడవు రోడ్డుకు ఇరువైపులా మొరంపోసి చదునుచేశారు.

## డిఎస్‌సి ఎస్‌జిటి ఉద్యోగం సాధించిన అంధుడు



**ప్రజాపక్షం / పెబ్బేరు :** మున్సిపాల్టీలో అంబేద్కర్ నగర్‌కు చెందిన బొంగు రమేష్ 2024 డిఎస్‌సి, ఎస్‌జిటి తెలుగు ఉద్యోగం సాధించాడు. వివరాల్లోకి వెళ్తే తల్లిదండ్రులు ఇద్దరు చనిపోవడంతో పట్టుదలతో అందుల పాఠశాలలో చదివి డిఎస్సి టీచర్ ఉద్యోగం సాధించాడు. చదువుకు వికలత్వం అడ్డు కాదని రమేష్‌ను ఆదర్శంగా తీసుకోవాలని , పెబ్బేరు మండల ప్రజలు రమేష్‌ను అభినందించారు.

# గీత కార్మికుల ప్రాణరక్షణకు ప్రత్యేక కిట్లు

### తొలిసారిగా అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** తమ ప్రభుత్వ గీత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంద, వారి ప్రాణ రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చెప్పారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేయడంతో పాటుగా గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయనిరీతిలో గీత కార్మికుల ప్రాణ రక్షణ కోసం రక్షణ కవచాలను కూడా అందిస్తోందని తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా బీసీ వెల్ఫేర్, ఎక్సైజ్ ప్రొహెబిషన్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల ను పంపిణీ చేసారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ కూడా గీత కార్మికుల సంక్షేమాన్ని గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కారణంగానే అనారోగ్యంతో ఉన్న గీత కార్మికులు కల్లు తిరిగి చెట్ల మీద నుంచి జారిపోయినా, మరణించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. చెట్లపై నుంచి పడిపోయినా కారణంగా అనేక మంది గీత కార్మికులు ప్రాణాలను కోల్పోతున్నారనే విషయాన్ని గమనించిన తమ ప్రభుత్వం వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలను చేనట్టించారు. వెల్లడించారు. గీత కార్మికులకు ప్రస్తుతం ప్రత్యేకంగా అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచాల ద్వారా కార్మికులు సులభంగా చెట్లను ఎక్కగలగడంతో పాటుగా ప్రమాదవశాత్తూ చెట్ల మీద నుంచి కిందకు పడిపోయే ప్రమాదం ఉండదని అనిరుధ్ రెడ్డి తెలిపారు . ఈ కిట్ ధరించిన గీత కార్మికుడు ఎవరైనా ప్రమాదవశాత్తూ చెట్టు పై నుంచి జారిపోయినా కిందకు పడిపోకుండా ఆ కిట్ అతన్ని కాపాడుతుందని వివరించారు. ఈ కిట్ వినియోగంపై ప్రభుత్వం కార్మికులకు శిక్షణ కూడా ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ నుంచి కల్లు గీత కార్మికులుగా లైసెన్స్ పొందిన వారికి మాత్రమే ఈ కిట్లను అందిస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో గీత కార్మికులందరికీ ఈ కిట్లు అందేలా చూస్తామని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఇందిర, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ నాగరాజు హాజరయ్యారు.

# మహిళల అభ్యున్నతికి కృషి

### రానున్న రోజుల్లో 3500 ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే యెన్నం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** మహిళా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువార మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని మహబూబ్‌నగర్ గ్రామీణ మండలానికి చెందిన 11 మందికి, అర్బన్ మండలానికి చెందిన 109 మందికి రెండు మండలాల్లో కలిపి మొత్తం 120 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఈ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన వాటన్నింటినీ అధిగమించి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడమే ప్రధాన అంశంగా పరిగణించి, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజలకు అందిస్తున్నామని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అదిస్తామని, ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, ఇండ్లు లేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఊరట కలిగిస్తుందని, మీగురించి ఆలోచన చేసి మీకు అభివృద్ధి ఫలాలు అందించే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి అని ఆయన కోరారు. దసరా పండుగ ను అందరూ బాగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షులు లక్ష్మ ణ్ యాదవ్, కౌన్సిలర్లు మోతిలాల్, రబియా అంజద్, పాషా, రషెద్, జాజి మొగ్గు నర్సింహులు, మోతిలాల్, మోసిన, చెన్న వీరయ్య, ఏర్వాల నాగరాజు, పోతన్ పల్లి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సిఎంను కలిసిన బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన స్వగృహంలో రాష్ట్ర బిసి విద్యార్థిసంఘం అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ , బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజులశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సిఎంను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిసి కులగణనచేపట్టి స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్ కల్పించాలని ఆయన సిఎంను కోరారు. పెండింగ్‌లో ఉన్న బిసి విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదలచేయాలని ఆయన కోరారు.



## ఎక్సైజ్ దాడులు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కల్వకుర్తి సర్కిల పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్, కల్వకుర్తి ఎక్సైజ్‌స్టేషన్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 840కేజిల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మహీంద్రాజెలో వాహనంలో హైదరాబాద్ బేగంబజార్‌నుండి తరలిస్తున్నట్లు పక్కా సమాచారంరావడంతో మండలకేంద్రంలోని తనిఖీలు చేస్తుండగా 28బస్తాల్లో 840కేజిల నల్లబెల్లంపొడి, 40పటిక, 10లీటర్లనాటు సారాయిని అచ్చంపేట మండలం సిద్దాపూర్ గ్రామానికి తరలిస్తుండగా మండలానికిచెందిన కాట్రవత్ రమేష్‌ను అరెస్టుచేసినట్లు , నల్లబెల్లం పటికలను సీజ్‌చేసి కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.



## ఎంసిహెచ్‌లో బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం / గోపాలపేట :** నవరాత్రులు దసరా ఉత్సవాల సందర్భంగా పథకం సంబరాలు అంగరంగ వైభవంగా జరిఇగాయి. బతుకమ్మ పాటలతో మహిళలు అలరించారు. గోపాలపేట మండలం నర్సింగాయపల్లి సమీపంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం బతుకమ్మ సంబరాలు అంబరానంటాయి. రంగురంగుల పువ్వులతో బతుకమ్మను అందంగా అలంకరించారు. బతుకమ్మను హెచ్ఓడిలు డా. కిరణ్మయి, నర్సులు తలపై పెట్టుకొని బతుకమ్మ పాటలతో ఆసుపత్రి ముందు ఏర్పాటు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా డాక్టర్లతో పాటు నర్సులు ఆసుపత్రికి వచ్చిన రోగుల అటెండర్లు చిన్నారులు బతకమ్మ పాటలు బొడ్డెమ్మలతో ఎంతో వైభవంగ జరుపుకున్నారు. అంతకు ముందు ఆసుపత్రి సూపరిండెంట్ డా. రంగారావు ఆర్ఎంఓ డా. బంగారాయ్య, డా. శివప్రసాద్‌లు, ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్‌లో దుర్గామాత, పూజలను ఘనంగా జరిపారు. బతుకమ్మ పాటలతో బొడ్డెమ్మలు వేయడం అక్కడికి వచ్చిన అందర్నీ ఆకట్టుకున్నాయి. సాయంత్రం బతుకమ్మను తలపై పెట్టుకొని ఊరు చివరలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో డా. సుమిత్ర డా. సుమతి , డా. విజయలక్ష్మి , నర్సులు, ఎంఎల్‌టి శానిటేషన్ మహిళలు పాల్గొన్నారు.

## మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం ఎస్పీ అడవి ముత్తారం పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పని తీరు తెలుసుకుని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. పోలీసులు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, పిఎస్ కేసుల స్థితిగతులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి మహేంద్ర కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. మండలంలో మావోయిస్టులు ఎలాంటి చర్యలకు దిగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ కేసులను సత్వరంగా పరిష్కరించాలని, పోలీస్ స్టేషన్లోని రికార్డులను ఫైళ్లను సక్రమంగా నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు.కాటారం డిఎస్పీ జి.రామ్మోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జున రావు, స్థానిక ఎస్ఐ మహేంద్ర కుమార్, సీసీ ఫసియొద్దీన్‌పాల్గొన్నారు.

# సమర సాహితీవేత్త సోమసుందర్: పెనుగొండ



**గుంటూరు :** ఆవంత్స సోమసుందర్ తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయ పాత్ర పోషించిన అమర సాహితీవేత్త అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. సోమసుందర్ శత జయంతిని పురస్కరించుకుని నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన వజ్రాయుధం కవితా సంపుటిని బుధవారం సాయంత్రం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలులో జరిగిన పెనుగొండ ఆవిష్కరించారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పెనుగొండ మాట్లాడుతూ వజ్రాయుధం కవితా సంపుటి 1949 మేలో వెలువడగా 1950 ఫిబ్రవ రిలో మద్రాసు ప్రభుత్వం నిషేదించిందని, తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1956లో ఆ నిషేదాన్ని ఎత్తివేసిందని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలకులను హెచ్చరించి తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ఈగ్రంథం తెలుగు సాహిత్య చరిత్రలో నిరంతరాయంగా వెలుగొందుతూనే ఉంటుందని పెను గొండ వివరించారు. అభ్యుదయ రచయితల సంఘంలో, అభ్యుదయ సాహిత్యోద్యమంలో సోమసుందర్ జీవితాంతం అవిశ్రాంత కృషి చేశారని తెలిపారు. తెలుగు నవలా సాహిత్యంలో సంచలనం సృష్టించిన డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచన 'మట్టిమనిషి' ని గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి భవాని ఆవిష్కరించారు. అరసం గుంటూరు జిల్లా శాఖ ఈతరం కోసం కథాస్రవంతి శీర్షికన ప్రచురించిన వాసిరెడ్డి నారాయణ రావు కథా సంపుటి ని ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ ఆవిష్కరించారు. తొలుత సభకు అరసం జిల్లా కార్యవర్గ సభ్యులు దర్శి శేషారావు స్వాగతం పలుకగా, దాసరి వినోద్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ సభలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



## వైద్యశిబిరం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నల్లమలలో సుదూర చెంచుపెంటలలో వైద్యశిబిరం నిర్వహించినట్లు జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈశిబిరంలో మహిళలకు , పిల్లలకు, పురుషులకు వైద్య చికిత్సలు చేసినట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో రక్తపరీక్షలు నిర్వహించడంతోపాటు వివిధరకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈశిబిరానికి ఈర్లపెంట, సంకడిగుండాల, మేడిమొల్కల, బౌరాపూర్ చెంచుపెంటలకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీచేసినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులగురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో వటువర్లపల్లి అధికారి డాక్టర్ అభిలాష్, డాక్టర్ గౌతం, డాక్టర్‌శివ, లోక్యానాయక్, రాజేష్, ఎఎన్‌ఎం సరోజ పాల్గొన్నారు.

## చెంచుపెంటల తరలింపుకు అధికారుల ప్రణాళిక

**ప్రజాపక్షం/అచ్చంపేట :** స్వచ్ఛందంగా పునరావాసం కల్పిస్తే అడవినుంచి వెళతానన్న చెంచులకు పునరావాసం కల్పిస్తున్నట్లు అటవీశాఖ డిఎఫ్ఓ రోహిత్‌గోపిడి కార్యక్రమం నిర్వహించారు. నల్లమల అడవిలోని వటువర్లపల్లి , సార్లపల్లి, పుడిచింతలబైలు, గొల్లంపేట, ఫర్హాబాద్ గ్రామస్తులు అడవిని విడిచి వెళ్లేందుకు ఒప్పుకున్నారు. ఈవిషయంపై అటవిశాఖ కేంద్రప్రభుత్వానికి సమాచారాన్ని తెలిపారు. అందుకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో స్వచ్ఛంద పునరావాసంలోభాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని బాచారం ఫారెస్టును గ్రామస్తులతో పరిశీలింపచేశారు. వారు సమ్మతించడంతో పునరావాసం కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు. పునరావాస కమిటిఅధ్యక్షుడు సాయిబాబు, మాజీసర్పంచ్ శతృనాయక్ ఆధ్వర్యంలో ఈ ఐదు గ్రామాలప్రజలు స్వచ్ఛందంగా వెళ్లడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కార్యక్రమంలో ఫారెస్టురేంజ్ ఆఫీసర్ గురుప్రసాద్, శిక్షణ అధికారి ధర్మానాయక్, సెక్షన్‌ఆఫీసర్ వెంకటేష్‌తేజ, ఫర్వినాబేగం, పునరావాస కమిటిసభ్యులు లక్ష్మణరాజ్, బాలకృష్ణ, తులసినాయక్ పాల్గొన్నారు.



## ఘన సన్మానం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రానికి చెందిన వెల్దండ రామకృష్ణ కుమార్తె హసిని ఇటీవల ప్రకటించిన నీట్‌పరీక్ష ఫలితాల్లో 531 మార్కులు సాధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజిలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఈసందర్భంగా మండలకేంద్రంలో రాష్ట్రఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి హసినిని శాలువాలతో సన్మానించి అభినందించారు. వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి మంచిపేరుతెచ్చుకొని పేదప్రజలకు వైద్యానికి సహాయపడాలని ఆకాంక్షించారు. సన్మానించినవారిలో మాజీ ఎంపిపి పుట్టారాంరెడ్డి, సింగిల్‌విండోడైరెక్టర్ నాగులునాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చల్లమధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, జంగయ్య, రవిగౌడ్, శ్రీను, అశోక్, నాగయ్య పాల్గొన్నారు.



## ఘనంగా బతుకమ్మ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయాలకి ప్రతీకగా తెలంగాణలో బతుకమ్మ పండుగ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, అదనపు కలెక్టర్లు దేవసహాయంలతోకలిసి గౌరిమాతకు పూజలు నిర్వహించి బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధశాఖలకు చెందిన మహిళలు రంగురంగుల పూలతో అందంగా అలంకరించబడిన బతుకమ్మలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరూ బాగుండాలని తల్లిని వేడుకుందామన్నారు. బతుకమ్మ పండుగ మన వారసత్వ పండుగ అన్నారు. మహిళలు ఆటపాటలతోపండుగను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. బతుకమ్మ పండుగ ప్రకృతిప్రేమను, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధికారులు, అన్ని కార్యాలయాల మహిళా సిబ్బంది అధికారులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలతో మానసిక రోగులుగా మారుతున్నారు : సీనియర్ సివిల్ జడ్జి సబిత

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ మానసికరోగులుగా మారడానికి ప్రధానంగా మత్తుపానీయాలే ప్రధానకారణమని జిల్లా న్యాయసేవాసంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్‌జడ్జి సబిత పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మానసికరోగుల దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ నేటి భావిభారత పౌరులు మత్తుపానీయాలు అలవాటుచేసుకొని మానసిక రోగులుగా మారి తమ బంగారు భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటున్నారని అన్నారు. మత్తుపదార్థాలకు అలవాటుపడిన వారు మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, తాగినమైకంలో తోటి వ్యక్తులతో ఘర్షణలకుదిగినేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. చిన్న వయసునుండే యువత మత్తుపదార్థాలకు బానిసలుకావడంవల్ల మానసిక ప్రశాంతతను కోల్పోయి మానసికరోగులుగా మిగిలిపోతున్నారని అన్నారు. వీటితో పాటు ప్రధానంగా సెల్‌ఫోన్‌వాడకం ప్రతి ఒక్కరి జీవితంలో ఆటంకంగామారింది. మారినజీవనశైలియాంత్రిక జీవన విధానంతో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతను కోల్పోయి మానసికరోగులుగా మారుతున్నారని అన్నారు. ఈసమస్యను అధిగమించాలంటే ప్రతి ఒక్కరు క్రమంతప్పకుండా వ్యాయామం, యోగా, తోటివారితోస్నేహం చేయడం అలవాటు చేసుకుంటే ఈసమస్యను పూర్తిగా నివారించే అవకాశం ఉందన్నారు.

# ఫోకస్

## పురుషుల రేస్‌లో మహిళ!




ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మారథాన్‌గా గుర్తింపు పొందిన బోస్టన్ మారథాన్‌లో తొలుత మహిళలకు అవకాశం ఉండేది కాదు. 1897లో ఇది ప్రారంభంకాగా, సుమారు ఏడున్నర దశాబ్దాలకు పైగారేస్‌ను కేవలం పురుషులకు మాత్ర మే నిర్వహించేవారు. 1967లో కాథరిన్ స్విట్జర్ అనే మహిళా బోస్టన్ మారథాన్ రేసులో పాల్గొంది. ఒక మహిళ రేసులో ఉం దన్న విషయాన్ని గుర్తించిన ని ర్వహాకుల్లో ఒకడైన జాక్ సెం పిల్ ఆమెను నిలువరించే ప్రయత్నం చేశాడు. కానీ, రేసులో ఉన్న మరో వ్యక్తి సెసిల్‌ను అడ్డుకోవడంతో, స్విటెర్ తన రేసును విజయవంతంగా పూర్తి చేసి ంది. ఆ తర్వాత ఐదేళ్లకు, 1972లో మహిళలకు కూడా ప్రవేశం కల్పిస్తూ బోస్టన్ మారథాన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అనేక మేజర్ క్రీడా పోటీల్లోనేగాక, ప్రత్యేక మారథాన్ రేసుల్లోనూ మహిళలకు అవకాశం లభించడానికి కారణమైన స్విట్జర్ అభినందనీయురాలు.

## క్రీడ

## ఒక్కడి కోసం..




తన 87వ ఏట ట్యుస్కారాస్ కౌంటీ కమ్యూనిటీ ఆఫ్ పియోలీ పోస్టాఫీస్ నుంచి ఫ్యాన్‌మెయిల్‌ను తీసుకుంటున్న అమెరికా బేస్‌బాల్ లెజెండ్ సివై యంగ్. ఈ ఫొటో 1954లో తీశారు. అప్పట్లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. వేలా ది మంది అభిమానులు ఆ యనకు ఉత్తరాలు రాసేవా రు. పియోలీ మారుమూల ప్రాంతం కావడంతో, అక్కడి పోస్టాఫీస్‌ను మూసివేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే, కేవలం యంగ్‌కు వచ్చే ఉత్తరాలను బట్వాడా చేయడానికి మాత్రమే దానిని కొనసాగించారు. 1956లో ఆ పోస్టాఫీస్‌ను శాశ్వతంగా మూసివేశారు. ఒక క్రీడాకారుడి కోసం కొన్ని సంవత్సరాలపాటు ఓ పోస్టాఫీసను కొనసాగించడం అంతకుముందుగానీ, ఆ తర్వాతగానీ జరగలేదు. ఆ ఘనత కేవలం యంగ్‌కు మాత్రమే దక్కింది.

## చారిత్రాత్మక రేస్..చికాగో మారథాన్




ప్రపంచ మేటి ఆరు మారథాన్ రేసుల్లో చికాగో మారథాన్ ఒకటి. అమెరికాలోని ఇలినాయిస్ రాష్ట్రం, చికాగోలో ఏటా అక్టోబర్ రెండో ఆదివారం ఈ మారథాన్ జరుగుతుంది. ఈసారి, 13న జరిగే చికాగో మారథాన్‌లో ఈసారి కూడా అత్యధిక శాతం మంది ఫినిషర్లు ఉంటారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. 26.219మైళ్లు (42.195 కిమీ) దూరాన్ని పూ ర్తి చేయడం ఆషామాషి వ్యవహారం కాకపోయినప్పటికీ, 1977లో తిరిగి ప్రారంభమైన మొదటి రేస్ నుంచి గత ఏడాది వరకూ రేస్ పూర్తి చేసిన వారి సంఖ్యా పరంగా ఇది ప్రపంచంలోనే నాలుగో స్థానాన్ని ఆక్రమిస్తుంది. గత ఏడాది పురుషుల విభాగంలో కెల్విన్ కిప్టున్ (2:00:35 గంటలతో కోర్స్ రికార్డు), మహిళల విభాగంలో సిఫాన్ హసన్ (2:13:44 గంటలతో కోర్స్ రికార్డు) అగ్రస్థానాన్ని ఆక్రమించా రు. చికాగో వార్షిక మారథాన్లు 1905 నుండి 1920ల వరకు కొనసాగాయి. అయితే, ఆ తర్వాత ఈరేస్ నిర్వహణ నిలిచిపోయింది. అనంతరం 1977 సెప్టెంబర్ 25న తిరిగి ప్రారంభమైంది. క్రమంగా ఈ రేస్ తేదీని అక్టోబర్ నెల రెండో ఆదివారంగా ఖరారు చేశారు. కొవిడ్ కారణ ంగా 2020లో రేస్‌ను నిర్వహించలేదు. ప్రొఫెషనల్స్‌తోపాటు ఎం తో మంది ఔత్సాహికులు కూడా ఈ రేస్‌లో పాల్గొంటారు. అయితే, అమెచ్యూర్ విభాగంలోనూ ఎక్కు వ మంది రేస్‌ను పూర్తి చేయడం విశేషం. వేలాది మంది రేస్‌లో పా ల్గొంటున్న కారణంగా, ఇప్పుడు పార్టిసిపెంట్స్ సంఖ్యను 55,000 లకు పరిమితం చేశారు. ఆరున్నర గంటల్లోపు రేస్‌ను పూర్తి చేసిన వారినే ఫినిషర్స్‌గా పేర్కొంటున్నా రు.ఈరేస్ ద్వారా సేకరించిన మొ త్తాలను వివిధ ప్రజాహిత కార్యకలాపాలకు వినియోగిస్తారు. పురుషులు,మహిళలతోపాటు వృద్ధులు కూడా చికాగో మారథాన్‌లో ఉత్సా హంగా పాల్గొనగడం ఆ రేస్‌కు ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.

* గ్రీస్‌లో మారథాన్ యుద్ధం జ్ఞాపకార్థం క్రీస్తు పూర్వం 490లో మొదటి మారథాన్ రన్ జరిగింది.
* ఆధునిక ఒలింపిక్స్ ప్రారంభమైన 1896లో మారథాన్‌ను ఒక క్రీడాంశంగా ప్రవేశపెట్టారు.
* ప్రపంచ వ్యాప్తంగా జరిగే అన్ని మారథాన్లలోకి అత్యంత పురాతనమైనది బోస్టన్ మారథాన్. దీనిని 1897లో మొదలు పెట్టారు.



* మారథాన్ రేస్ దూరం 42.195 కిలోమీటర్లు (26.2 మైళ్లు).
* ఇప్పటివరకు నమోదైన వేగవంతమైన మారథాన్ సమయం, పురుషుల విభాగంలో 2:01:39 గంటలు, మహిళల విభాగంలో 2:14:04 గంటలు.
* పురుషులకు సగటు ముగింపు సమయం 4 నుంచి 5 గంటలుకాగా, మహిళల విభాగంలో 5 నుంచి 6 గంటలు.
* మారథాన్ పరుగెత్తడం వల్ల దాదాపు 2,500 3,000 కేలరీలు ఖర్చవుతాయి.
* మారథాన్ రన్నర్లు రేసులో సగటున 34 కిలోల (6.68.8 పౌండ్లు) కోల్పోతారు.
* మానవ శరీరం 20 నుంచి 25 మైళ్ల వరకు తగినంత శక్తిని నిల్వ చేయగలదు; ఆ తర్వాత, రన్నర్లు మానసిక దృఢత్వంపై ఆధారపడి రేస్ పూర్తిచేస్తారు.
* ప్రపంచవ్యాప్తంగా ఏటా 1,000కు పైగా మారథాన్లు జరుగుతాయి.
* అతిపెద్ద మారథాన్‌గా న్యూయార్క్ సిటీ మారథాన్‌గుర్తింపు సంపాదించింది. ఈ రేస్‌లో లక్షలాది మంది పాల్గొంటారు. సగటున 50,000 మంది ఫినిషర్లు ఉంటారు.
* మారథాన్ పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడిగా భారత్‌కు చెందిన బుధియా సింగ్ 2006 లో రికార్డు నెలకొల్పాడు. అప్పుడు అతని వయసు కేవలం ఐదు సంవత్సరాలు. అయితే, ఇలాంటి రేసుల వల్ల భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్న ఆందోళనలు వ్యక్తం కావడంతో ఒడిశా ప్రభుత్వం అతని రేసులపై నిషేధం విధించింది. అనంతరం అతనిని భువనేశ్వర్‌లోని భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) కేంద్రానికి తరలించింది. ఆ తర్వాత బుధియా సింగ్ మారథాన్‌లోగానీ, మరే ఇతర పరుగు పందాల్లోగానీ పాల్గొన్న దాఖలాలు లేవు.
* మారథాన్ పూర్తి చేసిన అతి పెద్ద వ్యక్తి 101 ఏళ్ల ఫౌజా సింగ్. 2011లో అతను ఈ రికార్డు నెలకొల్పాడు.
* సాధారణ మారథాన్ శిక్షణ 16 నుంచి 20 వారాలు ఉంటుంది.
* శిక్షణ సమయంలో రన్నర్లు 500 నుంచి 800 మైళ్లు లాగ్ చేస్తారు.
* కార్బోహైడ్రేట్ లోడింగ్ అనేది ఒక సాధారణ ప్రీమారథాన్ పోషణ వ్యూహం.
* సాధారణంగా 20 మైళ్ల తర్వాత రన్నర్లు ఇక ముందుకు పరిగెత్తడం సాధ్యం కాదని అనుకుంటారు. ఈ పరిస్థితిని 'వాల్' (గోడ) అంటారు. శారీరక సామర్థ్యంతోపాటు ఎంతో మానసిక దృఢత్వం కూడా ఉంటేనే రేస్‌ను పూర్తి చేయగలుగుతారు.
* ఎండార్ఫిన్ విడుదల కారణంగా మారథాన్ రన్నర్లు 'రన్నర్స్ హై'ని అనుభవిస్తారు. ఇది ఒక రకమైన తీవ్రమైన ఆనందం లేదా ఉన్మాద స్థితిని సూచిస్తుంది.

## క్రికెట్ రికార్డులు..

### టెస్టు ఫార్మెట్

**అత్యధికసెంచరీలు:**51/ సచిన్ తెండూల్కర్
కెరీర్‌లో అత్యధిక పరుగులు: 14,965/ సచిన్ తెండూల్కర్
కెరీర్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు 68/ సచిన్ తెండూల్కర్
ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు: 400 నాటౌట్/ బ్రియాన్ లారా (వెస్టిండీస్/ఇంగ్లాండ్‌పై)
భారత్ తరఫున ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో **అత్యధిక స్కోరు:** 319 వీరేందర్ సెవాగ్ (చెన్నైలో దక్షిణాఫ్రికాపై)
టెస్టుల్లో అత్యధిక వికెట్లు: 800/ ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక)
భారత్ తరఫున అత్యధిక వికెట్లు: 619 (అనిల్ కుంబ్లే).

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- వజ్రం దేని రూపాంతరం?
  కార్బన్
- 'ట్రకోమా' వ్యాధి శరీరంలోని ఏ భాగానికి వస్తుంది?
  కళ్లు
- భూకంపాలు, అగ్ని పర్వతాలు ఎక్కువ గల పర్వత ప్రాంతం?
  ఆండీస్
- సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
  కాసర్ గోడ్
- బక్సార్ యుద్ధ వీరుడు ఎవరు?
  హెక్టర్ మన్రో
- దక్షిణ అమెరికా ప్రధాన భాష?
  లాటిన్
- 'చంద్రయాన్ 2'ను భారతదేశం కింది ఏ దేశంతో ఉమ్మడిగా రూపొందించింది?
  రష్యా
- ప్రపంచంలో మిక్కిలి పొడవైన పర్వత శ్రేణులు?
  ఆండీస్
- భారతదేశంలో మొదటిసారిగా బంగారు నాణేలను ఎవరు ప్రవేశపెట్టారు?
  ఇండో గ్రీకులు
- ఆసియాలో అతి పొడవైన నది
  యాంగ్జె
- మాసాబాంకును తవ్వించిందెవరు?
  కానమ్ గా
- వాల్మీకి జయంతిని ప్రభుత్వం ఏ రోజున అధికారికంగా నిర్వహించింది?
  అక్టోబరు 27
- రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ సొసైటీ ఎక్కడ ఉంది?
  జెనీవా
- రాచకొండను పాలించిన చివరి పద్మనాయక పాలకుడు ఎవరు?
  మూడో సింగమ నాయకుడు
- ఎన్ని సంవత్సరాలకు వెదురు పుష్పిస్తుంది.
  3
- నీటిని శుద్ధి చేయడంలో ఉపయోగించే కిరణాలేవి?
  యూవీ కిరణాలు
- బ్యాంకాక్ ఏ నది ఒడ్డున ఉంది?
  చావో ప్రయ
- ఇందిరాసాగర్ డ్యామ్ ఏ నదిపై ఉంది?
  తపతి
- పీష్వా అంటే ఎవరు?
  ప్రధానమంత్రి
- మూసీ నది వెంబడి ఉద్యానవనం అభివృద్ధి చేసేందుకు ప్రారంభించిన ప్రాజెక్టు ఏది?
  నందనవనం
- భారతదేశంలోని ఏ రాష్ట్రాన్ని 'షుగర్ బౌల్' అంటారు?
  ఉత్తర్ ప్రదేశ్
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్స కోసం వాడేవి.
  పరారుణ కిరణాలు
- భారతదేశ మొదటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
  హెచ్ కానియా
- మానవుల జీర్ణవ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం ఏది?
  హైడ్రోక్లోరిక్ ఆమ్లం

## రాజకీయ జోక్యం ఉండొద్దు

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్




**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా స్వయం ప్రతిపత్తిగా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ సూచించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్ ఎఐటియుసి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డుతూ సింగరేణిలో ఏ నిర్ణయం తీసుకున్న స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే విధంగా రాజకీయ జోక్యం లేకుండా స్వేచ్ఛగా ఉండే విధంగా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, ప్రస్తుత ప్రభుత్వంలో అలాంటిది జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. 1న యాజమాన్యం ప్రభుత్వం కార్మికులకు ఉత్పత్తి ఉత్పాదకలపై అన్ని మైన్‌డిపార్ట్మెంట్లలో నిర్వహించ కార్యక్రమం దసరా తర్వాత నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మతాంగి రామ్ చెందర్, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, హైమత్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సమగ్ర కుల గణన యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలి

### తాటిపాముల వెంకట్రాములు



**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్ :** రాష్ట్రంలో సమగ్ర కుల గణన యుద్ధ ప్రాతిపదికన నిర్వ హించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో బీసీల ఆర్థిక సామాజిక కుల గణన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, 60 రోజులలో సర్వే పూర్తి చేసి డిసెంబర్ 9 లోపు నివేదికను సమర్పించాలని ఆదేశించారన్నారు. రాష్ట్రంలో కేవలం బీసీల కులగణన చేస్తేనే సరిపోదని రాష్ట్రంలోని సమస్త కులాల ఆర్థిక రాజకీయ సామాజిక విద్యా పరమైన మొదలైన అంశాలతో కూడిన సమస్త కులాల జనగణన జరగాలని, అన్ని కులాల జనాభా లెక్కలు నికరంగా తేల్చాలన్నారు. ప్రభుత్వం శాస్త్రీయమైన పద్ధతిలో అన్ని కులాల జనాభా లెక్కలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. సమగ్ర కుల గణన పూర్తి అయిన తర్వాతే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజల జీవితాల్లో బతుకమ్మ వెలుగులు నింపాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ పండుగ అని, బతుకమ్మ సంబురాలను వాడవాడన మహిళలందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని రైతు ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు పేర్కొన్నారు ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో ప్రకృతి బతుకమ్మ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తీరొక్క పూలతో బతుకమ్మను తీర్చిదిద్ది, ఇంటిల్లిపాది సంబరంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అని తెలిపారు.

## మిగిలిన రుణమాఫీని విడుదల చేయాలి




### రూరల్ మండల సమితి సమావేశంలో పోటు ప్రసాద్

**ప్రజాపక్షం/ఖమ్మం:** ప్రభుత్వం ఇచ్చిన హా మీ మేరకుఅర్హత కలిగిన ప్రతి రైతుకు రెం డు లక్షల రుణమాఫీని వర్తింపజేయాలని సిపిఐ జిల్లాకార్యదర్శి పోటు ప్రసాద్ డిమా ండ్ చేశారు. రుణ మాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సరధోరణిని అవలంభిస్తుందని ఇది సరైంది కాదన్నారు. ఖమ్మం రూర ల్ మం డల సిపిఐ సమితి సమావేశం గురువారం చెరుకుపల్లి భా స్కర్ అధ్యక్షతన స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ రుణమాఫీ విషయ ంలో ఇంకా40శాతం మంది రైతులకు మాఫీ జరగలేదని, రెండు లక్షలలోపు ఉన్న రుణాల ను తక్షణం మాఫీ చేయడంతో పాటుఆపై రుణాలకు సంబంధించి తక్షణం ప్రభుత్వం ప్రకటన చేయాలని ప్రసాద్ కోరారు. రైతాంగ సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వానికి విజ్ఞ ప్తి చేశారు. పైలెట్ ప్రాజెక్టు పేరుతో రేషన్‌కార్డులు మరింత ఆలస్యం అవుతున్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీ సంస్థాగతబలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని గ్రామ గ్రామాన కమ్యూనిస్టు పార్టీ శాఖలు ఏర్పా టు చేసేందుకు కృషి చేయాలని ప్రసా ద్ కోరారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మ హ్మద్ మౌ లానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేనికర్ణకుమార్, జిల్లాకార్యవర్గ సభ్యులు అజ్మీర రామ్మూర్తి,మిడికంటి వెంకటరెడ్డి, నాయకులు యడ్లపల్లి శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రుల సందర్భంగా అన్నదానం



**ఖమ్మం అర్బన్ :** దేవీ నవరాత్రులు, బతుకమ్మ సంబురాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో సిపిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రులు, బతుకమ్మ వేడు కల సందర్భంగా గురువారం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కా ర్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసా ద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో 20 ఏళ్లుగా దేవీ నవరాత్రులు, బతుకమ్మ సంబురాలు, సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, శింగునర్సిం హారావు, తాటి వెంకటేశ్వర్లు, రావి శివ రామకృష్ణ, సిపిఐ కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ,14,15 డివిజన్ల సిపిఐ కార్యదర్శులు ప్రతానపు రామనాథం, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, అమరారపు యశ్వంత్, లక్కా రోహిత్, దంతాల శ్రీకాంత్, షేక్ మబూ, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలి

### ఎంపిడిఒ, తహసీల్దార్‌లకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/బోనకల్ :** ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పంచాయతీ కార్యదర్శులు నిష్పక్షపాతంగా అర్హులైన పేదలను ఎంపిక చేయాలని సిపిఐ మండల సమితి అధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్‌లతో ఎంపిడిఒ మిట్టపల్లి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అదే విధంగా స్థానిక ప్రజలకు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు తక్షణమే మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయ యుడిసి బొడ్డుపల్లి ఉపేందరరావులకు కలిసి వినతి పత్రాన్ని గురువారం అందజేశారు.ఆనందరావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో సెప్టెంబరు 17, ఆక్టోబర్ 2న రేషన్‌కార్డుల దరఖాస్తులు తీసుకుంటామని ప్రభుత్వం నేటికి ఆ ప్రక్రియ చేపట్టలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఒక్కసారి ఇందిరమ్మ కమిటీలు, మరోసారి పంచాయతీ కార్యదర్శులు,అంగన్‌వాడీలు, ఆశాలు ఎంపిక చేస్తారని ప్రజలను గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నాయని విమర్శించారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పంచాయతీ కార్యదర్శులు నిష్పక్షపాతంగా అర్హులైన పేదలను ఎంపిక చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఐ సహాయ కార్యదర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఏలూరి పూర్ణచంద్రరావు, యంగల పెద్ద రమేష్, తోటపల్లి ఆనందరావు, సిపిఐ నాయకులు కొంగర భాస్కరరావు, గుంపుల జయరాజు, వంగాల తిరుపతిరావు, బెజవాడ ధనమూర్తి తదితరులున్నారు.

## రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటును హర్షణీయం

### ధూళిపాళ ధనుంజయనాయుడు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్స్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు.గురువారం పట్టణంలో సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే క్యాంపస్‌లో ఎస్‌సి, ఎస్‌టి,బిసి,మైనార్టీ విద్యార్థుల కోసం ఆత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయడం అభినందించదగ్గ అంశమన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.5వేల కోట్ల రూపాయలతో నిర్మాణం చేయడం రేవంత్‌రెడ్డి పనితనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 56 శాతం జనాభా బీసీలకు ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ కంటే అధికంగా గురుకులాలు ఉన్నాయని ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఎలా ఉంటుందో స్పష్టం చేయాలన్నారు.నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఎంతైనా హర్షణీయమని ఆవిధంగానే ఉచిత వైద్యం, న్యాయం అందించే దిశగా వడివడిగా అడుగు వేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి,వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,బీసీ హక్కుల సాధన సమితి సభ్యుడు గుడిపాటి శ్రీహరి పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### లొడంగి శ్రవణ్‌కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల :** రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం రోజున చిట్యాల మండల తహసీల్దార్‌కు సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో ఈ విషయంపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తి పంట వేసిన రైతాంగం వద్ద నెల రోజులుగా మధ్య దళారులు పత్తి కొనుగోలు జరుపుతున్నప్పటికి ప్రభుత్వ యంత్రాంగం నేటికి స్పందించక పోవడం కారణంగా మధ్య దళారులకు రూ. 6000 లోపే క్వింటాలు పత్తిని అమ్ముకునే దీన స్థితిని ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 7500 కల్పించే విధంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను, మార్కెట్ ఫీజుని ఎగనామం పెడుతున్న దళారులను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో మండల కార్యదర్శి ఎండి అక్బర్, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, రావుల చినవెంకన్న తదితరులున్నారు.

## ఆల్ఫోర్స్ అధినేత ఉదారత

### ఆలయ కమిటీ సభ్యులకు రూ.2 లక్షల అందజేత

**ప్రజాపక్షం/రామడు గు:** రామడుగు మండ లం గోపాలరావుపేట గ్రామంలోనల్లపో చమ్మ , హనుమాన్ దేవాలయాలను పునర్నిర్మిస్తున్నారు. వాటి నిర్మాణానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి భారీ విరాళాన్ని అందజేసి ఉదారత చాటుకున్నారు. గోపాల్‌రావుపేట గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి అడగగానే స్పందించి భారీ విరాళాన్ని అందజేసిన నరేందర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.



## పోలీసు తుపాకులకు ఆయుధ పూజ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సిటీ పోలీస్ సిఎఆర్ హెడ్ క్వార్టర్స్‌లో దుర్గాష్టమి సందర్భంగా పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం సిఎఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన పోలీసు క్యాంటీన్ ప్రారంభించి, సభ్యత్వ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ సిటీ పోలీసులందరికీ దుర్గాష్టమి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసిపి సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, సౌత్‌జోన్ డిసిపి స్నేహమేరా, సిసిఎస్ డిసిపి శ్వేత, సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి పాటిల్ కాంతిలాల్, అదనపు డిసిపి అడ్మిన్ ఎన్.భాస్కర్, అదనపు డిసిపి బి.కిష్టయ్య పాల్గొన్నారు.

# మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

## డిపాజిటర్లకు శఠగోపం

### డికెజెడ్ టెక్నాలజీ ప్రొప్రైటర్, డైరెక్టర్ అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 17500 మంది డిపాజిటర్లను మోసగించిన టికెజెడ్ టెక్నాలజీస్, డిఐకెజెడ్ఓ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొప్రైటర్‌తో పాటు డైరెక్టర్‌నుఅరెస్టు చేశారు. కంపెనీలు బాధితులకు చెందిన రూ.229 కోట్లను దోచుకుందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. మాదాపూర్‌లోని నిందితుల ఫామ్‌హౌజ్, కార్యాలయంలో పోలీసులు సోదాలు నిర్వహించి, డైరెక్టర్ సయ్యద్ అష్ఫాక్ రాహిల్‌తో పాటు అతడి భార్య సయ్యదా ఐషా నాజ్‌ను అరెస్టు చేశారన్నారు.



## పురుషోత్తంరెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి, నారాయణ, కూనంనేని నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి దశదినకర్మ గురువారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరై పురుషోత్తంరెడ్డి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

## ఆర్ఎంసి ప్లాంట్‌ను మూసివేయాలి

### మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల



**ప్రజాపక్షం/నార్సింగి:** కాలుష్యానికి కారణమవుతున్న ఆర్ఎంసి ప్లాంట్‌ను అధికారులు తక్షణమే స్పందించి మూసివేయాలని మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు సీతారామ్ ధూళిపాళ్ల డిమాండ్ చేశారు. మణికొండ పరిధిలోని మై హోమ్ అవతార్ హాల్ మార్కు వికెన అపార్ట్‌మెంట్ లో ఉంటున్న వేలాదిమంది ప్రతిరోజు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలను తెలుసుకునేందుకు గురువారం సీతారాం ధూళిపాల, ఉపేందర్‌రెడ్డి, తదితరులు అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పొల్యూషన్ బోర్డు అనుమతి లేకపోయినా కొంతకాలంగా ఆర్ఎంసి ప్లాంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. అపార్ట్మెంట్లో సుమారు 15 వేల మంది ఉంటున్నారని అన్నారు. ఆర్ఎంసీ ప్లాంటు ఉన్న నేపథ్యంలో పొల్యూషన్ బాగా వస్తుందని, ఈ విధంగా అక్కడికి రాకపోకలు సాగించే లారీలతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు అధ్వానంగా మారడంతో ఇక్కడ ఉన్న స్థానికుల కార్లు, ద్విచక్ర వాహనదారులు వెళ్లేందుకు ఇక్కట్లకు గురవుతున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ఆయా శాఖలో అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు గౌతమ్, రాహుల్, కస్తూరి కృష్ణ స్వామి తది తరులతో పాటు బీఆర్ఎస్ పార్టీ మణికొండ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, ధనరాజ్, లక్ష్మణరావు, ఉపేందర్ నాథ్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, లక్ష్మయ్య, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, భానుచందర్, జై రామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలను అభివృద్ధి చేస్తా

### ఎల్‌బినగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో ప్రతి కాలనీలను అభివృద్ధి చేస్తామని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్‌లోని సాయి ప్రకాష్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కాలనీ వాసులు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రధానమైన సమస్యలు పరిష్కారం చేశామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో గజ్జల మధుసూదర్‌రెడ్డి, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, రవి, చీర శ్రీనివాస్, సదానంద్‌రెడ్డి, కాలనీవాసులు రాఘవేంద్ర, రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ రావు, నరోత్తం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



**ప్రజాపక్షం/చంపాపేట :** దసర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అమ్మవారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగాంగా, చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని క్రాంతి క్లబ్ ఆవరణలో నెలకొల్పిన అమ్మవారిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గురువారం బీఆర్ఎస్ నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దసరా వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పూలపండుగ సందడి

### ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు













## ఘనంగా దేవీశరన్నవరాత్రులు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురంలోని రైతు బజార్ హుడా పార్కులో 35 సంవత్సరాలుగా దుర్గాస్థలి ఆలయ ఉత్సవ కమిటి సభ్యులు పద్మా త్రింశత్ 35వ వార్షిక నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి అమ్మవారు దుర్గాఅష్టమి నక్షత్రంలో దుర్గా దేవీగా అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గా స్థలి ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బుద్దోలు అర్జున్ గౌడ్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుతున్నామని తెలిపారు. ప్రతి రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు విష్ణు, భిక్షపతి, యోగేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, శంకర్, కిరణ్, బోరం కృష్ణ, అంజన్‌కుమార్, నాని పాల్గొన్నారు.



## క్రీడలు భవిష్యత్తుకు పునాదులు



### సిఐ కాంతారెడ్డి

**ప్రజాపక్షం/షాబాద్ :** క్రీడలు భవిష్యత్తుకు పునాదులు అవుతాయని సిఐ కాంతారెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ ఆర్ స్టేడియంలో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండల స్థాయి క్రీడ పోటీలు ప్రారంభించారు. వాలీబాల్ క్రీడ పోటీలో 12 టీంలు పాల్గొనడం జరిగిందని వివరించారు. ఉదయం నుండి సాయత్రం వరకు క్రీడలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ టీంలో మొదటి బహుమతి కుమ్మరిగూడ , రెండవ బహుమతి అంతారం, మూడవ బహుమతి షాబాద్ టీంలకు విజేతలుగా నిలిచారు. ఈనెల 14వ తేది నుండి 16వ తేది వరకు క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని యువకులు క్రీడకారులు పోలీస్ స్టేషన్‌లో క్రీడలో పాల్గొనే టీం వివరాలు అందజేయాలని సుచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీన్ రెడి, షాబాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లాపూర్‌వాసుల కష్టసుఖాల్లో పన్నాల దేవేందర్‌రెడ్డి

### రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా సేవలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** కార్పొరేటర్‌గా గెలిపిస్తున్న మల్లాపూర్ వాసులే తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రజాభివృద్ధి కార్యక్రమాలే కాకుండా నిత్యం వారి కష్టసుఖాల్లో ఒకరిగా నిలిచి పోతున్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. ఒక వైపు మల్లాపూర్ డివిజన్‌ను గ్రేటర్‌లో ఆదర్శంగా తీర్చి దిద్దాలన్న తపనతో తన వ్యాపారాల కంటె సమయాన్ని వెచ్చిస్తుండటంతో పాటు మరో వైపు మానవతావాదిగా సంఘ సేవకుడిగా ప్రజలతో మమేకమవుతూ ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ కదలి వస్తున్న ఆయనను రెండో పర్యాయం సైతం కార్పొరేటర్ పట్టం గట్టారు. జిహెచ్ఎంసి అధికారులు, మేయర్, స్థానిక ఎమ్మెల్యే, ఎంపిలతో సయోధ్యతో ఉంటూ ప్రజా అభ్యున్నతి కోసం ఏ విధంగా నిధులు రాబట్టుకోవాలో తెల్సిన చాణుక్యుడిగా ఇక్కడి ప్రజలు ఆయనను భావిస్తుంటారు. టిఆర్ఎస్ ఆవిర్భావం నుండి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మల్లాపూర్‌లో ఉద్యమ నేతగా, ఆ పార్టీలో కాప్రా మున్సిపాలిటీ శాఖ యువజన విభాగ అధ్యక్షుడిగా, ఆ తర్వాత గ్రేటర హైదరాబాద్ పార్టీ కార్యదర్శిగా, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నాచారం డివిజన్ అధ్యక్షుడిగా పన్నాల దేవేందర్‌రెడ్డి పని తీరును గుర్తించిన టిఆర్ఎస్ అధిష్టానవర్గం 2014లో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించటంతో అప్పటికే ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన స్థానికులు భారీ మెజార్టీతో కార్పొరేటర్ పట్టం గట్టారు. అంది వచ్చిన అవకాశంతో కార్పొరేటర్‌గా ఎన్నికైన ఆయన తొలి పర్యాయమే నాటి మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్, మేయర్ బొంతు రామ్మోహన్‌ల సహకారంతో డివిజన్‌లో 127 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేసి మల్లాపూర్‌కు మహర్దశ కల్పించారు. సింగం చెరువు తండాలో తలపెట్టిన డబుల్ బెడ్ రూంల నిర్మాణాలకు గాను అక్కడ నివసించే వారికి ఇళ్లు ఇప్పిస్తానని నచ్చ చెప్పటమే కాక ఆ నిర్మాణ పనుల్లో వారినే భాగస్వాములను చేసి చెప్పిన రీతిలో 126 కుటుంబాలకు గృహాలను మంజూరు చేయించారు. డివిజన్‌లోని గోకుల్‌నగర్, బాబానగర్, నెహ్రూనగర్, మీనానగర్ తదితర ప్రాంతాల్లో అప్పటి వరకు మూడు నాలుగు రోజులకు ఒక సారి వచ్చే మంచి నీటి సరఫరాను 23.6 కోట్ల వ్యయంతో మంచి నీటి పైపులు వేయించి రోజు విడిచి రోజు 45 నిమిషాల పాటు మంచినీటిని అందిస్తున్నారు. రూ.5.04 కోట్లతో మంచి నీటి రిజర్వాయర్, రూ.23.76 కోట్ల వ్యయంతో 28 కిలోమీటర్ల మేర పైపు లైన్లు, రూ.13 కోట్ల వ్యయంతో పూర్తయిన ఇళ్లను 176 కుటుంబాలకు కేటాయింపు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు, కోటి రూపాయల వ్యయంతో స్మశాన వాటిక అభివృద్ధి పనులు పూర్తి చేయగా 1446 మంది వితంతువులు, 532 మంది వికలాంగులు, 814 మంది ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు పెన్షన్ రూపంలో ప్రభుత్వ లబ్దిదారులను చేసారు. రూ.3 కోట్ల వ్యయంతో మల్లాపూర్ ఎక్స్ రోడ్‌లో థీమ్ పార్కు నిర్మాణ పనులు టెండర్ దశలో ఉండగా రూ.33 కోట్లతో 396 డబుల్ బెడ్‌రూంల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కోవిడ్ 2020 సమయంలో తానున్నానంటూ వలస కార్మికులను ఆదుకోవటంతో పాటు తన సొంత నిధులతో నిరుపేదలకు నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించారు.




## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని శంబిపూర్ గ్రామంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు మహిళలు బతుకమ్మలు తయారు చేసి ఆటపాటలతో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

# మహానగరి

**మేడ్చల్ మల్కాజ్‌గిరి** **వికారాబాద్**

## తామర పువ్వులు కోసేందుకు వెళ్లి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తామర పువ్వులు కోసేందుకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన రంగ సోమ య్య(65)శామీర్‌పేటపెద్ద చెరువు కాలువలో ఉన్న తామర పువ్వులను కోసేందుకు నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. గమణించిన స్థానికులు శామీర్‌పేట పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## కలెక్టరేట్‌లో సద్దుల బతుకమ్మ సంబురాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** సాంప్రదాయ రీతిలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు జరిగాయి. తీరొక్క పూలు, రంగుల రంగుల పూలతో ఆకర్షణీయంగా భక్తి భావనలు ఉట్టి పడే విధంగా తీర్చి పేర్చిన బతుకమ్మలతో ఒక చోట చేరిన వివిధ ప్రభుత్వ మహిళా ఉద్యోగినుల ఆట పాటలు మార్మోగాయి. వారికి వంత పాడి చేయిగలిపిన పలువురు విభాగ అధికారులు కృష్ణారెడ్డి, వినోద్, గోపాలరావు, చంద్రావతి, డిఆర్‌ఓ హరిప్రియలు ఆకర్షణీయంగా నిలిచారు. బతుకమ్మల చుట్టూ మహిళా ఉద్యోగినులు బతుకమ్మ పాటలకు కోలాటాలు, నృత్యాలు, ఆట పాటలు అలరించాయి. తెలంగాణాలో ఘనమైన చరిత్ర ఉన్న బతుకమ్మ పండుగ ఆడపడుచులకు అత్యంత ప్రీతి ప్రాయమైందని డిఆర్‌ఓ హరిప్రియ అన్నారు.



## అమ్మవార్లకు ఎంపి ఈటల ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/నాగారం:** అమ్మవారి దయ అందరిపై ఉండాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఈస్ట్ గాంధీ నగర్ కాలనీ, రాంపల్లిలో అమ్మవార్లకు ఈటల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారిని నిర్వహికులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాది రెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు, నిర్వహకులు, కాలనీవాసులు తదతరులు పాల్గొన్నారు.

**ఎస్‌వి నగర్ కాలనీలో :** గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవి అవతారం లో ఉన్న అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. గురువారం ఠాకూర్ బాలాజీ సింగ్,మామిడి నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



**అల్వాల్‌లో :** శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వెంకటాపురం డివిజన్ కనజిగూడ లోని దుర్గాదేవి అమ్మవారిని



మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ దర్శించుకుని అనంతరం అమ్మవారి సన్నిధి లో విద్యార్థులకు నోటు బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాణిక్య రెడ్డి, రవికిరణ్ అంతోని, మురళీకృష్ణ, మహిపాల్ రెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



## సృష్టికి మూలం...శక్తి రూపం

### ముఖ్యఅతిథిగా నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** సృష్టికి మూలం అమ్మవారని, శక్తి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో భాగ్యమని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలోని శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కార్పొరేటర్ చీరాల నరసింహ, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపాలంకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దైవ చింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అమ్మవారి చల్లని చూపు ప్రజలపై తప్పక ఉంటుందన్నారు.బోడుప్పల్ నగర ప్రజలందరిని అమ్మవారు చల్లగా ఉండేలా చూడాలని మొక్కారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దైవ చింతనలో ఉండలన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బోమ్మక్ బాలయ్య, తోటకూర రవీందర్ యాదవ్, నాయకులు దొంతర బోయిన కృపా సాగర్ ముదిరాజ్ నిర్వాహకులు కుక్కల రాజు, కుక్కల స్వామి, రాజు యాదవ్, సాయికుమార్, చందు, బాలు, రాజు, బుంగ శివ, కిట్టు, యశ్వంత్,అలివేల, జయంతి,కవిత, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కలెక్టర్ శశాంక





**ప్రజాపక్షం/కొందుర్గు:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం కొందుర్గు మండలానికి రానున్నారు. మండల కేంద్రంలో ఇంటిగ్రేటెండ్ పాఠశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి శుక్రవారం శంఖుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా మండల కేంద్రంలోని ఐరన్ పరిశ్రమ వెనకాల నిర్మాణం చేయనున్న ఇంటి గ్రేటెండ్ పాఠశాల స్థలాన్ని చదును చేయించారు. షాద్‌నగర్ – పరిగి రోడ్డు నుంచి పరిశ్రమ ముందు నుంచి ఉన్న మట్టి రోడ్డులో ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చించారు. సభావేదిక, హెలిపాడ్ కోసం చదును చేసిన స్థలాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ శశాంక, శంషాబాద్ డిసిపి రాజేష్, ఆర్‌డిఒ వెంకట మాధవరావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు. పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దగ్గరుండి చేయించారు.

అన్ని శాఖల అధికారులు ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. విజయదశమి సెలవులు ఉన్నా, అధికారులందరూ సభ నిర్వాహణ పనుల్లో పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలపై సూచనలు చేయాలి

### రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పేర్లు, లొకేషన్ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరిస్తూ, తగు సలహేలు, సూచనలు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. గురువారం సమీకృత రంగారెడ్డి జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల లొకేషన్ల పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాలలోని 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే, వాటికి సంబంధించి సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయుటకు గుర్తించడం జరిగిందని, పార్టీల వారికి వివరించారు. ప్రతిపాదించిన సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లొకేషన్ ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే తెలియజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఐ, బిఆర్‌ఎస్, ఎంఐఎంల తోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో నిరుపేదలకు మేలు

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఎంతో మేలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని నిరుపేదలకు కల్యాణలక్ష్మీ, షాధీ ముబారక్ చెక్కులు జిల్లా గ్రంధాలయ చైర్మన్ మధుసుదన్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం లో అపుల పాలైన తెలంగాణ రాష్ట్రం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండ ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు.మండలంలోనిఅన్ని గ్రామ పంచాయతీల మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాట్లు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారులను ఏర్పా టు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్, తహశీల్దార్ అన్వర్, డిప్యూటి తహశీల్దార్ మధు, రెవెన్యూ సిబ్బంది రాము, మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని శ్రీ విష్ణు శివాలయంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారి ఏడిఈ రమణ రెడ్డికి గురువారం కమిటి సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా సరిపోక విద్యుత్ అంతారాయం ఏర్పడుతుందన్నారు. అదనంగా 10 స్తంబాలు ఏర్పాటు చేసి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు రవీందర్‌గౌడ్, నాయకులు దోసకాయలవెంకటేష్, లక్ష్మ న్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామపంచాయతి కార్మికులకు దసరా పండగ సందర్భంగా మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్ దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, యూసుఫ్, జగదీష్, గ్రామపంచాయతి కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## నిర్ణీత సమయంలో సిఎంఆర్ డెలివరీ చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సిఎంఆర్ ఖరీఫ్, రబీ 2023–24 సంబంధించి డెలివరి పై రైస్ మిల్లర్లతో, డిప్యూటి తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ మిల్లు పట్టిన బియ్యాన్ని ఎఫ్‌సిఐకి , సివిల్‌సికి ఈనెల 31వరకు డెలివారి చేయలని అదేశించారు. 2024–25ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి మిల్లర్లు అగ్రిమెంటు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి , తదితరులు పాల్గోన్నారు.

**ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భూములు క్రమబద్దీకరణకు వచ్చిన దరఖాస్తులను పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ సుధీర్**

వికారాబాద్ జిల్లాలోని ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను, వికారాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలోని అక్రమ లేవుట్లు క్రమబద్దీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను అన్ని శాఖ ల అధికారులు సమన్వయముతో క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే జిల్లాలో మహిళా శాక్తి క్యాంటీన్ లు వికారాబాద్ , తాండూర్, కొడంగల్ ,పరిగి లలో ఏర్పాటు చేసే క్యాంటిన్ లు ఏర్పాటు చేసే మహిళలకు శిక్షణను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పడి మెప్మా రవికుమార్ , మున్సిపల్ అధికారుల, తదితరులు పాల్గోన్నారు.



## బాచుపల్లి, సాయినగర్‌లో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

### బహుమతులను అందజేసిన కార్పొరేటర్ కాసాని శిరీష వీరేశ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి, సాయినగర్‌లో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను స్థానిక కార్పొరేటర్ కాసాని శిరీష వీరేశ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాసాని శిరీష వీరేశ్ ముదిరాజ్ భారీ బతుకమ్మతో ఆకర్షణీయంగా నిలిచారు. బతుకమ్మ ఆట పాటలతో స్థానిక మహిళలతో కలిసి ఆడారు. అనంతరం మహిళలకు కార్పొరేటర్ కాసాని శిరీష వీరేశ్ బహుమతులను అందజేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలం బొదునంపల్లిలో అనారోగ్యం తో మృతి చెందిన తుడుం పెంటమ్మ కుటుంబానికి దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. పెంటమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5 వేలు, గ్రామ నాయకులు పిప్పళ్ల శేఖర్ రూ.3 వేలు అందజేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నీల పాండు, కోటేశ్వర్, రాధాకృష్ణ, పిప్పళ్ల రాజు, తుడుం మల్లేష్, లక్ష్మయ్య, వెంకటేష్, ఆవ కుమార్, గణేష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## వైద్యంకోసం సిఎం రిలీఫ్ ఫండ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వైద్యం కోసం ఎదురు చూస్తున్న పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ఇద్దరికి చెక్కులను గురువారం అందచేసారు. వినాయకనగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మి నారాయణకు రూ.31,500, మహేందర్‌రెడ్డికి రూ.49,500 అందించారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం కోసం ఎవరూ బాధ పడాల్సిన పని లేదని, అవసరం ఉన్న వారు తనను సంప్రదించాలని ఆయన కోరారు.



## బొమ్మలపల్లి నర్సింహ్మాయాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాపక్షం/ శామీర్‌పేట :** మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్‌గా నియమితులైన బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌కు అభినందలు శుభాకాంక్షలు వెల్లువెత్తున్నాయి. గురువారం కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజి ఎంఎల్‌ఏ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, కుత్బుల్లపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలను హన్మంతరెడ్డి, భూపతి రెడ్డి నర్సారెడ్డిలు నర్సింహాయాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు కర్రె రాజేష్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, వర్కింగ్ ప్రసిడెంట్ జగన్నాదం, రమేష్, సీనియర్ నాయకులు బాల్‌నర్సింహా, వెంకట్‌రెడ్డి, నర్సింలు, శశిధర్‌రెడ్డి, యూసుఫ్, భానుచందర్, గోపి, లక్ష్మ న్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/దుండిగల్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ ఇంద్రన్న కాలనీలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షురాలు పాలబిందెల సిందూరి, రాధికా, గంగామణి, సుజాత, సునీత, పావని, లక్ష్మి, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

# రిటైర్మెంట్ ప్రకటించిన టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్



**న్యూఢిల్లీ :** టెన్నిస్ దిగ్గం రఫెల్ నాదల్ తాజాగా ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ ఏడాది నవంబర్‌లో డేవిస్ కప్ ఫైనల్స్‌లో చివరి ప్రదర్శన చేసిన ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టి అభిమానులకు షాకిచ్చారు. నవంబర్‌లో జరగనున్న డేవిస్ కప్ ఫైనల్ తర్వాత ఈ ఆటకు వీడ్కోలు పలుకుతానంటూ ప్రకటించాడు. 'నేను ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్ అవుతున్నాను. గత రెండేళ్లు నాకు ఎంతో కఠినంగా గడిచాయి. ఈ నిర్ణయం తీసుకోవడానికి నాకు కొంత సమయం పట్టింది. కానీ, జీవితంలో ప్రతిదానికీ ప్రారంభం, ముగింపు అనేది ఉంటుంది' అంటూ నాదల్ పేర్కొన్నాడు. గత నెలలో జరిగిన లేవర్ కప్ నుంచి తప్పుకొన్నాడు. 38 ఏళ్ల నాదల్ చివరగా పారిస్ ఒలింపిక్స్‌లో ఆడాడు. సింగిల్స్‌లో రెండో రౌండ్లోనే జకోవిచ్ చేతిలో ఓడాడు. డబుల్స్‌లో అల్కరాస్‌తో కలిసి క్వార్టర్స్ వరకూ వెళ్లాడు.

**2005 నుంచే టైటిళ్ల వేట**

ఫ్రెంచ్ ఓపెన్‌లో నాదల్ టైటిళ్ల వేట 2005లో మొదలైంది. ఆ తర్వాత నుంచి అతడికి ఈ ఆటలో తిరుగే లేకుండా పోయింది. అలా 2006, 2007, 2008, 2010, 2011, 2012, 2013, 2014, 2017, 2018, 2019, 2020, 2022లోనూ ఈ స్టార్ ప్లేయర్ విజేతగా నిలిచాడు. ఇతర గ్రాండ్ స్లామ్ టోర్నీల్లోనూ సత్తా చాటిన నాదల్, తన కెరీర్‌లో మొత్తం 22 మేజర్ టైటిళ్లను సొంతం చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ అంటే నాదల్, నాదల్ అంటే ఫ్రెంచ్ ఓపెన్ అన్నట్లుగా క్రీడాభిమానులను అలరించాడు రఫెల్ నాదల్. అతడి కంచుకోటలో ఊహకందని రీతిలో అతడు ఏకంగా 14 టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఇటీవలె జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లో మాత్రం తొలి రౌండలోనే జ్వెరెవ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. తొలిసారి రొలాండ్ గారోస్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రత్యర్థులపై నిర్దాక్షిణ్యంగా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన అతడు, ఇలా తొలి రౌండ్లో కంగుతినడం విచిత్రంగా అనిపించిందని అభిమానులు అంటున్నారు. అయితే ఏడాదిన్నరగా అతడ్ని వెంటాడుతున్న గాయాలు, ఫిట్‌నెస్ లేమి, ఇలా పలు కారణాల వల్ల నాదల్‌లో ఒకప్పటి జోరు లేదన్నది విశ్లేషకుల మాట. తుంటి, ఉదర కండరాల గాయాల కారణంగా 2023 జనవరి నుంచి 15 మ్యాచ్‌లే ఆడిన నాదల్ గెలుపోటముల రికార్డు 8 7. చాలా కాలం నంబర్‌వన్‌గా కూడా ఉన్న ఈ స్టార్ ఇటీవల ఎక్కువగా ఆడకపోవడం వల్ల 275వ ర్యాంకుకు పడిపోయాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగాడు. దీంతో తొలి రౌండ్లోనే నాలుగో సీడ్ జ్వెరెవ్‌తో తలపడాల్సి వచ్చింది. అయితే ఆ ఓటమి నేపథ్యంలో నాదల్‌తో పాటు, అతడికిదే చివరి ఫ్రెంచ్ ఓపెన్ మ్యాచ్ అని అర్థం కావడం వల్ల అక్కడి ప్రేక్షకులు కూడా భావోద్వేగానికి లోనయ్యారు. మళ్లీ ఫ్రెంచ్ ఓపెన్ ఆడతానని కచ్చితంగా చెప్పలేనంటూ అప్పుడే నాదల్ చెప్పడం గమనార్హం. 'అందరికీ కృతజ్ఞతలు. నాకు ఈ సమయంలో మాట్లాడానికి చాలా కష్టంగా ఉంది. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడటం ఇదే చివరిసారా అన్న ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. గత రెండేళ్లలో గాయాల వల్ల నేను చాలా ఇబ్బందిపడ్డాను. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పడమైతే కష్టం. కానీ నేను ఇక్కడికి తిరిగి రాకపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అది నూరు శాతం అని కూడా నేను చెప్పను. ఒలింపిక్స్ కోసం మాత్రం ఇక్కడికి మళ్లీ వస్తానని ఆశిస్తున్నాను' అంటూ నాదల్ ఎమోషనల్ అయ్యారు.

# బ్రూక్ ట్రిపుల్, రూట్ డబుల్ సెంచరీ



## పాకిస్థాన్ పై రెచ్చిపోయిన ఇంగ్లాండ బ్యాటర్లు!

**ముల్తాన్** వేదికగా పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లాండ పరుగుల వరద పారిస్తోంది. ఆ జట్టు స్టార్ ప్లేయర్స్ హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీతో చెలరేగిపోగా, మరో జో రూట్ డబుల్ సెంచరీతో విజృంభించారు. దీంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌ను 823 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్ 322 బంతుల్లో 317 పరుగులు సాధించాడు. 29 ఫోర్లు, మూడు సిక్సర్లతో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అలాగే జో రూట్ 375 బంతుల్లో 262 పరుగులు బాదాడు. అందులో 17 ఫోర్లు ఉన్నాయి.

**రెండో బ్యాటర్‌గా రికార్డు**

బ్రూక్ తన ట్రిపుల్ సెంచరీని 310 బంతుల్లో పూర్తి చేశాడు. దీంతో ఫాస్టెస్ట్ ట్రిపుల్ హండ్రెడ్ చేసిన రెండో ప్లేయర్‌గా ఘనత సాధించాడు. టెస్టుల్లో ఫాస్టెస్ట్ ట్రిపుల్ సెంచరీ రికార్డు టీమ్ఇండియా దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. సెహ్వాగ్ 2008లో సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 278 బంతుల్లోనే ట్రిపుల్ సెంచరీ బాదాడు.

**మరిన్ని రికార్డులు బద్దలు**

ముల్తాన్ వేదికగా పాక్‌పై జో రూట్ డబుల్ సెంచరీ బాదటం వల్ల ఇంగ్లాండ తరఫున అత్యధిక 250+ స్కోరు చేసిన మూడో బ్యాటర్‌గా నిలిచాడు. పాక్‌పై ఈ మార్క్‌ను తాకిన రెండో అంతర్జాతీయ బ్యాటర్‌గా ఘనత సాధించాడు. అలాగే ఈ రికార్డు సాధించిన తొలి ఇంగ్లాండ ప్లేయర్‌గానూ చరిత్రకెక్కాడు. అయితే పాకి పై సెహ్వాగ్ తోపాటు రూట్ కూడా రెండోసారి 250+ పరుగులు చేశాడు.

**రికార్డు భాగస్వామ్యం**

జో రూట్‌హ్యారీ బ్రూక్ నాలుగో వికెట్ కు ఏకంగా 454 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో రూట్‌బ్రూక్ టెస్టు క్రికెట్ లో నాలుగో అత్యధిక పరుగుల భాగస్వామ్యాన్ని నమోదుచేసిన జోడీగా నిలిచారు. ఈ జాబితాలో శ్రీలంక జోడీ కుమార సంగక్కరమహేల జయవర్ధనే (624 పరుగులు), జయసూర్యమహనామా (576 పరుగులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. మూడో స్థానంలో న్యూజిలాండ్ కు చెందిన మార్టిన్ క్రోవ్‌ఆండ్రూ జోన్స్ (467 పరుగులు) ఉన్నారు.

**ఆరో ప్లేయర్‌గా బ్రూక్ రికార్డు**

ఇక ట్రిపుల్ సెంచరీ సాధించిన హ్యారీ బ్రూక్ పలు వ్యక్తిగత రికార్డులు నమోదు చేశాడు. ఇంగ్లాండ తరఫున ట్రిపుల్ సెంచరీ బాదిన ఆరో ప్లేయర్‌గా రికార్డు సాధించాడు. అతడి కంటే ముందు లియోనార్డ్ హట్టన్ (364), వాలీ హమ్మండ (336*), గ్రాహమ్ గూచ్ (333), ఆండీ సాందమ్ (325), జాన్ ఎడ్రిచ్ (310*) ఈ ఘనత అందుకున్నారు.

ముల్తాన్ వేదికగా జరుగుతున్న మొదటి టెస్టులో పాకిస్థాన్ తొలుత బ్యాటింగ్ చేసి 556 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీ, జో రూట్ డబుల్ సెంచరీ బాదటం వల్ల భారీ స్కోరు చేసింది. 7 వికెట్ల నష్టానికి 823 పరుగుల చేసి తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగుల ఆధిక్యంలో ఉంది.

రీల్



# 'హను మాన్' యూనివర్స్ నుంచి మహా కాళీ..

**మ**న టాలీవుడ్ లో మొదటి సూపర్ హీరో చిత్రం హను మాన్ కోసం అందరికీ తెలిసిందే. మరి యంగ్ హీరో తేజ సజ్జతో దర్శకుడు ప్రశాంత్ వర్మ చేసిన ఈ సినిమా సెన్సేషనల్ హిట్ కాగా ఈ సినిమా తర్వాత తన నుంచి మరిన్ని భారీ చిత్రాలు వస్తాయని కన్ఫర్మ్ చేశారు. అలా ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మూడో సినిమాని ఈ దేవి నవరాత్రుల సమయంలో అనౌన్స్ చేశారు. మరి అనుకున్నట్టుగానే తన నుంచి ఒక లేడీ ఓరియెంటెడ్ సినిమా వస్తున్నట్టుగా టాక్ వచ్చింది. మరి నేడు అనుకున్నట్టుగానే మహా కాళీ అనే సినిమాని తన హను మాన్ యూనివర్స్ కి అనుసంధానం చేస్తూ రివీల్ చేశారు. మరి దీనిపై వదలిన అనౌన్సమెంట్ వీడియో కూడా ఇంట్రెస్టింగ్ గా అంచనాలు పెంచే విధంగా ఉంది. అలాగే ఈ చిత్రాన్ని లేడీ దర్శకురాలు పూజా కొల్లూరు వర్క్ చేయనుండగా రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మాణం వహిస్తున్నారు. మరి ఈ సినిమాపై మరిన్ని డీటెయిల్స్ మున్ముందు రానున్నాయి.



# సంయుక్తా మీనన్ కొత్త సినిమా! లాంచ్

**అం**దాల భామ సంయుక్తా మీనన్ ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఆమె ఇప్పుడు ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమాలోనూ నటించేందుకు సిద్ధమయ్యింది. ఈ సినిమాను హాస్య మూవీస్ బ్యానర్ ప్రొడ్యూస్ చేయనుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దర్శకుడు యోగేష్ కెఎంసి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా పవర్‌ఫుల్ లేడీ యాక్షన్ థ్రిల్లర్‌గా రానుందని మేకర్స్ తెలిపారు. ఇక హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హల్క్ రానా దగ్గుబాటి హాజరై క్లాప్ కొట్టగా.. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకులు వెంకీ కుడుముల, కోన వెంకట్, వశిష్ఠ, రామ్ అబ్బరాజు, సురేష్ బాబు, జెమినీ కిరణ్, సాహు గారపాటి, చుక్కపల్లి అవినాష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమాను రాజేష్ దండా ప్రొడ్యూస్ చేస్తుండగా, సంయుక్తా మీనన్ తొలిసారి ఈ సినిమాను సమర్పిస్తుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# 'వార్ 2'లో మరో ఇద్దరు హీరోలు

**ప్ర**స్తుతం 'దేవర' సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ నెక్స్ట్ దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో ఓ సిని మా చేయబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఆయన 'దేవర' షూటింగ్ సమయంలో బాలీవుడ్ బడా ప్రాజెక్ట్ 'వార్ 2'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి షూటింగ్‌లోనూ పాల్గొన్నారు. ఈ చిత్రంలో స్టార్ హీరో హృతిక్ రోషన్‌తో కలిసి స్క్రీన్‌ను పంచుకోనున్నారు. తాజాగా ఈ క్రేజీ మల్టీ స్టారర్ 'వార్ 2' గురించి ఓ ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది. సినిమాకు మరిన్ని ఆకర్షణలు జోడించనున్నారట. అదేంటంటే ఈ చిత్రంలో తారక్, హృతిక్‌తో పాటు మరో ఇద్దరు హీరోలు కూడా కనిపించనున్నారని సమాచారం అందింది. కండల వీరుడు సల్మాన్ ఖాన్ ఈ సినిమా చివర్లో స్పెషల్ ఎంట్రీ ఇస్తారని ముంబయి సినీ వర్గాల టాక్. అలానే శాండల్‌వుడ్ హీరో 'మార్టిన్' ఫేమ్ ధ్రువ సర్జా కూడా 'వార్ 2'లో భాగం కావొచ్చని సమాచారం. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట్లో జోరుగా చక్కర్లు కొడుతోంది. కాగా, 'వార్ 2' షూటింగ్ ప్రస్తుతం తారక్ లేకుండానే జరుగుతోంది. అందుకే ఆయన లేని టాకీ పార్ట్, సాంగ్స్‌ను పూర్తి చేస్తున్నారట. దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రీసెంట్‌గా ఇటలీలో జరిగిన కీలక షెడ్యూల్‌లో హృతిక్, కియారా అద్వానీపై కొన్ని సీన్స్‌తో పాటు ఓ పాటను కూడా షూట్ చేశారు. దసరా అవ్వగానే ఎన్టీఆర్ 'వార్ 2' సెట్లలో అడుగు పెడతారట. అప్పుడు హృతిక్, తారక్‌పై కీలకమైన క్లైమాక్స్ సీన్స్‌తో పాటు ఈ ఇద్దరు హీరోలపై ఓ సాంగ్‌ను చిత్రీకరిస్తారని తెలిసింది.

# అధికారులను అప్రమత్తం చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దసరా పండుగ సందర్భంగా తెలంగాణలో పలు జి ల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి గురువారం అదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా నాటుసారా తయారీ ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో దాడులను నిర్వహించాలని అదేశించారు. నాటుసారా ప్రభావం కలిగిన అదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నల్లగొండ జి ల్లాలో ఎక్సైజ్‌తో పాటు స్టేట్ టాస్క్‌ఫోర్ (ఎస్‌టిఎఫ్), డిస్టిక్ టాస్క్‌ఫోర్స్ (డిటిఎఫ్) సిబ్బంది నిఘ పెట్టాలని అన్నారు.ఇదే తీరులో గంజాయి, డ్రగ్స్ ప్రత్యేక దృష్టి పెట్టాలని హైదారాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, మెదక్, నిజామాబాద్, కరీంనగర్. జి ల్లాలో దాడులు నిర్వహించాలని అదేశించారు. నారాయణపేట్, గద్వాల, సూర్యపేట, అదిలాబాద్, జి హెచ్ఎంసీ పరిధిలో నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్న రాకుండా చూడడంతోపాటు , వచ్చిన వెంటనే పట్టుకునే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని అన్నారు.

# 2.310 కిలోల గంజాయి పట్టివేత..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దూల్‌పేట్, పూరానాపూల్, జుమ్మెరాత్ బజార్ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ టీం లీడర్ నంద్యాల అంజిరెడ్డి అదేశాల మేరకు దాడులు నిర్వహించి రెండు కేసుల్లో 2.310 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ రెండు కేసుల్లో మూడు మోటార్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్‌లు, ముగ్గురిని అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని అంజి రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలో జి యా గూడకు చెందిన జి . రాజు, వికాష్ జాదవ్, విఠల్ ఉన్నారు.దూల్‌పేట్‌కు చెందిన రవికురీల్, యశ్‌పాల్ సింగ్ , రేఖ, దేవిలు పరారాలో ఉన్నారు. ఈ దాడుల్లో సిఐ మధుబాబు, గోపాల్, ఎస్ఐలు సైదులు , మధు , హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి,, అజీమ్, శ్రీధర్ , కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్‌లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న టీమును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి అభినందించారు.


















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com